# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక జూలై 2011 ₹ 20




మహాభారతం

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada.*

**సంపుటి 22 జులై 2011 సంచిక 7**



*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*రెసిడెంట్ ఎడిటర్*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*

కాండ్రేగుల నాగేశ్వర రావు

*సమాలోచక మండలి*

అన్నపరెడ్డి బుద్ధఘోషుడు

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి

డాక్టర్ జయధీర్ తిరుమల రావు

డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి

కుర్రా జితేంద్రబాబు

ముంగర జాషువ

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**



*Printed & Published by*

Bapanna Alapati

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads,

Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in

Visit us at : www.misimi-monthly.com

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹200

విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

e-magazine : www.kinige.com

*మీ చందా **మిసిమి** పేర పై చిరునామాకు పంపండి.*

మరిన్ని వివరాలకు 64వ పుట చూడండి.


## ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 3

ఒక కాలేజి – ఇద్దరు విద్యార్థులు ........ 5
– *డా. యు.ఎ. నరసింహమూర్తి*

నేనెరిగిన జాషువా! ........ 10
– *పెద్ది సత్యనారాయణ*

పదాలు, పథాలూ ఓ పదేళ్ళూ–3 ........ 16
– *వేగుంట మోహనప్రసాద్*

అహింస అంటే అ (తి) హింస? ........ 22
– *డా. సముద్రాల వేంకట కృష్ణ*

ఆత్రేయ – ఎన్జీఓ నాటకం ........ 25
– *డా. పోతుగుంట్ల విజయకుమార్*

ఇంటికి తిరిగిరాని బహుదూరపు బాటసారి ........ 28
– *కాండ్రేగుల నాగేశ్వర రావు*

ఒక శకం ముగిసింది (నటరాజ రామకృష్ణ)........ 32
– *మిసిమి*

యానాం చరిత్ర ........ 36
– *దాట్ల దేవదానం రాజు*

మాచు–పీచు (పెరూ) (ఆరోహణ–5)........ 40
– *ముక్తవరం పార్థసారథి*

అవసరాల అనసూయాదేవి – సంగీతం, సాహిత్యం........ 45
– *డా. వి. త్రివేణి*

ఎక్కడ గొట్టో, అక్కడ నట్టు – ఒక పరామర్శ ........ 49
– *డా. యార్లగడ్డ బాలగంగాధర రావు*

వీణల నరసయ్య ........ 53
– *జి.వి.ఆర్.కె. సుబ్బరాయమూర్తి*

ఆదరణ లేని దొమ్మరాట కళాకారులు........ 55
– *డా. డి.కె. ప్రభాకర్*

మచిలీ బందరు ........ 59
– *వంగోలు వెంకటరంగయ్య*

చదవండి (పుస్తక పరిచయం) ........ 61


*ముఖచిత్రం* : హుస్సేన్ చిత్రం (చార్లీ చాప్లిన్)

*రెండవ అట్ట* } ఇకెబన (వివరాలు 29 పుటలో)
*మూడవ అట్ట* }

*చివరి అట్ట* : అల్విదా...ఇక శెలవు!

నటరాజ రామకృష్ణ అనే వ్యక్తి పుట్టకపోతే మన నాట్యరీతులు – ముఖ్యంగా ఆలయ నృత్యాలు, లాస్య సంప్రదాయానికి చెందిన నాట్యము, తాండవ సంప్రదాయానికి చెందిన పేరిణి – వీటికి వ్యాకరణము – రూప విన్యాసాలు అక్షరబద్ధమయ్యేవి కావేమో. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి నాట్యన్నే ఆరాధించి, చివరి శ్వాసవరకూ ఆ కళకే సేవచేసిన కారణ జన్ముడు, సౌమ్యుడు రామకృష్ణ అస్తమయంతో ఒక శకం ముగిసింది. వీరు 47 గ్రంథాలు వ్రాశారంటే నమ్మలేరేమో. వాటినన్నిటినీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది.

తయ్యబ్ మెహతా, రజా, సౌజా, సతీష్ గుజ్రాల్ లాంటి దిగ్గజాల సరసన చేరిన హుస్సేన్ ఇంటికి తిరిగి రాలేక ఎక్కడో తనువు చాలించడం భారతీయులకు విచారకరమైన విషయమే. ఆయనకు నివాళిగా కొన్ని చిత్రాలు ముద్రిస్తున్నాం.

'యానాం చరిత్ర' ఎంతటి కల్లోలమయిందో – కరువు రక్కసి ఎంతటి దారుణాలు చేస్తుందో తెలుసుకుంటే ద్రవించి పోతాము.

ఎన్నో జానపద కళల్లో 'దొమ్మరాట' ఒకటి – దీనిని కేవలం పొట్టకూటికే ఆశ్రయించి – ప్రాణాలకు తెగించి ఇప్పటికీ రహదారుల ప్రక్కన చిన్నారులు – కన్న తల్లులు కూడా ప్రదర్శించటం సమాజ రుగ్మతలలో ఒకటే కాని – ఇది కళా పోషణ కాదు.

ఒక ఊరికి పేరు ఎవరు పెడతారు? అది ఆ విధంగా ఎందుకు ప్రచారం పొందుతుంది? దీని గురించి విశ్వవిద్యాలయాల్లో 'నామ విజ్ఞానం' (Onamastics) ఒక శాఖే వున్నది. ఇది ఒక పరిశోధనే.

**మిసిమి** కి ఎప్పటినుంచో అనేక వ్యాసాలు వ్రాసిన ఉమ్మడిశెట్టి శివలింగం ఇక లేరని తెలియచేయటానికి విచారిస్తున్నాం.

**– సంపాదకులు**



# కమ్మతెమ్మెరలు

**ఉ**త్తరాలతో పలకరించే పాఠకులకు అభివందనాలు. ఎంతో ఆసక్తితో **మిసిమి** చదివి మీ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్రాస్తున్నందుకు మా ఆనందాన్ని తెలుపుతూ, చేవగల్గిన ఉత్తరానికి **'సిద్ధార్థ'** పుస్తకం బహుమానంగా పంపుతున్నాము!

✶ "...కులదీప్ నయ్యర్ ప్రసంగం తెలుగులో సరళంగా ఉంది. నయ్యర్ పంజాబీ....మీరు నాయర్ అని ఇచ్చారు..."

**– యార్లగడ్డ బాలగంగాధర రావు,** వాయిస్ మెయిల్.

*ఈ పొరపాటు అనువాదకునిదే. అందుకు పూర్తి బాధ్యత అనువాదకుడు వహించి విచారం వ్యక్తం చేస్తున్నారు.*

✶ "...నేటి పత్రికా ప్రపంచంలోని అన్ని తెలుగు పత్రికలను పరిశీలించి చూస్తే 'మిసిమి'కి ఒక గొప్ప ప్రత్యేకత వున్నట్లు విశదమౌతుంది. దానికొక విలక్షణమైన పంథా వున్నదనేది నిర్వివాదాంశం. పత్రికలోని దాదాపు అన్ని రచనలూ చదివించే విధంగా వుండటం విశేషం. శీర్షికలు, రచనలు *'చింతనాత్మక సారస్వతం'* అనే పేరును సార్థకం చేసే విధంగా వుంటున్నవి. ముఖ్యంగా చిత్రకళకు, నాట్యకళకు, సాహిత్యానికి, భారతీయ సంస్కృతికి మీరు ఇస్తున్న ప్రాధాన్యం ఎంతో ప్రశంసనీయం. గొప్ప కళాకారుల బొమ్మలు ఫోటోల రూపంలో కాక గీసిన చిత్రాలు (స్కెచ్‌లు)గా వెయ్యటమన్నది పత్రికకు విలక్షణతను సంతరించి పెడుతున్నదని నా అభిప్రాయం. అయితే 'పుస్తక పరిచయం' శీర్షికను వేస్తున్న సమీక్షలు సంక్షిప్తంగా వుండటం పాఠకులకు కొంత అసంతృప్తిని కలిగిస్తున్నదేమో అని నా అనుమానం..."

**– ఎలనాగ,** హైదరాబాద్.

✶ *"...'మిసిమి' మాసపత్రిక కాదు.. జాతీయ అంతర్జాతీయ సాహిత్యచరిత్ర.* ఎందరో ప్రముఖ కవుల వివరాలు, కవితలు ప్రచురించి ప్రోత్సహిస్తూ, సాహిత్యసేవలో నిర్దుష్టత, నిబద్ధత కొట్టొచ్చినట్లు ఉంటుంది. అట్టమీది బొమ్మ క్రింద మహనీయుని పరిచయం, సాధారణ చరిత్రాంశాలు *సాహితీప్రియులకేగాక, పోటీ పరీక్షలకు వెళ్ళే విద్యార్థులకు, అందరకు విలువైన సమాచారాన్ని ప్రదానం చేస్తున్న 'మిసిమి' సర్వదా దాచి ఉంచుకోవలసిన 'విలువైన పుస్తకం'.* 'మిసిమి'కిదే మా 'ఖరనామ' అక్షరాంజలి..."

**– బండి ప్రసాదరావు,** పొదగట్లపల్లి.

✶ "...మంచి ముస్తాబుతో వస్తున్న 'మిసిమి'ని చదవటానికి చాలా ఉత్సాహంగా ఉంది. జనవరి నెల సంచికతో 'కాళోజీ నారాయణరావుగారి' వ్యాసం ఆయన కాలంలో తెలుగు భాష, ఎన్ని ఒడిదుడుకులకు లోనైందో భాషా వికాసానికి ఎందరో మహానుభావులు పడిన పాట్లు వారు తెలిపిన అనేక విషయాలు ఈ తరంవారికి కనువిప్పు. 'చదవండి' శీర్షిక చాలా బాగుంది. అచ్చొత్తినవారి పేరు, చిరునామా కూడా ఇస్తే తపాలాలో తెప్పించుకోవటానికి వీలుగా ఉంటుంది..."

**– మోటూరు శివరాంప్రసాద్,** హైదరాబాద్.

✶ "...నేను మార్చి 2011 సంచికలోని మొత్తం వ్యాసాలను చదివితిని. అందులో నాకు రెండు వ్యాసాలు చాలచాల నచ్చినవి. 'ఇంతింతై వటుడింతై'–జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారి జీవిత విశేషాలను ప్రచురించితిరి. ఇంతకుముందు వారి వ్యాసాలు చదివి వారికి ఉత్తరం రాద్దామని భావించి యుంటిని. కాని వ్యాసాలలో ఎక్కడా వారి చిరునామా ఉండేది కాదు. బ్రౌన్ భాష పరిశోధన ఒకటే తెలుసు. వారికి గత యేడాది 3, 4 రిప్లై కార్డులతో 'హనుమచ్ఛాస్త్రి గారి చిరునామా తెల్పండి' అని వ్రాసియున్నాను. కాని ఒక ఉత్తరానికి జవాబు కూడా రాలేదు. *యూనివర్సిటీకి ఇచ్చిన సంస్థ వలన మా అటువంటి వారిని లెక్కచేయని సంస్థగా మారిపోయి సంస్థానంగా మారుతుంది.* సామాన్యులకు అయితే ఎవరూ జవాబు వ్రాయరు. కావున నోరుమూసుకుని చల్లబడితిని. ఇప్పుడు 'మిసిమి' వ్యాసంద్వారా వారి జీవిత విశేషాలతోసహా వారి ఫోన్ కూడా దొరికింది. దానికి ఆనందించుచున్నాను..." **– కె. ఆనంద్,** నిజామాబాద్.

✶ "...గత దశాబ్ద కాలంనుండి పత్రికను చదువుతున్నాను. మంచి పత్రిక. కొత్తమార్పులు, చేర్పులతో రావడం చాలా బాగుంది. అట్టమీది బొమ్మలు, అట్టలోపలి బొమ్మలు (చిత్రాలు) పదిలపరచుకొనేలా ఉన్నాయి. మార్చి సంచిక 'నెపోలియన్' చిత్రంతో వెలువడింది. చూడముచ్చటగా ఉంది. సెంటర్ స్ప్రెడ్‌లో ఒక కవి / రచయిత / దేవత.. ఏదేని పోస్టర్ ఇవ్వండి. మేం ఫ్రేమ్ చేసుకోవడానికి అవకాశం వుంటుంది. పుస్తక సమీక్షలో ప్రచురణ కర్త / రచయిత ... చిరునామా గాని, ఫోన్ నెంబరుగాని చూపడంలేదు. మాకు కొంత ఇబ్బందిగా ఉంది..." **– జి. అశోక్,** కరీంనగర్.

✶ "...'మిసిమి' ఏప్రిల్ 2011 (మామిడికాయలు, పంచాంగశ్రవణం-గూడూరి ప్రభాకర్‌గారి ముఖచిత్రం) సంచిక ఈ రోజే (2/4) అందింది. ప్రభాకరరావుగారి పరిచయం (39వ పేజి) సంతోషాన్ని కలిగించింది. 'పదేళ్ల కవిత్వం' 'మో' వ్యాసం, 'మిక్కిలినేని'పై వ్యాసం, ముఖ్యంగా 'చాట్ల-నడచే నాటకం' (వార్ని నాలుగైదుసార్లు నటనలో చూశాను-రంగస్థలంపై ఉపన్యాసాలూ విన్నాను) చాలా బాగుంది. కె. రామలక్ష్మి 'పెళ్లిగోల', 'కాఫ్కా కోరిక' బాగా వూపింది. ఒక్కటి లోపించింది-కనీసం ఒక కొత్త కథ వేస్తే బాగుంటుంది. నిన్నటి, మొన్నటి, ఆ మొన్నటి కథలు వద్దు. ప్లీజ్-ఒక్క కొత్తకథ వెయ్యండి..." **– డా. మానేపల్లి,** యలమంచిలి.

✶ "...'ఒక టిబెట్ అమ్మాయి' అనే కవిత్వం చాలా బాగుంది. టిబెట్-చైనాకు మధ్య తగాద. బౌద్ధధమ్మ వ్యాప్తి గురించి, థోంపా రచయిత్రి మనోవేదన ఈ కవిత్వంలో ఉంది. చాలా విషయాలను, టిబెట్‌లో బౌద్ధం ప్రవేశించిన విధం గురించి తెలియబరచినందుకు, ధన్యవాదాలు. 'మిసిమి' సాహిత్యాభిరుచుల వారికి వరంలాంటిది. కాని 'మిసిమి'లో దళిత సాహిత్యం, బౌద్ధ సాహిత్యం గురించి అంతగా ప్రచురించటంలేదు. ఇది అన్నివర్గాలవారికి నచ్చేలా రావాలని నా కోరిక. ముఖ్యంగా బౌద్ధసాహిత్యం గురించి, ఎక్కువ హిందూ సంప్రదాయాల గురించే ఉంది తప్ప, దళిత బహుజన సాహిత్యం అంతగాలేదు. పుస్తక పరిచయంలో "బౌద్ధమతానికి సంబంధించిన పుస్తకాలను పరిచయం చేయండి. ఇందులో "భారతీయ ముస్లింల" గురించి వచ్చిన వ్యాసం కూడా బాగుంది..." **– సి. కపిల్,** ఆదిలాబాద్.

✶ "...'మిసిమి' – చింతనాత్మక సారస్వతం-నిజంగా సారస్వతానికి, ఆణిముత్యంలా భాసిస్తున్నదనుటలో సందేహంలేదు. సహజ వర్ణ ముఖచిత్రంతో 'ఉగాది' తీర్థప్రసాదాలతో-పంచాంగ శ్రవణంతో (మాసపత్రిక-'మిసిమి' ఏప్రెల్ 2011) సంచిక సర్వాంగసుందరంగావుంది. అలాగే రెండవ-మూడవ-చివరి అట్టలు గ్రామీణ సహజ అలంకరణలతో ముద్దొచ్చేట్లుగా వున్నాయి. 'కమ్మతెమ్మెరలు', ఉత్తరాలు, ఉబుసుపోక కోసం వ్రాసిన లేఖల్లా కాకుండా ముక్కుకు సూటిగా వదిలే అస్త్రాల్లా వున్నాయి. తెలుగు సాహిత్యానికి దిక్సూచిలా వుండి సముద్రయానం చేస్తున్నట్లుగావుంది.

'పదాలు, పథాలు-ఓపదేళ్లూ...' 'మో' గారి సమీక్ష కొత్త, పాత రచయిత (త్రు)లకు ఓ పరీక్షలాగా వుంది.

ఇలా వ్యాసాలూ-కవితలూ తిన్న చదువరులకు మేథకు మేతలా-పుష్టిలావుండి అమూల్య పత్రికలా 'మిసిమి' మిక్కిలి సిత్రపత్రికలా మిన్నయై రాణిస్తున్నది..." **– నమిలికొండ జగన్ మాధవరావు,** కరీంగర్.

✶ " ...భదంత ఆనంద కౌసల్యాయన్ వారు బుద్ధజయంతి ప్రత్యేక సంచికలో వర్ణవ్యవస్థను మరణ వ్యవస్థగా చెప్పుకుంటూ వచ్చారు. వీరి తర్కానికి చేదోడుగా చాలా శ్లోకాలనుగూడ ఉటంకించారు. ఇందులో కొత్తదనమేమి లేదు. వృత్తి జీవితాలు, కులవర్గాలుగా సమాజపరిణామంలో జరిగింది. దీనికి హిందూ చైతన్యాన్ని దూషించవలసిన అవసరం లేదు. ఏ కొద్ది మందో స్వార్థపరులు సంస్కృత శ్లోకాలను అడ్డంపెట్టుకుని లేదా ప్రత్యేకించి వ్రాసి, సమాజాన్ని తప్పుదారి పట్టించారు. అందుకు హిందూ ధర్మాన్ని, జాతిని అనాగరికమని మరణోన్ముఖమైన జాతి అని వాపోవలసిన అవసరంలేదు. వృత్తిపరమైన వర్గభేదాలు ప్రపంచంలో అన్ని సమాజాల్లో ఉన్నాయి. ఎప్పుడో మరణించిన వర్ణవ్యవస్థను భయంకరంగా వర్ణించిన భదంతగారు (వీరు ఉన్నారో లేదో తెలియదు) జ్ఞానార్జన ఏరకంగా జరిగిందో వీరికి? దయచేసి ఇటువంటి వ్యాసాలను ప్రచురించవద్దని 'మిసిమి'కి విజ్ఞప్తి చేస్తూ, ఇప్పుడు రాముడు, కృష్ణుడు ఎవరికీ ఆదర్శం కాదు. విద్య అందరికీ అందుబాటులో ఉంది. కులవ్యవస్థ కూకటివేళ్లతో కాకపోయినా నగరీకరణతో అంతరించి పోతుంది (అంటే అన్నివృత్తులూ అందరూ చేస్తునారన్నమాట). ఇంకెక్కడి మరణవ్యవస్థ? దయచేసి సమాధులు త్రవ్వి ఎముకలు తీయకండి..."

**– రాఘవ,** మియాపూర్, హైదరాబాదు (వాయిస్ మెయిల్).

# ఒక కాలేజి - ఇద్దరు విద్యార్థులు

*- యు.ఎ. నరసింహమూర్తి*

విజయనగరం మహారాజ కళాశాల విద్యార్థులెందరో తెలుగులో గొప్ప కవులు, రచయితలుగా పేరు పడ్డారు. అలా పేరుపడ్డ రచయితల్లో ఆదికి ముందువాడు గురజాడ. ఇప్పటికి చివరాఖరివాడు పతంజలి. కన్యాశుల్కం అన్న హాస్య కళాశాలలో గురజాడ గురువు. పతంజలి విద్యార్థి. గురజాడ ప్రభావం తనమీద ఉందని పతంజలి తన నోటితోనే చెప్పుకున్నాడు. గురువు ఆకులమీద నడిస్తే, శిష్యుడు చిగుళ్ల మీద నడవాలనుకున్నాడు. ఈ ఇద్దరి మధ్యా నూరేళ్ల వారా ఉంది. ఈ నూరేళ్లలో సమాజం ఊహించనంతగా మారిపోయింది. అయితే సమాజం లోలోపలి నైజం మారిపోలేదు. ఆ నైజమే గురు శిష్యులిద్దరికీ శైలీసూత్రం అయింది. రచనా మార్గమయింది. వ్యంజన సూత్రమయింది. సహృదయుల మీద పూలజల్లు, సామాజిక దౌష్ట్యాల మీద అంపజల్లు ఏకకాలంలో కురిపించడం వీరి హాస్యశైలికి లక్ష్యమయింది. ఇద్దరి శైలికి విజయనగరం జిల్లాలోని వివిధ కులాల, వర్గాలవారి భాష ప్రమాణమయింది. ఇద్దరూ వాస్తవికవాదులే. గురజాడ కాలంకంటే, పతంజలి కాలానికి తెలుగు సాహిత్యంలో ప్రయోగవాదం ఎక్కువయింది. అయినా పతంజలి శైలి, వస్తువు, అభివ్యక్తి మార్గాలలో అందరూ అనుసరించే ప్రయోగవాదాల జోలికి పోలేదు. ఆయన రాత విలక్షణమైన, దేశీయమైన ప్రయోగవాదంగా నిలిచింది. గురజాడ కంటే ఎక్కువగా పతంజలి జానపద జీవనశైలిని, గ్రామీణ తరాన్ని కొల్లగొట్టి సరికొత్త సృజనమార్గాన్ని సొంతం చేసుకున్నాడు.



గురజాడ

సర్వసాధారణ విషయాలను నేరుగా కాకుండా ఒక అబ్బురపాటును కలిగించే వింత లోకాలలోంచి వెల్లడించే పురాతన జానపద కథనశైలిని అనుసరించి రచయితగా తన వ్యక్తిత్వాన్ని నిలుపుకున్నాడు. గురజాడ బ్రాహ్మణుడు, పతంజలి క్షత్రియుడు. ఇద్దరూ సమకాలీనంగా తమకులాల్లో పెరిగిపోయిన కుళ్లును కడిగెయ్యడానికి కలం పట్టారు. వీళ్లిద్దరికీ మధ్యకాలంలో ఇంకొకరెవరూ ఈ పని చేయడానికి ధైర్యంగా ముందుకు రాలేకపోయారు. గురజాడ కులవ్యవస్థ, న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ అనే మూడు ప్రమాణాల (Three dimential) సంఘంమీద ముప్పేట దాడిచేస్తే, గురజాడ కాలానికి వికసించని పత్రికావ్యవస్థ అనే నాలుగో ప్రమాణం మీద (Fourth dimention) తన కలాన్ని కత్తిగాచేసి, ఝుళిపించాడు. తుపాకిగా పేల్చాడు. పతంజలి “పిలక తిరుగుడు పువ్వు”తో ఒక దెబ్బకు నాలుగు పిట్టలు అన్న కొత్త నానుడి పుట్టింది. వీళ్లిద్దరి హాస్యశైలి పుండుమీద కారం చల్లినట్లుండదు. గాజుగుడ్డ కట్టినట్లుంటుంది. పతంజలి గురజాడ తరువాత వచ్చిన నూరేళ్ల ఉత్తమ ప్రపంచ సాహిత్యాన్ని ఆకళింపు చేసుకున్నాడు, అరిగించుకున్నాడు, తన శైలిలో రంగరించుకున్నాడు. గురజాడ కంటే ఆయన అనుభవం విస్తరించింది. ఇంత జరిగినా గురజాడ అనే వేగుచుక్క వెలుగుదారిలో పతంజలి తన పాదముద్రలను విడిచివెళ్లాడు.

అధిక్షేపశైలి కారణంగా తెలుగు రచయితలలో ఒక విలక్షణమైన గుర్తింపును పొందిన పతంజలి రచనలలో కొన్ని

డా. యు.ఎ. నరసింహమూర్తి, ఫోన్: 08922-226915

తాను పుట్టిపెరిగిన సమాజానికి సంబంధించినవి, కొన్ని తన జీవితానుభవాన్ని విస్తరింపజేసిన సమాజానికి సంబంధించినవి కనిపిస్తాయి. ఇందులో తాను పుట్టిపెరిగిన సమాజానికి సంబంధించిన రచనలలో పతంజలి తన కులమాండలికంతో పాటు అలమండ, జామి, ఎస్.కోట, కోరుకొండ, డెంకాడ ప్రాంతాలకు సంబంధించిన నిమ్నవర్గాల ప్రజల సహజము, సజీవము అయిన మాండలికాన్ని తీసుకొని గురజాడలో ప్రయోగ ప్రాయంగా కనిపించిన నిందాపూర్వక అధిక్షేపశైలి (Invective) కి తెలుగులో ఒక గుర్తింపును తెచ్చాడు.

అజ్ఞానము, అతిశయము, మౌఢ్యము, కారణాలుగా జీవితాన్ని తప్పులతడకగా చేసుకొన్న ఒక వ్యక్తినిగానీ, సంస్థనుగానీ, ఒకానొక సమాజాన్నిగానీ తూర్పారాబట్టే నిమిత్తం నిందాపూర్వకమైన అధిక్షేపశైలిని ఉపయోగించడం పాశ్చాత్య సాహిత్యంలో కనిపిస్తుంది. ఇది మనం ఉపయోగించే వ్యాజోక్తి, వ్యాజనింద, వ్యాజస్తుతి వంటి అలంకారాల కంటే భిన్నమైన శైలిలో ఉంటుంది.

తాను పుట్టిపెరిగిన రాచకుటుంబాలలోని పురుషులలో కనిపించే అజ్ఞానం, అతిశయం, మౌఢ్యము అనే గుణాలకు తోడు వేట, జూదం, కోడి-పొట్టేళ్ళ పందాలు, వ్యభిచారంవంటి వ్యసనాలను, నిర్వ్యాపార లక్షణాలను, భేషజాలను తీవ్రంగాఖండిస్తూ అధిక్షేపశైలిలో పతంజలి వరుసగా రాజుగోరు (1982), వీరబొబ్బిలి (1984), గోపాత్రుడు (1991), పిలక తిరుగుడు పువ్వు (1994) అనే రచనలు చేశాడు. ఈ రచనలకు స్థలము, కాలము, పాత్రలు, సంఘటనలు, భాష-అన్నీ ఒకటిగా అనుస్యూత్రంగా ఉంటాయి. ఈ నాలుగూ కలిపితే, ఒక గొలుసు రచన అవుతుంది. ఇందులో స్వకీయమైన హాస్యశైలిని సృష్టించ దలచుకున్న పతంజలి కలానికి కన్యాశుల్కం కావలసినన్నిసార్లు అడ్డుపడింది. ఆ జ్ఞాపకాలనుండి, ప్రభావంనుండి, శైలినుండి బయటపడగల సత్తా ఉండి కూడా పతంజలి పదేపదే కన్యాశల్కం మీద తనకుండే గౌరవాన్ని ప్రకటించుకోవడానికే నిశ్చయించుకున్నట్లు కనిపిస్తుంది.

గ్రామీణులకు చదువుకున్నవాళ్లు కనిపించేసరికి విడదీయడానికి వీలులేని చిక్కుప్రశ్నలు వేసి వాళ్లమీద తమ ఎక్కువతనాన్ని వెల్లడించుకునే తర్కం ఒకటి ఉండేది. చదువుకున్న వాళ్లకంటే తామే తెలివైనవాళ్లమని ప్రకటించుకోవడం కోసం ఇలా చేసేవారు. కన్యాశుల్కం సారాదుకాణం దృశ్యంలో గ్రామీణుల సంభాషణలో ఇలాంటి తార్కికశైలి ఒకటి కనిపిస్తుంది.

*మునసబు:* ఆకాశం ముందు పుట్టిందా? బూవిఁ ముందు పుట్టిందా?

*మనవాళ్లయ్య :* సుత్తి ముందా, కారు ముందా?

*మునసబు :* పంగనావాఁలు ముందా, పట్టెవొదనాలు ముందా? నామాలోడా నా సవాలేటి? నీ జవాబేటి? ఆకాశానికి మట్టా బూవిఁ? బూవిఁకి కప్పా ఆకాశం? సదువుకొన్నోడెవడో సెప్పండొస్సి-

ఈ గ్రామీణ తర్కంలో అజ్ఞానం, అతిశయం, మౌఢ్యం ఇమిడి ఉన్నాయి. ఈ లక్షణాలకు ప్రజాస్వామ్యవ్యవస్థను అపహాస్యం చేసే లక్షణాన్ని కూడా జతపరచి సమకాలీన రాజకీయ ధోరణులు గ్రామాలను ఎన్ని విధాలుగా చీలుస్తున్నాయో స్పష్టం చేస్తూ గోపాత్రుడు, "పిలక తిరుగుడు పువ్వు" అనే రెండు చిన్న నవలల్ని రాశాడు పతంజలి. భూమి గుండ్రంగా ఉందని ఒక వర్గంవారు, బల్లపరుపుగా ఉందని ఇంకొక వర్గంవారు తమలో తాము కలహించుకొని తుపాకులు, కర్రలు, కత్తులతో దొమ్మీకి దిగడం, దాని మీద పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ-వాళ్లను ఆసరాగా చేసుకొని ఒకరి జుత్తు ఒకరు అందుకోవడానికి ప్రయత్నించడం ఈ రెండు నవలల్లోని కథాంశం. మాజిస్ట్రేటు తీర్పుకి సంబంధించిన వార్త ఇలా ఉంది.

"జీవితం అస్తవ్యస్తంగా నమ్మకాలకూ, ఆచరణకూ పొంతన లేకుండా అబద్ధాలమయంగా ఉన్నది కాబట్టి జీవితమే బల్లపరుపుగా ఉన్నది. కాబట్టి అలమండలో ఇలాంటి తగువు జరిగిందనే ఆయన భావించారు. భూమి గుండ్రంగా ఉంటే జీవితం ఇలా ఉండదనీ, జీవితం ఇలా ఉన్నాదంటే భూమి గుండ్రంగా లేదని అర్థమనీ ఆయన తర్కించి, భూమి బల్లపరుపుగా ఉన్నదని తీర్పు చెప్పారు. ఘర్షణకు దిగిన రెండు వర్గాల వారినీ ఆయన వెంటనే విడుదల చేశారు."

డి.ఎస్పీ పై వార్త చదివి కేసు కొట్టేసినందుకు కోపించి మాజిస్ట్రేటుకు ఊపిరి సలపకుండా కేసులమీద కేసులు బనాయించి పైకోర్టు జడ్జీముందు తలవంచుకునేలా చేశాడు. ఇదంతా వస్తుగతమైన హాస్యం. సమకాలీన సమాజంలోని,

వివిధ వ్యవస్థలు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి ఎలా భ్రష్టుపట్టి పోయాయో వస్తుగతమైన వ్యంగ్యశైలిలో నిపుణంగా ప్రదర్శించాడు పతంజలి. ఈ గ్రామీణ కుతర్కం ఒక శతాబ్ది కాలంలో పొందిన పరిణతని విశదంచేస్తూ హాస్యశైలిలో నూరేళ్లవారా ఎలా ఉంటుందో చూపించాడు పతంజలి.

వస్తువులోనే కాదు సన్నివేశాలలోను, సంభాషణలలోనూ, మాటలలోనూ కూడా గురజాడ జ్ఞాపకాలను పతంజలి వదులుకోలేదు. ఒకటి రెండు సన్నివేశాలు చూద్దాం.

"ఒకటేమాట అడుగుతారు జడిజీగోరు... ఆడే వదుగు తాడంటే, ముత్యాల్‌నాయుడేటన్నాడు? ఫలానీలాగన్నాడు. గ్రామస్థులందరేటన్నారు! ఫలానీ మాటన్నారు. పోలీస్ ఇనసుపెక్టరు ఏటన్నాడు? ఫలానీ మాటన్నాడు. మరింక పెదరాజు గోరేటన్నారు? ఫలానీ మాటన్నారు." -ఈ సంభాషణలో 'ఫలానీ మాట అన్నాడు' అన్న వాక్యాన్ని నాలుగుసార్లు పునశ్చరణ చేయడం కన్యాశుల్కంలో సౌజన్యారావు పంతులుతో మాట్లాడుతూ పోలిశెట్టి ఆరుసార్లు 'అబ్బెంతరవేఁటి?' అన్న వాక్యాన్ని పునశ్చరణ చేసిన సన్నివేశాన్ని గుర్తుకు తెస్తుంది. 'గోపాత్రుడు' లోని ఏడవభాగమంతా గిరీశం అగ్నిహోత్రావధాన్లు ఇంట్లో ప్రవేశించినప్పటి సన్నివేశంతో పాటు వివిధ ఇతర సన్నివేశాల సంభాషణలను గుదిగుచ్చిన సన్నివేశంగా కనిపిస్తుంది. ఇటువంటి రచన హాస్యపోషకమైనా రచయితకు లాఘవాన్ని కలిగిస్తుందే తప్ప గుణంగా కనిపించదు. కన్యాశుల్కంలోని సంభాషణలను జ్ఞాపకం చేసే కొన్ని సంభాషణలను ఇక్కడ పొందు పరుస్తున్నాను.



పతంజలి

1. మూర్ఖపు గాడిద కొడుకులోయి ఇద్దరికిద్దరూ (వీర బొబ్బిలి)
2. రాసనంజికొడుక్కి పిసరంత వెర్రిగానీ ఉందెట్టి సెప్మా (వీరబొబ్బిలి)
3. ప్లీడర్ని దెమ్మంటే పీక్కుతినే వోడ్ని దెచ్చినారు. ఆడి మొగం జూస్తే దమ్ములగొండు నాగుంది. మాటజూస్తే జలగవోటం. ఆడు ఒచ్చినాక ఉప్పుడు దాక మూడే మూడు ముక్కలు మాటాడ్నాడు... డబ్బులియ్యి.. డబ్బులియ్యి.. డబ్బులియ్యి.. (పిలక తిరుగుడు పువ్వు)
4. నాటి క్షత్రియుడితో తమరీ భాషలో మాట్లాడ్డం ధర్మంకాదు అన్నాడు ఫకీర్రాజు చిన్న బుచ్చుకొని (రాజుగోరు).
5. మీనాన్న, మీతాతా ఎంత పెద్దమనుషులోయి, ఎంత యోగ్యులు (రాజుగోరు).
6. సిగపాయి తీసి తందునా రాసోడ్ని- అనుకున్నాడు పెదపాత్రుడు (గోపాత్రుడు).
7. ... కొవ్వాడ దెయ్యాలోన్ని రప్పించి, మీనాన్న దెయ్యాన్ని సీసాలోదించేసి బిరడా పెట్టేసి పెరట్లో కప్పెంటించేస్తాను. అప్పుడు తెలుస్తుంది, నాతడాఖా! (గోపాత్రుడు)

8. ఆడు-ఎంతసేపు చూస్తావు, చేతౌరస (రాజుగోరు). ఇలా పతంజలి నవలల్లో చాలా సందర్భాల్లో కన్యాశుల్కంలోని సన్నివేశాలను, సందర్భాలను జ్ఞాపకంచేసే అంశాలు, కనిపిస్తాయి. కొన్ని సందర్భాలలో సమాంతర సన్నివేశ కల్పన, పాత్ర లక్షణం కూడా కనిపించడం విశేషం, బేహద్బే, భవిష్యం, పుంజాలు తెంపుకొని, దొబ్బు, ఖాతరీ, బేసి, సల్దివన్నం-వంటి కన్యాశుల్కంలో కనిపించే మాండలిక పదాలు కొన్ని పతంజలి రచనలలో కనిపిస్తాయి. కన్యాశుల్కంలోని జంకోడక, వెర్రోడక వంటి పదబంధాలకు ప్రతిగా 'జ్ఞానం ఓడక' వంటి పదబంధాలను పతంజలి సృష్టించాడు. హాస్యశైలిలో ఇది ఒక మార్గం.

వస్తుగతమైన బీభత్సాన్ని, పాత్రగతమైన నైచ్యాన్ని, వ్యవస్థాగతమైన వైషమ్యాన్ని కప్పిపుచ్చి సన్నివేశగతమైన హాస్యాన్ని ఉత్తరోత్కర్షతో ప్రజ్వలింపజేసిన హాస్యశిఖరం కన్యాశుల్కం. నవ్వులపాలైన వస్తువును, పాత్రలను, వ్యవస్థలను

ఆధారంగా చేసుకొని విలక్షణమయిన హాస్యపు పంట పండించిన వాడు పతంజలి. ముందే నవ్వులపాలు కావడం వల్ల పతంజలి గ్రహించిన వస్తువు, పాత్ర, వ్యవస్థ అధిక్షేపానికి గురి కావలసి వచ్చింది. గురజాడ హాస్యంలో కొంతలో కొంతైనా శబ్దక్రీడ కనిపిస్తుంది. పతంజలి తన హాస్యాన్ని పూర్తిగా శబ్దం నుండి విడదీసాడు. శబ్దం, అర్థం రెండూ వెనక్కుపోయి నిందాపూర్వకమైన అధిక్షేపం ముందుకు వచ్చే విశిష్ట హాస్యశైలిని తన సొంతం చేసుకున్నవాడు పతంజలి. అతడు 'వీరబొబ్బిలి' అనే మాటలు నేర్చిన కుక్కను సృష్టించాడు. ఆధునిక రచయితలకిది అచుంబితమైన విషయం.

తాండ్రవారింట్లో పుట్టి, చెలికాని వారింట్లో పెరిగి, అలమండ రాజుల సావిళ్లలో దివాణానికి దీటుగా తన ఆభిజాత్యాన్ని ప్రకటించిన ఈ కుక్క రాచరికపు డొల్లతనానికి ప్రతీక. అది వేటాడదు, కాపలాకాయదు. దానికి దివాణంలో వండే మేలిరకం మాంసం, మంచి నిద్ర కావాలి. చూడడానికి ఏనుగులా కనిపించినా, ధైర్యం చూపవలసిన సందర్భంలో పిల్లిలా పారిపోతుంది. పనికిమాలిన డాబు, దర్పం, ఠీవి ప్రకటించడంలో దానికదే సాటి. పందిని చూసి పారిపోయినా పందికూన మీద దాని పోటుదనం చూపిస్తుంది. బతకనేర్చినతనం తప్ప కుక్కకుండవలసిన విశ్వాసంలేశం కూడా లేదు. సోమరితనం దాని జీవలక్షణం. తనచుట్టూ ఉన్న సమాజాన్ని అధిక్షేపించడానికే పతంజలి ఈ కుక్కని సృష్టించాడు.

"... మా చిట్టెమ్మ నన్ను గ్లాస్కోపంచె కట్టుకుని, లాల్చీ తొడుక్కుని, జరీకండువా వేసుకుని, కుచ్చుపాగా జుట్టుకొని అలాగ పెదచావిట్లోకి వెళ్లిరమ్మన్నాది. అంత మర్యాదగా, అభిమానంగా, గౌరవంగా జూసుకొంటారన్నమాట నన్ను." – ఈ వీరబొబ్బిలి వేషమంతా ఫకీర్రాజు, అతడి తోటి రాజులు వేసే వేషమే.

"ధీర వీర శూర బొబ్బిలి ఒంటిపంది చట్టంతా ఒకర్తే తినేస్తుంది. అయితే వేటపాలెం మీద ఒంటిపంది దీని కంట పడ్డానికి వీలులేదు. పడిందో దగ్గర ఏ చెట్టుంటే ఆ చెట్టెక్కేసి ఆ ఒంటిపంది కనుచూపుమేరలో లేకుండా వెళ్ళిపోయే వరకు దిగదు"–అన్న వాక్యాలలో పతంజలి హాస్యశైలిని మనం చూడవచ్చును.

"నేన్నీ పక్కన లేకపోతే నువ్వు ఉడతలు పట్టే వాడిలాగుంటావు"–అని తన పోషకుడైన ఫకీర్రాజుని మనసులో తిట్టుకునే బొబ్బిలి తనకు తారసపడిన ప్రతివారిని గూర్చి ఇలాగే తన మనసులో ఏదో ఒకటి అనుకొంటూ ఉంటుంది. సాధారణంగా, మాట్లాడే ఈ కుక్క భౌభౌమని అరిస్తే 'పోరా డొక్కునా కొడకా' అన్నట్లుగా పతంజలి భాష్యం చెప్తాడు.

విత్తార్జితాన్ని అమ్ముకొంటూ, అవమానాన్ని దులుపుకొంటూ, అబద్ధపు డాబుదర్పాలను పెంచి పోషించుకొంటూ, తెలివిమాలిన బతుకు బతికే ఫకీర్రాజు అలమండ రాజులకు ప్రతినిధిగా కనిపిస్తాడు. ఆతిథ్యమిచ్చే విషయంలో అలమండ ఫకీర్రాజుకీ, డెంకాడ ఈటెసూరిబాబుకీ మధ్య నడచిన ప్రహసనమంతా రాజుల మూర్ఖత్వానికి దర్పణం పట్టే శైలిలో సాగింది. ఈ అధిక్షేపంతో వదలక ఫకీర్రాజుని, గోపాత్రుణ్ణి అడ్డుపెట్టుకొని గ్రామీణ వైద్యంలో జరిగే ఘోరమైన తప్పిదాలను ఒక ప్రహసనంగా తన సహజ హాస్యశైలిలో 'రాజుగోరు' అనే నవలలో చురకమీద చురక పెడుతూ, వాతమీద వాత పెడుతూ వెల్లడించాడు. ఫకీర్రాజు, గోపాత్రుడు కలసి కలగాడ గ్రామంలోని 'దేవుడమ్మ' అనే ముసలిదానికి పదేళ్ల క్రిందటి ఇంజక్షన్ ఇవ్వడంతో మొదలైన ఈ ఆయుర్వేద వైద్యుల వైద్య ప్రహసనం అధిక్షేప చరకసంహితగా కొన్ని వైద్య సూత్రాలను మనకు వినిపించింది.

అలమండ రాజులను గూర్చి చెప్తూ పెదప్పలరాజు "ఇక్కడ రాజులందరూ ఎల్లగుబ్బ గొడుగుల్లాగే ఉంటారు. అందరికీ వైద్యం తెలుసును. కొందరిచ్చిన ఔషధాలకు జబ్బులు పోతాయి. మరికొందరిచ్చిన ఔషధాలకు మనుషులే పోతారు" అంటాడు. నల్లగుడ్డ మీద తెల్లగుడ్డ కలిపికుట్టిన గొడుగును 'వెల్లగుబ్బగొడుగు' అని విజయనగరం ప్రాంతంలో అంటారు. 'వెల్ల' అనే పదం గ్రామీణ ఉచ్చారణలో 'ఎల్ల' అయింది.

"జబ్బు తగ్గితే సోగలకోణ్ణిగానీ, డింకీ పుంజునుగానీ ఇయ్యమన్నాడు. మనిషిపోతే మాంఛి తయారు మీదున్న పందెపు గొర్రిపోతుని" ఫీజుగా ఇమ్మన్న పెదప్పలరాజు సలహా ఒక పరిశుద్ధ చమత్కారంగా అనిపిస్తుంది. అత్త జబ్బుకి మందునివ్వడం కోసం అల్లుడికి రోగనిదానం చేసే ఫకీర్రాజు చర్య వైద్య విధానానికే ఒక పెద్ద వెక్కిరింతగా కనిపిస్తుంది. జబ్బు తగ్గకపోయినా మనిషి పోకుండా ఉండే పరిచితమైన

ఔషధాన్ని వాడడం ఫకీర్రాజు మార్గం. గోపాత్రుడి తార్కికశైలి ఇందుకు భిన్నంగా ఉంటుంది.

"తెలిసిన జబ్బు తగ్గటానికి తెలిసిన ఔషధాలిస్తామా లేదా? మరి అలాంటప్పుడు తెలీని జబ్బుకు తెలీని ఔషధం ఇవ్వాలా లేదా?" అంటాడు గోపాత్రుడు. గోపాత్రుడి తండ్రి గొప్ప వైద్యుడని ప్రసిద్ధి. అతడి వైద్యశాస్త్ర మర్మాలు ఇంకా ఘనంగా ఉంటాయి. "మనం వైద్యం చేస్తే జబ్బులు పూర్తిగా తగ్గిపోకూడదు. మనుషులు కూడా పోకూడదు."

"నాయినా! వైద్యుడిగా చెలామణి అవటానికి వైద్యమే రానక్కరలేదు. వైద్యమంటే ఏమిటో తెలీకుండా నేను మహా వైద్యుణ్ణి అనిపించుకున్నాను. నువ్వూ అదే నేర్పుతో బతుకు (వైద్య గ్రంథాలలో ఏముందో అది రాసిన మా తాతకే తెలీదు. అయినా అవన్నీ మనకి తెలిసినట్లు జనాన్ని మాత్రం నమ్మించాలి") (గ్రామీణ వైద్యమంతా ఎలా శోభిస్తోందో పతంజలి ఒక వ్యంగ్య మర్యాదతో పాటు సూటిగా, తేటగా వెల్లడించడం ఇక్కడ చూస్తాం. పతంజలి శైలిలో కుండలీకరణ పద్ధతి చాలా అరుదుగా కనిపిస్తుంది. వైద్యుల దంభాచారాన్ని ప్రకటించడానికి ఇక్కడ కుండలీకరణాలలో ఒక వ్యాఖ్యను జతచేయడం వల్ల హాస్యశైలికి పుష్టి చేకూరింది.

సమకాలీన సమాజపు ప్రజల జీవనసరళికి అతికేలాగ కొన్ని సరికొత్త ధార్మిక బోధలను పతంజలి నవలల్లో చూస్తాం.

"పరాయివాడెవడూ మనం జేస్తున్న పని చూడనంత వరకూ మన మర్యాదకు భంగవేవిటోయి" (రాజుగోరు).

"నోటురాయని బాకీలు ఎగ్గొట్టీ, నోటురాసిన బాకీలు వొచ్చే జన్మలో మా నాయనే తీరుస్తాడని జెప్పు" (గోపాత్రుడు).

ఇటువంటి బోధలెన్నింటికో మకుటాయమానమైన జ్ఞానబోధను పతంజలి 'గోపాత్రుడు' నవలలో మనం చూస్తాం. ఇది భగవద్గీతకు ప్రతి రచన (Burles Que). కేవలం హాస్యానుకరణం (Pardoy) మాత్రమే కాదు. అలమండలోని, రాజులకు, వెలమలకు యుద్ధం సిద్ధమైంది. రెండు సేనలు ఎదురెదురుగా మోహరించాయి. వెలమవాడైన రొంగలి అమ్మన్న తన కులపెద్ద రొంగలి బుజ్జి ప్రేరణతో వెలమ సైన్యాన్ని వదలి రాజుల సైన్యంలో చేరిపోయాడు. పోరు మొదలయ్యే సమయానికి అతడికి మనసు జారిపోయింది.

"ఒరే, ఓరి పెద్దయ్యా! నాను ఇంటికి పోతాను. మన ఎలవోళ్లతో యుద్ధంజెయ్యడానికి నాకు చేతులు రావడంలేదు, నానీ యుద్ధం సెయ్యలేను" (రొంగటి అమ్మన్న).

***బుజ్జినోవాచ*** : ... కులం ఒకటే అయినా నువు వాళ్లకి ఎగస్పార్టీ లో వున్నానని మర్చిపోకు... ఎదటోడి కర్ర నీ బుర్ర మీద పడకుండా సూసుకోడానికైనా నువ్వు కర్ర బట్టుకోవాలి.

***అమ్మానోవాచ*** : పెదనాయినా! ఇంతవరకూ నాను ఎనకనుంచి సీకట్లో కొట్టడవే గానీ, ఎదరబడి ఎవుడ్నీ కొట్టలేదు...

***బుజ్జినోవాచ*** : కొడకా! సొంత కులానికి, సొంత మనుసులకీ అపకారం జెయ్యలేనోడు, పరాయి మనుషులకి ఎలాంటి అపకారవూ సెయ్యలేడు. గ్నానోపదేశం ఇనుకో, నీ తప్పించి మిగిల్నిదంతా పరాయిది. నువు నీ కోసం బతకాల! ఊరి పెసిరెంటెవడం కోసం బతకాల. పరాయోడు పెసిరెంటుగా వున్నప్పుడు, ఆడ్ని దింపీడం కోసం బతకాల. మనం మన సుకం కోసవైనా బతకాల. నేదంటే ఎదటోడ్ని పుర్రాకులు పెట్టడానికైనా బతకాల! ఈ రెండు కారణాల కోసఁవే మానవ జనమమెత్తిన నంజికొడుకులందరూ బతకాల..!

వినడానికి వెగటుగా ఉన్నా వర్తమానపు వాస్తవిక చరిత్ర ఇది. రాజులకు, వెలమలకు శతృత్వం; తూర్పురాజులకు, పడమటి రాజులకు శతృత్వం. వెలమలు రాజుల నుండి అధికారాన్ని గుంజుకోవాలను కొంటారు. వెలమలలో లగుడు ముత్యాలనాయుడి అధికారాన్ని రొంగలిబుజ్జి లాక్కోవాలను కుంటాడు. అలమండలో అన్ని కులాల వాళ్లు ఉన్నారు. మీదనుంచి కిందికి చూసినా, కిందినుంచి మీదకి చూసినా అందరిదీ ఒకటే వరుస. అవిశ్వాసం, స్వార్థం, అవినీతి, పరస్పర ప్రసారణం, అవహేళన-వంటి క్రిములన్నింటితోను లుకలుకలాడిపోతున్న సామాజిక వ్రణానికి అలమండను ప్రతినిధిగా నిలిపి చూపించాడు పతంజలి.

గురజాడ నొప్పితెలియకుండా ముల్లుతీసే శైలి ననుసరిస్తే, పతంజలి కష్టం తెలియకుండా కల్లెత్తును కోసే ఖడ్గధారను తన హాస్యశైలికి సాధనంగా ఉపయోగించుకున్నాడు. ఒక శతాబ్ది కాలంలో శైలీపరిణామం ఎలా ఉంటుందో ఈ ఇద్దరి రచనలూ చూస్తే తెలుస్తుంది. మి



# నే నెరిగిన జాషువా !

- పెద్ది సత్యనారాయణ

కవి -అన్న, ఒక మనుష్యుని చూడటం, నాకదే మొదలు! 1946లో గుంటూరు ఏ.సి. కాలేజీలో జరిగిన సభలో, జాషువాగారిని చూడటంతో ఆ మొదలు కదిలింది.

ఆనాడు వారినోట రెండు పద్యాలు వెలువడ్డాయి. 'గుజ్జాలకు రెక్కలు గల వెజ్జీ యుగాలు దాటిపోయే!' అనగూడదుగాని ఆంధ్రులది సోడాబుడ్డి ఉద్రేకమే! ఇవీ ఆ రెండు పాదాలున్నూ.

ఆనాడు నాదింకా నూనూగు మీసాలు రాని వయసు. ఆ పాదాల్లోని అర్థాలు సందర్భాలూ నాకు అంతు పట్టలేదుగాని, ఆ పాదాల్లో నాకేదో సొగసు తగిలింది.

**గుజ్జుమింటిపేరు గుంబు కదమును,**
**త్రొక్కు ఫక్కి కైత చెక్కగలవు!**
-అంటూ ఆ తరువాతి కవులు జాషువాను మెచ్చుకొన్నది- ఈ సొగసును చూసే కావచ్చు.

**రాజయాఖ్యుబోలు రసికులాంధ్రంబున**
**నలువురున్న లలితకళలు-బ్రదుకు!**
-అన్నారు కవిగారు, తన 'నాకథ' కావ్యాన్ని మాధవరెడ్డి రాజయ్యగారికి అంకితమిస్తూ!

1952లో మాధవరెడ్డి రాజయ్యగారి యింట ఆ కవిగారిని మళ్లా చూశాను. ఆనాడు మొగ్గతొడిగిన మా పరిచయం-క్రమంగా పుష్పించి నా పూల దండల పెళ్లికి, జాషువాగారు పౌరోహిత్యం వహించటంతో ఫలించింది. జాషువాగారు కవిగా ఆంధ్రులెల్లరకూ తెలుసుగాని, ఒక సంసారిగా కొందరికే తెలుసు. ఆ కొందరిలో నేనొకడిని కావడం నా అదృష్టంగా భావిస్తాను.

రెండవ ప్రపంచ యుద్ధం ముగియడంతో, ప్రభుత్వ ప్రచారశాఖలోని వారి ఉద్యోగమూ ముగిసింది. గుంటూరు వచ్చి, నెహ్రూ నగర్‌లో ఒక అద్దె ఇంటిలో కాపురం పెట్టారు. రాజయ్యగారి ఇంటికి తరచు వస్తూ పోతూ ఉండేవారు. ఆ రాజయ్యగారి పిల్లలతో నాకున్న స్నేహం మూలంగా, నేనూ వారింట్లో వారి పిల్లవాడి మాదిరిగా మెలగుతుండేవాడిని.

ఒకనాటి సాయంత్రం ఆ ఇంటికి జాషువాగారు రాగా, నేను లేచి నమస్కరించాను. కవిగారు రెక్కపట్టుకొని ఊపుతూ "బక్కగా ఉన్నావు; బలం రావాలి కసరత్తు చేయి!" అన్నారు.

అప్పుడు ఆ ఆవరణలో తిరుగుతున్న పిల్లల కోడి ఒకటి వారి కంట పడింది. టేబుల్ పైనున్న కార్డు ముక్క తీసికొని, గోటి నొక్కులతో, కదులుతున్న పిల్లల కోడి దృశ్యాన్ని చిత్రీకరించారు. రాజయ్యగారు చూసి "కవిగారూ! మీకీ నఖచిత్ర కళలో సహితం ప్రావీణ్యమున్నట్లు పదిమందికీ తెలియదే!" అన్నారు సంతోషపడుతూ.

ఆ క్రితం రోజున 'సఖి' అన్న జాషువాగారి ఖండకావ్యం లోని పద్యమొకటి, రాజయ్యగారు నాచేత కంఠస్థం

పెద్ది సత్యనారాయణ, విశ్రాంత సంస్కృత (కళాశాల) ప్రధానోపాధ్యాయులు, పొన్నూరు, గుంటూరు జిల్లా.

చేయించారు. ఆ పద్యమిపుడు కవిగారి ముందు, భావయుక్తంగా, రాగయుక్తంగా పాడి అప్పగించాను.

**రెప్పలు వాల్చుకాలమున, రేలఘటించెడి నిద్రవేళ నీ**
**ఒప్పున కప్పగించుటకయో! ప్రతిబంధక మయ్యెనంచు నే**
**నెప్పుడుకుందుచుందును సఖీ! గతియించిన రెప్పపాటులో**
**ఇప్పటి నీ విలాసమొక లేతగదావయస్సునన్! యించుక**

–ఇదీ ఆనాడు నేను అప్పగించిన పద్యం!

జాషువాగారు సంతోషించి, చిలిపిగా చూస్తూ "పుంజు కూత కొచ్చింది, పెళ్లిచేయాలి, లేకుంటే చెడిపోతాడు" అన్నారు. అప్పటి నాకు ఆ జోక్‌లోని చమత్కారమేదో అర్థం కాలేదు. ఇతరులు మాత్రం సరదాగా నవ్వారు.

అది జాషువాగారు 'నా కథ' రాస్తున్న రోజులు. ఒకనాడు కవిగారు వచ్చి, ఆనాడు తాను రాసిన 'బాల్య స్మృతులు' రాజయ్య గారికి వినిపిస్తున్నారు.

**మా పొరుగింటి బాలిక, రమామణి నామక చన్నుచంకయున్**
**'కాపుకురాని' పిల్ల చెలికత్తియగా తలిచాటువారమై**
**రేపులు మాపులున్ కలిసి క్రీడయొనర్చితి మాలతాంగినే**
**దేపురినున్నదో మెలగు నిప్పటికిన్ స్మృతిదర్పణమ్మునన్!**

– కాబోతున్న కృతిపతి రాజయ్యగారు, ఈ పద్యం విని పరవశు లయ్యారు. నేనుమాత్రం ఆ క్రీగీటుగల జాతీయానికి గల అర్థం అంతుబట్టక మిన్నకుండిపోయాను.

ఈ రెండు కుటుంబాల మధ్య గల స్నేహం కారణంగా జాషువాగారి రెండవ అబ్బాయి వలరాజుతో నాకు స్నేహం కలిసింది. ఈ వలరాజు స్నేహం వల్ల కవిగారి ఇంటికి నా రాకపోకలు పెరిగాయి.

అది 1952 వేసవికాలం. జాషువాగారు 'త్వరగా పెళ్లి చేయాలి, లేకుంటే చెడిపోతాడు', అంటూ చేసిన హెచ్చరికకు తగినట్లుగా నా చదువు ముగియక ముందే, మా పెద్దలు నా పెళ్లి నిశ్చయించారు. పెళ్లి పనులు మొదలయ్యాయి. నేను మా ఊరు పాలపర్రు నుండి వచ్చి, శుభలేఖల అచ్చుపని మిత్రుడు వలరాజుకు అప్పగించాను.

ఆ తరువాత ఒకనాడు వెళ్లి, జాషువాగారికి స్వయంగా శుభలేఖ అందించాను. ఆ శుభలేఖ అందుకున్నారో లేదో, తలగడ దిండు క్రింద దాచిన ఒక కాగితం తీసి నా చేతికిచ్చారు. అందులో కాబోయే మా దంపతులను దీవిస్తూ వ్రాసిన "ఆశీర్వాద సువర్ణాక్షతలు" అయిదు పద్యాలున్నాయి. నేను విస్మితుడనై వారి వంక తేరిపార చూచాను.

"మొన్న మా వలరాజు ప్రెస్‌లో అచ్చవుతున్న మీ పెళ్లి కార్డు తెచ్చి ఇచ్చాడు. వెంటనే ఈ పద్యాలు గీకేశాను" అన్నారు.

ఈ ప్రోద్బలంతో, పిల్లలమర్రి హనుమంతరావు, పి.హనుమయ్య, మందలపర్తి ఉపేంద్రశర్మ, పొన్నగంటి హనుమంతరావు, కొండవీటి వెంకటకవి, వావిలాల సోమయాజులుగారు–మొదలైన హితుల నుండి ఆశీస్సులు సేకరించి, 'విశ్వకుటుంబంలో సరికొత్త కాపురం' పేరుతో ఒక పుస్తక ప్రచురణ జరిగింది.

1952 మే 5న బాపట్ల సమీపంలోని జమ్ములపాలెంలో జరిగిన మా పెళ్లికి జాషువాగారు పౌరోహిత్యం వహించి, మా దంపతులచే వరమాలలు, మార్పించారు. కొండవీటి వెంకటకవిగారు మాచే పెళ్లి ప్రమాణాలు చదివించారు. ఇక జాషువాకవి గారు తమ 'ఆశీర్వాద సువర్ణాక్షతలను' మేఘ గంభీరస్వరంతో ఆలపించటమారంభించారు.

**నీడంబోలిచరించునీదుసఖులున్ నీచుట్టపక్కాలు కొం**
**డాడన్ ప్రోన్నతవిద్యలన్‌కరచి సత్యబ్రాహ్మిజల్ కబ్బపున్**
**చెడెల్ గానముసేయగా విబుధు లాశీరాక్షతల్ చల్లగా**
**ఈడుంజోడగు పెండ్లి అడిగితి గదోయీ సత్యనారాయణా!**

**ముద్దుల్ కారెడు దోరయవ్వనపుటుబ్బున్ మించిపోనీక మే**
**ల్విద్దెల్‌నేర్చి ఉపజ్ఞత కల్గిన లసత్‌విద్యార్థివై పిన్నలున్**
**పెద్దల్‌మన్ననసేయ పొల్చితివి శ్రీపెద్దన్న యొత్తంస నీ**
**ఉపద్దేశంబులు బిడ్డలై పొదమ ఆయుశ్రీల వర్ధిల్లుమీ !**

**నీతో సంసరణప్రయాణమునకున్ సిద్దంబుగానున్న లే**
**లేతప్రాయపురత్నమాంబ అనుకూలింపన్ గృహస్తుండవై**
**నీతిన్ తప్పక నీ సదాశయములన్, నీ దీక్షలన్ నీతనూ**
**జాతక్షేత్రములందు నాటుము వయస్యా ! సత్యనారాయణా!**

**కులమున్ గోత్రమునుద్ధరించుకొని తక్కుంగల్గుదేశంబుచి**
**క్కులతో జోక్యములేని సంకుచితదృక్కుల్ పుత్రకుల్ సత్యని**
**శ్చలదీక్షారతులైన మీ కడుపునన్ జన్మింప రంచాశతో**
**చిలికెన్ దేశము మీ శిరస్సుల శుభాశీరంబుజాతాక్షతల్!**

**నినుబోల్ చక్కని కూనసత్యములతో నీయిల్లుశోభిల్లినె**
**మ్మనముల్ పొంగ కవుల్ కళాప్రియులు నీ మర్యాదలన్ తేలితీ**
**యనిచూపుల్ వెదజల్లు నీదగు భవిష్యత్ పూత సంసారజీ**
**వనమున్ చూచి తనించుగావు తహితాప్తబృందనేత్రాబ్జముల్ !**

పిమ్మట కవిగారు హితపు పల్కుతూ, పావుగంటపాటు ఉపన్యసించారు. బంధుమిత్రులను, గ్రామస్తులను జాషువా ప్రసంగం అలరించింది, ముగ్ధులయ్యారు. వారెప్పుడూ చూచియెరుగని ఈ పెళ్లిలో ఈ కవిమిత్రుల ప్రసంగాలు, వారికి వింతగా, ఉల్లాసద్యోతకంగా తోచి ముచ్చట పడ్డారు. కథలు, కథలుగా చెప్పుకొన్నారు.

మా మామగారు రావుల వీరయ్యగారూ, మా నాన్నగారు పెద్ది జానకిరామయ్యగారూ కవిగారిని చెరొక నూట పదార్లతో సత్కరించారు. మా అమ్మ శాయమ్మగారు, జాషువాగారి ధర్మపత్నియైన జాతక పుణ్యరేఖకు పట్టుచీరె పంపింది.

**'సంసారయాత్రకు చాలినంతకు మించి...**
**గ్రుడ్డి గవ్వయు కోరుకొనను నేను'**

–అని చెప్పుకొన్న జాషువాగారు, మాపెళ్లిలో వారికి జరిగిన మర్యాదలూ, ఓపినంతలో మేము ఇచ్చిన సంభావనలూ, ఆ అల్పసంతోషిని సంతృప్తుని చేశాయి. అంతకన్న ఈ పెళ్లి సందర్భంగా వారిని సంతోషపెట్టిన మరొక పిట్టకథ చెప్పుకోవాలి.

ఈ పెళ్లిపందిరిలో జాషువాగారి ప్రసంగం జరుగుతుండగా, పెళ్లి చూడవచ్చిన ఇద్దరు గ్రామస్థుల మధ్య ఏదో వాదులాట మొదలైంది. సై అంటే సై అనే దాకా వచ్చింది ఆ వాదులాట! దగ్గరున్నవారు–"కాస్త ఓపిక పట్టండిరా! ఆ కవిగారు మాట్లాడ్డం పూర్తికానివ్వండి, తరువాత వారినే అడిగి తేల్చుకోవచ్చు" అంటూ సర్దిచెప్పారు.

కవిగారు వేదిక దిగగానే ఆ పందెగాళ్లిరువురూ కవిగారిని సమీపించారు. "ఏవండీ! డి.వి. సుబ్బారావుగారు కాటిసీను హరిశ్చంద్ర నాటకంలో పాడే పద్యాలు–మీరు రాసినవని నేను, అట్టాంటిది రాసే ఆయన ఇక్కడికి రాబోయాడా? అని వీడూ పందెం కాసుకొన్నామండీ! నిజం చెప్పండి, మీరు గదూ రాసింది? గుక్కతిప్పుకోకుండా అడిగేశాడు ఆ ఇద్దరిలో ఒకడు!

జాషువాగిరికి పెద్ద చిక్కొచ్చి పడ్డది. ఆసక్తిగా చుట్టూ చేరినవారు తలలెత్తి కవిగారివైపు చూస్తున్నారు. కవిగారు చతురు మనిషి.

"అబ్బాయిలూ! అట్లాకాదు, మీరిద్దరూ మా ముందు ఒక కుస్తీ పట్టు పట్టండి. అందులో ఎవరు గెలుస్తారో వారి మాట నిజమనుకోండి! అంతే తప్ప, నాకీ తంటా తెచ్చిపెట్టకండి!" అంటూ తప్పుకో చూశాడు. అంతలో ఆ ఊరి మునసబు పంగులూరి అంకయ్యగారు జోక్యం చేసుకొని, ఈ కవిగారేరా! వ్రాసిందని చెప్పి, వారిని పంపించేశాడు. వారు చప్పున తిరిగి వచ్చి 'నేను ముందంటే, నేను ముందంటూ కవిగారితో 'షేక్ హ్యాండ్' ఇప్పించుకొని ఏనుగునెక్కినంతగా సంబరపడుతూ తిరిగి వెళ్లారు.

డి.వి సుబ్బారావుగారు ఒకరోజున నాస్తిక కేంద్రానికి వచ్చి "అమ్మా! హేమలతమ్మా! హరిశ్చంద్ర నాటకం ఆడుతూ, మధ్యలో మీనాన్నగారి పద్యాలు పాడుకొంటూ పేరు తెచ్చుకున్న వాడిని, బాగుపడిన వాడిని, మీ నాన్నగారి ఋణం, ఈ జన్మలో తీర్చుకోలేను. ఇదిగో ఈ అయిదు వందల రూపాయలూ పుచ్చుకో అమ్మా!" అంటూ పైకం చేతిలో పెట్టాడట!

గుంటూరు, కొత్తపేటలో, మాధవరెడ్డి రాజయ్యగారి యింటికి దాపులో మహావాది వెంకటప్పయ్యగారనే ఒక సంగీత విద్వాంసుడుండేవాడు. అతడు, తన ప్రియురాలు ప్రేమ కుమారికి హరికథలు నేర్పి, కిరాయి హరికథలు చెప్పించేవాడు. హరికథ మధ్యలో విరామ సమయంలో వెంకటప్పయ్యగారు ఫిరదౌసి కావ్యంలోని, సుల్తాన్ను నిందిస్తూ, ఫిరదౌసి (జాషువా తెలుగు అనువాదం) కవి వ్రాసిన పద్యాలను పాడి వినిపిస్తుండేవాడు. జనం వన్స్‌మోర్‌లు కొట్టేవారు. ప్రేమ కుమారి హరికథకు ఇదొక పెద్ద ఆకర్షణ.

ఇంతకూ చెప్పవచ్చేదేమంటే, 20వ శతాబ్దంలో ఎందరెందరో మహాకవులుద్భవించారు. క్రొత్తపోకళ్లతో, ఆంధ్ర కావ్య సంపదను పరిపుష్టం చేసి రసపిపాసులనలరించారు. అయితే, వారిలో జాషువా ప్రత్యేకత జాషువాదే. ఆ గట్టు మరొకరికబ్బినది కాదు. వారి కవితకున్న రంజకత్వం వేరు. ఆ సొగసు వేరు, ఆ రుచి వేరు, ఆ పరిమళం వేరు!

**కాలగతినెరింగి, కమనీయ భావనా**
**వైభవమున, తేనెవాకవంటి**
**కైతనెరసి, తెన్గు జాతికందించిన**

వాడు జాషువా. జాషువాగారి కావ్యఖండికలలోని, తేనెవాక వంటి కవితా మాధుర్యానికి, ఆంధ్రులు పరవశించిపోయారు.

అంతకు ముందు ప్రాచుర్యంలో లేని, చిన్ని చిన్ని బుల్లి బుల్లి కవితలను ఆలోచనాత్మకరీతిలో ఆపాతమధురంగా సృజించారు. ఈ ప్రక్రియను, ఎందుకు చేపట్టవలసి వచ్చిందో, జాషువాగారే ఇట్లా చెప్పుకొచ్చారు.

**"ఈ సందిగ్ధకాలములో ఉద్యమ గ్రంథ రచనకు**
**ఉద్యమించువాడెవడు? వ్రాసిన చదివెడి**
**ఓపిక పాఠకునకెక్కడిది? కావున**
**ప్రజాభిరుచికి ఉచితములగు చిన్న చిన్న**
**వ్యాసములు గల భారతి వంటి పత్రి**
**కలవతరించినవి. నేడు పరాధీను**
**డైన తెలుగువాని కిట్టి ఖండకావ్యములు-**
**తీరుబడి వేళల, ఇంపుసేయు చుండును!"**

-అన్నారు జాషువాగారు. జాషువాగారి వ్యాఖ్యకనుగుణంగా, "కప్పు కాఫీతో ఆకలి చల్లార్చుకొను ఈ కాలపు వారికి, ఖండ కావ్యములు గాక, మహాకావ్యములు రుచించునా?" అన్న రాళ్లపల్లి అనంత కృష్ణమాచార్య మహోదయుని మాట కూడ మెచ్చదగినదే!

జాషువా కవితలోని యీ కొంగ్రొత్తదనం నవతరాన్ని అలరించింది. కవితాభిమానం, పఠనాసక్తి విద్యావంతులలో పెరిగింది. ఫిరదౌసి, ముంతాజ్‌మహల్, గబ్బిలం మున్నగు ఉపకావ్యాలూ, శ్మశానవాటిక, శిశువు, గిజిగాడు, కర్ణుడు మున్నగు కావ్యఖండికలూ రసపిపాసుల దాహార్తిని తీర్చాయి.

**వందలు వేలు పొత్తములు, వాములు వాములు కూర్చినంతనే,**
**పందెముగెల్తురా కవులు, పాఠక లోకపు ముద్ర లేనిచో;**
**నందనవాటికా కుసుమ నవ్య మరందఝురీ తరంగముల్**
**చిందగ, నీవలెన్ కృతులు చెప్పక విందులు గుప్పకున్నచో!**

-అంటూ అభినవ తిక్కన తుమ్మల సీతారామమూర్తిగారు, జాషువాను మెచ్చుకోవటంలో మరొక విశేషముంది. 'ఏ గతి రచియించిరేని సమకాలపువారలు మెచ్చరేగదా!' అన్నాడు చేమకూర వెంకటకవి. ఈ తుమ్మలవారి మెప్పుతో, ఆ చేమకూరి వారి సిద్ధాంతీకరణ, అందరికీ వర్తించదని తేలిపోయింది! ఎక్కడిదాకనో యెందుకు, ఆంధ్రప్రదేశ్ ప్రథమ ఆస్థానకవి-చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, ఏమన్నారో చూడవచ్చు!

**"ఎంతదూరమొ ఎందుల, కెవడు జాషు**
**వాయను కవి ప్రవరుడు, కవనమందు**
**వాని బోలెడువార, లెవ్వారలేని,**
**విప్రకవులందు, నెవ్వడో వేత్త తప్ప!"**

కవిత్వసిద్ధి-కులగత మైనదా? కాదా? అన్న వివాదంలో, ప్రతిపక్షాలనోళ్లు యూయించేందుకు, చెళ్లపిళ్లవారికి, జాషువా పుట్టుక అక్కరకు వచ్చింది.

జాషువా సైతం తనను చెళ్లపిళ్లవారి శిష్య పరమాణువుగా భావించుకొని, ఏకలవ్యభక్తిభావంతో, వారిని ఆరాధించిన సందర్భాలు లేకపోలేదు. 1932లో బందరులో, నభూతో నభవిష్యతి-అన్నరీతిలో వెంకటశాస్త్రి గారి షష్ఠిపూర్తి ఉత్సవాలు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. కాశీనాథుని నాగేశ్వరరావుగారు సభాధ్యక్షులు. విశ్వనాథ, వేలూరి, కాటూరి మున్నగు కవి పండితులతో సభ నిండుగా వుంది. జాషువాగారు ప్రసంగించే అవకాశం-సభ ముగింపు సందర్భంలో మాత్రమే వచ్చింది.

అప్పటికే ప్రొద్దుపోయింది; చెళ్లపిళ్లవారు కునుకు తీసే పనిలో ఉన్నారు. ఇంతలో 'ఘంటలు కొట్టి మీ మధుర కావ్యములాంధ్రుల మేలుకొల్పి...?' అంటూ జాషువాగారు పద్యం నడిపిస్తున్నారు. జాషువాగారు, గంభీర స్వరంతో, వేదిక కంపించే రీతిలో, 'ఘంటలు కొట్టి' అనగానే వెంకటశాస్త్రిగారు ఉలిక్కిపడి, మేల్కొని, "నాయనా జాషువా! వచ్చావా!"-అంటూ సంతోషిస్తుండగా, జాషువాగారు తిరిగి,

**ఘంటలు కొట్టి మీ మధుర కావ్యములాంధ్రుల మేలుకొల్పి యిం**
**టింటను నాటుకొన్నవి కవీశ్వర! కోతకు వచ్చి యున్నదీ**
**పంటను కోసికొమ్ము ..........................**

-అంటూ పద్యం ముగించి, వేదిక దిగేసరికి, శ్రోతలు పోటీపడి చప్పట్లు చరిచారట. జాషువా పద్యంలోని-మకరంద మాధుర్యమూ, ప్రయోగించిన ఆ జాతీయపు సొగసూ, అట్లా వారిని లోగొని, మైమరపించాయి.

అల్లసాని పెద్దనగారి ఘంటం సాగాలంటే, 'రమణీప్రియదూతిక తెచ్చియిచ్చుకప్పురవిడెము'-ఇత్యాది సదుపాయాలు కావాలి. కృష్ణశాస్త్రి-పాటో, పద్యమో వ్రాయాలంటే, పెద్దనగారు కోరిన సదుపాయాలు చాలవట! అవి-కనీస సౌకర్యాలేనట! వీరి కోర్కెలకూ, జాషువా కవి కోర్కెలకూ సంబంధమే లేదు. ఇంట్లో, బస్తా బియ్యం, బీడీ కట్ట వుంటే చాలు-'నందన వాటికాకుసుమనవ్యమరంద ఝురీతరంగముల్ చిందగ,' కలాన్ని పరుగులు పెట్టించగలరు! జాషువా!

ఈ సంపన్నులలో, ముందుగా, ఎన్నదగినవారు-ఏకాదండయ్య పంతులుగారు. జాషువాగారి తొలి రెండు ఖండ కావ్యాలను అచ్చొత్తించి గతించిన తన జననీజనకులకు

అంకితం చేయించిన వారు వీరే! జాషువా గారి బాగోగులు తరచు విచారిస్తూ సాయమందిస్తుండే వారు.

ఏకాదండయ్య పంతులుగారు - రూ.250/- ధనసహాయం, మనియార్డర్ ద్వారా పంపిస్తూ, ఆ కూపన్‌లో వ్రాశారట. "జాషువాగారూ రాత్రి నాకు దేవుడు కలలో కన్పించి రూ.250/- సాయంచేయమని చెప్పాడు!" అని వ్రాశాడట! జాషువాగారు కృతజ్ఞత తెల్పుతూ వ్రాసిన లేఖలో -"అపుడు మీకు ఆ సంఖ్య ప్రక్కన సున్నా పెట్టమని చెప్పలేదా? "అని చతురాడాడట?" జాషువాగారి హాస్య ప్రవృత్తినీ, చమత్కార విశేషాలనూతెల్పే సందర్భాలకు, నేను ప్రత్యక్ష సాక్షిని.

అవసరం వచ్చి భార్యను, మేరీ అని పిలిచేవాడు. ఆమె వెంటనే పిలుపందుకొనక మొరాయిస్తే, 'మొరాయ్'! అని కేకపెట్టేవాడు. హేమలత పేరులో వర్ణవ్యత్యయాన్ని ప్రవేశపెట్టే వాడు. ఆ బిడ్డను ముద్దు చేయదలచినప్పుడు! హేమలత, అన్న ఆ పిలుపే, ఆ బిడ్డకు ఆన్వర్థ నామమయిపోయింది. ఆ 'బంగారు తల్లి' బి.ఎ. పరీక్షలో నెగ్గి మద్రాసు యూనివర్శిటీవారి బంగారు పతకాన్ని సాధించింది.

జాషువా అర్ధాంగి శరీర వర్ణం-పసిడి కాంతులీనుతుంది. జాషువాగారిది మాణిక్యాన్ని తలపిస్తుంది. ఆమెను, భరతమాతగా నటింపజేయాలంటే, కిరీటం ధరింపచేస్తే చాలు. జాషువాగారు, ఏదయినా వూరు ప్రయాణం పెట్టుకొంటే, ఎదురుగావచ్చి తొలగిపోయేది. "నాకు, రైలు అందకపోయినా, దొంగజేబు కొట్టినా, నీవే జవాబుదారీ!" అని భార్యను బెదిరించేవాడు! ఆ బెదిరింపు మాటలకు ముచ్చటపడి, ముసి ముసి నవ్వులతో వంటింటి దారిపట్టేది.

"వలరాజు ఉన్నాడా, అండీ!" అని, సావాసగాడెవడో వచ్చి అడిగితే, "లేదు, గలాభరాజు మాత్రమున్నాడు" అని చమత్కరించేవాడు. ఒక పిల్ల కవి వచ్చి, నాకు 'ఫిరదౌసి' కావాలండీ! అంటే, "లేదు చచ్చిపోయి చాలాకాలమయింది!" అని నవ్వించేవాడు.

జాషువాగారికి, గ్రంథరచనాసక్తి తప్ప, గ్రంథపఠనాసక్తి తక్కువ. మనసు పొంగినవేళ, తిక్కరేగినవేళ, సమాధిస్థితిలోకి జారుకొని, పద్యాలు గీకేస్తాడు, అంతే! ఇక వాటి జోలికిపోడు. పద్యాలకు పాలిష్ పెట్టడం, వారు నేర్వని విద్య! వారు వ్రాసే పద్యాలు, రత్నాలయితే, వారు, షీఫర్ పెన్‌తో వ్రాసే అక్షరాలు ముత్యాలు!

'షీఫర్ పెన్'-అనగానే, మరొక ఉదంతం, జ్ఞప్తికొస్తుంది. నేను గుంటూరులో బి.ఎ. చదివే రోజుల్లో జిన్నటవర్‌కు దాపున గల ఒక ఇరుకు వీధిలో మేడపై గదిలో, వుండేవాడిని, బారెడు ప్రొద్దెక్కే వేళకు వచ్చి, రిక్షా దిగకుండానే క్రింద నుండి, "సత్యం!" అని కేక పెట్టాడు.

ఆ కేకలో నాకు, ఆర్తి స్ఫురించి, ఉన్న పళాన వడివడిగా మేడ మెట్లు దిగాను, "పోయింది నా షీఫర్ పెన్, ఎక్కడికో లేచిపోయింది, గత రాత్రి!", అంటూ చేతులు త్రిప్పాడు. ఇద్దరం వెళ్లి, గుడ్‌విల్ షాపు తెరిచే వరకు, ఉడిపి హోటల్‌లో నిరీక్షించాం.

ఆ ఉడిపి హోటల్ యజమాని-రాఘవేంద్రరావుగారు -కర్నాటకలోని ఉడిపీ ప్రాంతంవాడు. జాషువాగారొక మహాకవిగారని తెలిసికొని, కౌంటర్ లోపలి భాగంలో కూర్చుండజేసి, కాఫీ ఇచ్చి సత్కరించటం-ఆ రాఘవేంద్రరావు గారికొక అలవాటు! "ఘనమతులెల్లవారికి, అకారణ బంధులుగారె సత్కవుల్!" ఈ మాట ఆ హోటల్ యజమాని ఘనతనూ, సత్కవుల సామర్థ్యానికి దక్కే గౌరవాదరాలనూ తేటతెల్లం చేస్తుంది.

కవిద్రష్ట! ఋషులకే కాదు, భవిష్యత్ దర్శనసామర్థ్యం సత్కవులకూ సాధ్యమే! ఈ సామర్థ్యం, జాషువాలో పుష్కలం, కవిద్రష్ట ఇందుకు తార్కాణం.

**మును గజినీ మహమ్మదుదభూతపరాక్రమశాలి, వీరవా**
**హినులబలమ్ముతో పదియునెన్మిదిమారులు కత్తిదూసి, చి**
**క్కనిరుధిరమ్ముతో భరతఖండమునార్ద్రమొనర్చి, సోమనా**
**థునిపెకలించి, కైకొనియె తొమ్మిదివన్నెలరత్న రాసులన్!**

హిందువులకు, ప్రాణప్రదమైన సోమనాథదేవాలయాన్ని కూల్చి, రత్న రాసులను దోచుకొని పోయిన గజినీ మహమ్మదు దాడులకు, ప్రాయశ్చిత్తం తప్పదని ముందే గ్రహించగలిగి, వేదనకూ, ఆవేదనకూ లోనయ్యాడు జాషువాగారు.

**భారతక్షోణిగల్గు దేవస్థలములు**
**చెదరిగజినీ పురానమశీదులయ్యె,**
**ఇప్పటి మశీదు లేరూపమెత్తగలవొ**
**కాలమెరుగును ధారుణీ గర్భమెఱుగు!**

ఈ జాషువా జోస్యం–అయోధ్యలోని రామాలయమును కూల్చి, ఆపై బాబర్ నిర్మించిన మసీదు, గత దశాబ్దిలో నేల మట్టం కావటం–ధారుణీ గర్భానికి ఇప్పుడు తెలిస్తే, జాషువాగారు, ముందే దర్శించగలిగారు.

"భావకవిత్వంలో వుండే ఆయోమయాన్ని, పులుముడినీ పరిహరించి, అందులోని ఆత్మాశ్రయ లక్షణాన్నీ ఉత్తమ విన్యాసాన్నీ, జాషువా స్వీకరించాడు. అందుకే ఆయన స్పర్శ ఒక పరుసవేది. ఎన్నుకొన్న ప్రతి వస్తువునూ బంగారం చేస్తుంది. అది గిజిగాడు కావచ్చు, సాలీడు కావచ్చు, శిశువు కావచ్చు, పెంపుడు కుక్క కావచ్చు, ఏమైనా సరే!"–అంటారు మా మాస్టారు అమరేంద్రగారు. మేమిరువురమూ కలిసి కొన్నప్పుడు, ఏదో ఒక రూపంలో జాషువాగారి ప్రసక్తి రాకమానదు.

నార్ల వెంకటేశ్వరరావుగారు ఏకంగా జాషువాగారిని విప్లవ కవిగా పేర్కొన్నారు. "గ్రాంథిక భాషనే వాడినా, పాత ఛందోనియామాలనే పాటించినా, ఇతివృత్తాలలో కల్పనలో, పోకడలో, సందేశంలో ఆయన ఉత్తమ కవి!"–ఇదీ నార్లవారి తీర్పు!

నవయుగ కవి చక్రవర్తిలోని నవ్యత–భావనకూ, భావానికీ, పద్యం నడకకూ మాత్రమే సంబంధించినది కాదు. వస్తువరణంలోనూ జాషువా–పతితుల, దీనుల, వంచితుల గాథలనే హెచ్చుగా ఎన్నుకొన్నాడు.

**సీ॥ ఎవడారగించు అమృత భోజనంబున**
**కలిసెనో యీలేమ గంజి బువ్వ**

**ఎవడు వాసముసేయు శృంగార సౌధాన**
**కూలెనో యీఅమ్మ పూరి గుడిసె!**

**గీ॥ ఎవడు హరియించె, యేమయ్యె, యీమె సుఖము?**
**కలుషమెరుగని దీని కొడుకుల సుఖమ్ము**

జాషువాగారు ఒద్దికగా ధోవతికట్టి, సిల్కు లాల్చీ ధరించి, పల్లెవాటుగా జరీ కందువా జారవిడిచి, ఒక విధమయిన ఊపుతో, అంగలు వేస్తూ, మెలిదిరిగిన మీసాలను మధ్య మధ్య సవరించుకొంటూ, మా వంటివారు, వెంట నడువగా, గుంటూరు పురవీథుల్లో, మసలుతున్నప్పుడు, శ్రీనాథ మహాకవి తలపునకు రాకమానదు.

ఒంటరిగా బయటకు వెళ్లవలసివచ్చినప్పుడు, రిక్షా దిగేవాడు కాదు, ఉడిపి హొటల్‌వద్ద ఆగేవాడు. ఆపైన 'రామ బుక్‌స్టాల్'లో కూర్చొని షాపు యజమాని హనుమంత రావుతోనూ, గుమస్తా సుబ్బన్నతో, సరసాలాడుతూ ప్రొద్దుపుచ్చేవాడు.

నేను బజారులో ఎదురుపడినప్పుడు, రిక్షా ఆపి, ఎక్కించుకొనేవాడు, 'ఎదురైనచో తన మద కరీంద్రము నిల్పి, చేయూతనిచ్చి ఎక్కించుకొనెయొ'!–అన్న అల్లసానివారి పద్యపాదం జ్ఞప్తికి వచ్చి, ఎంతగానో పొంగిపోయేవాడిని.

జాషువాగారిది హాస్య ప్రవృత్తి. అందువల్లనే ఎన్ని కష్టాలు వచ్చినా దిగులుకు లోనయ్యేవారు కాదు. పేదరికం, తనలో సహనాన్ని ప్రోది చేసింది అంటాడు జాషువా!

'లైఫ్ ఈజ్ ఏ మ్యూజిక్ ఆఫ్ టియర్స్ అండ్ స్మైల్స్' అన్నారు డా॥ఎస్.రాధాకృష్ణన్ పండితులవారు. వారన్నట్లే, కవిగారి జీవితంలో విషాదం చోటుచేసుకొన్నది.

*"నాతను యష్టి ప్రత్యణువునంగల పుష్టికి కారణంబు నీ చేతి సుధాశనంబె కదా!" "నా జాతక పుణ్య రేఖవు, ప్రశస్త శుభైకవర ప్రదాతవు!"* అంటూ ప్రాణనాథుని మెప్పుకు గురియైన మీరా, కన్ను మూసింది.

పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో వైభవంగా జరుగుతున్న సన్మానసభలో, జాషువాగారు కవితాగానం చేస్తూ, శ్రోతలను ముగ్ధులను చేస్తుండగా ఈ దుర్వార్త అందింది. జాషువాగారిలో దుఃఖం కట్టలు తెంచుకొన్నది. *"నీ వటు కాటిదిక్కు పయనించిన నాటి మరుక్షణాన, సర్వావయ సంధిబంధనములన్నియు వీడె; కవిత్వ భారతీదేవత మూగబోయె"* – అంటూ ఖేదపడ్డారు.

అంతలో, ఒక శుభవార్త! జాషువాగారిని, 'పద్మభూషణ్' సత్కారానికి ఎన్నిక చేసినట్లు, ఢిల్లీ నుండి కబురు వచ్చింది. మరొక దుర్వార్త! జాషువాగారిని హఠాత్తుగ, పక్షవాతం కాటేసింది. సత్కారానికి ఢిల్లీ వెళ్లలేకపోయారు. ఇల్లు కదలటంలేదు. ఆ పురస్కారానికి సంబంధించిన వస్తు సముదాయం, గుంటూరు జిల్లా కలెక్టర్‌గారికి చేరింది. ఒకనాడు జాషువాగారు–నన్ను వెంటబెట్టుకొని వెళ్లి, ఆ సత్కారాన్ని స్వీకరించి వచ్చారు. మి

# పదాలు, పథాలూ ఓ పదేళ్ళు..3

- 'మో'

**జూన్ సంచిక తరువాయి**

ఎప్పుడూ ఏదో ఒక ఉద్యమం, ఇజం, వాదం, యుద్ధం, సవాళ్ళతో నిండిపోతూ ఒకానొక మనోల్లాసం, మనోధర్మం, హృదయోద్వేగం ఎండిపోతూన్నట్టు కన్పిస్తున్న వచన కవిత్వానికి కాస్తంత ఆహ్లాదం, చమత్కారం, గిలిగింత పంచిపెట్టిన కవి **తనికెళ్ళ భరణి.** *'పరికిణీ'* (2002) ఇప్పటికీ పునర్ముద్రణ పొందుతూనే ఉంది. గతంలో గోపాల్ హొనాల్గెరే 'మదర్స్ శారీ' అనే ఆంగ్ల కవిత రాస్తే అశ్రువులే కురిసాయి మనకు. అదొక విషాద రూపకం. పరికిణీ మాత్రం నవ్యోమోహనం. ఈ పది సంవత్సరాలలోనూ వచ్చిన పది గొప్ప కవితలలో ఇదొకటి అని నా నిర్ణయం. అంతలోనే మనందరి దరి ఒడిచేరి *'నక్షత్ర దర్శనం'* (2010)లో తిరిగి ప్రత్యక్ష మయ్యాడీ **భరణి.** బతుకంతా ఓ నిత్యవసంతంలా, ఒక గొప్ప పర్వదినంగా కన్పిస్తూంది ఈ సంకలనాలు చూస్తూంటే. ఇతని తాత్విక కవితలైన ***'శివతత్వాలు'*** లోనూ నిందాస్తుతి తొంగిచూస్తుంది!



**తనికెళ్ళ భరణి**

సంఘర్షణలు, సంవాదాలు, సమరాలూ వొద్దనుకుంటే చదవాల్సిన కవులు **దీవి సుబ్బారావు** *సూరీడు,* **ముకుంద రామారావు** *నాకు తెలియని నేనెవరో, 'నిశ్శబ్దం నీడల్లో,'* **ఇస్మాయిల్** *'సత్త ప్రణయ యాత్ర,'* **దాట్ల దేవదానం రాజు** *నాలుగోపాదం,* **నామాడి శ్రీధర్** *'బంధన ఛాయ.'* నిజాయితీతో కూడిన నిబంధనలైతే **కందుకూరి శ్రీరాములు** *'వెన్నెల బలపం,'* **యార్లగడ్డ రాఘవేంద్రరావు** *'మునిమాపు, ముంతపొగ'* చదువుకోవాలి. తెలంగాణ పల్లెల దుఃఖాన్ని వినాలంటే **కాసుల ప్రతాపరెడ్డి** *'గుక్క'* చదువుతూ గుక్క పట్టాలి. ఉద్యమాల నుండి కొంచెం సేదదీరుతూ పునరంకితమయ్యాడు **వరవరరావు** తన సంకలనం ***'ఉన్నదేదో ఉన్నట్లు'*** తో పునరావాస స్వర్గాన్ని తిరస్కరిస్తూ-

- **గహనాటవిలో మైదానంలో**
  **గమనంలో గతుకు లేమైనా వచ్చినా**
  **గమ్యం మాత్రం మారబోదు -**

**ఛాయారాజ్** అనగానే అతని దీర్ఘ కవితలు ***'గుమ్మ, నిరీక్షణ, బుదడు, దర్శని, దుఖ్ఖేరు, తొలెరుక'*** లాంటివి గుర్తొస్తాయి. ***'రసస్పర్శ'*** దీర్ఘ కవితాంతాన 25 వివరణలు కూడ ఇచ్చాడు.

విమర్శకుడు, వ్యాఖ్యాత, సమీక్షకుడు, సంపాదకుడు, గజల్ శిల్ప విశ్లేషకుడు **పెన్నా శివరామకృష్ణ** తన ***'దీపఖడ్గం'*** లో తనను తాను నిర్వచించుకొన్నాడు.

- **గాయాలపెదవుల మీద నర్తిస్తున్న / మౌన విషాద బృందాన్ని**
- **పంచవర్ణ అశ్రుశాస్త్రవేత్తను నేను**
- **బ్రాహ్మణాధముడ్ని నేను.**

కవిత్వపు తలతిక్క మ్యూజియంలో ప్రదర్శించాల్సిన పుస్తకం-పుస్తకంపేరు (?) **యింద్రవెల్లి రమేష్.** అవును, కవి పేరే. మొదటి అట్టా, చివరి అట్టా అదే చెప్తూంది. ఇంత అట్టహాస పుస్తకాన్ని త్రిపురనేని శ్రీనివాస్ కూడ ఊహించి ఉండడు. దారి తప్పిన బాటసారులు ఇలాంటి కవిత్వమే రాస్తారు. ఇందులోనూ అదేరకమైన మోసం. రంగురంగుల ఫోటోలు, రేఖా చిత్రాలు, పుస్తకం మధ్యలో ఎవడో ఒక అనామకుడొచ్చి అసందర్భ ప్రేలాపనలు చేయటం, సరిగ్గా సంకలనం సగంలో అచ్చు కాగితాలు తిరగబడేట్టు కుట్టటం, **చినవీరభద్రుడు** లాంటి సమదర్శి కూడా దీన్ని ఆధునికాంతర కవిత్వంగా గుర్తించేట్లు రసాభాస వ్యాసం రాయటం-ఇదంతా ఒక ఉన్మాద చర్య.

వేగుంట మోహనప్రసాద్, ఫోన్ : 9346736726



సూర్యనారాయణ

అరాచక వ్యక్తిగా ఎందువల్లనో ప్రసిద్ధుడయిన **ఎమ్మెస్ సూర్యనారాయణ** డొక్కా సీతమ్మగారిపై *'దయా మేఘ మల్హారి'* అనే దీర్ఘ కవితరాసి అందర్నీ ఆశ్చర్య పరిచాడు. ఇతనిదే అయిన *'దీపోత్సవం'* కావ్యంలో ఎంత బావుందీ వాక్యం! 'చెమ్మ / మా అమ్మ'!! క్షుధని సుధగానూ, లిప్తని గుప్తంగానూ చేసే అసాధారణ శిల్పి ఇతడు.

మనోధర్మం కోసం వెన్నముద్దల్లాంటి **ధేనువకొండ శ్రీరామమూర్తి** కవిత్వాన్ని చదువుకోవాలెవరైనా. అవి – *'అమ్మ ఒడి', 'వల్మీకం.'*

ఇస్మాయిల్‌పై రాగద్వేషాల్ని అతిగా పెంచుకున్నా తప్పకుండా చదవాల్సిన కవి **కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ** *'స్వస్థాన మిత్రుడు.'* సమస్త విశ్వాన్నీ దాని కాస్మాలజీని వైజ్ఞానిక శాస్త్రాన్నీ కవిత్వానికి అన్వయించిన మన ఏకైక తెలుగుకవి కొత్తపల్లి. **వామన విశ్వం**ని కూడా పూర్వం అతను రాసిన *'అక్షరంలో అంతరిక్షం'* తో బాటు చదవాలి.



దేవీప్రియ

**దేవీప్రియ** తన *'పిట్టకూడా ఎగిరిపోవలసిందే'*లోని కవితల్తోబాటు మహదానందంతో చదవాల్సిన రచన ఆయన రాసిందే– *'నా నక్షత్రయాత్ర'* అనే స్వీయ చరిత్ర.



ఎలనాగ

వచన కవిత్వంలో చందోంతర్లయనీ సంగీతాన్నీ ఇటీవల ప్రవేశపెట్టిన మంచికవి **ఎలనాగ.** ఇతని సంకలనాలు *'సజల నయనాల కోసం,' 'మోర్నింగ్ మీద మాల్కోస్ రాగం.'* స్వీయ అనుభవాన్ని అందరి అనుభవంగా మార్చగలిగిన ఇతని శిల్పం, రసమయత, పదవిన్యాసం వచన కవిత్వానికి కొత్త అందాల్నిచ్చింది.

సౌందర్యాన్ని కూడ సంక్షుబ్ధ సౌందర్యంగా చూపే నేర్పు కవి **ఆశారాజుది.** అతని *'ఒగరు'* నుంచి ఒక కవిత రుచి చూద్దామా?



ఆశారాజు

**అధరం మీద గరళ దీపం** : "పియానో మీద వజ్రవైఢూర్యాల మనోహర హారాలను కుప్పపోసి, బంగారు నగిషీల వెన్నెల వెలుగు రంగుల వస్త్రాలను వదిలేసి, ట్యూబులైటు కింద ఆమె నగ్నంగా స్నానమాడుతోంది. తొడలో దిగిన పదునైన కెంపుల పిడిబాకుని, సబ్బురాసి బయటకు లాగుతోంది. మోకాళ్ళ వరకు దిగిన కురులు, పిక్కల మీదికి జారకుండా, నెత్తుర్ని చప్పరిస్తున్నాయి...

అగరొత్తుల పొగల్ని శరీరానికి చుట్టుకొని, మైనపు బొమ్మలాంటి, గరళకాంక్షా వికసిత నయన రమ్య రమణీ–మరొక నిషాసుందరి పక్కకు తిరిగి పడుకొనుంది. ఆమె కదలినపుడల్లా, పూలమకరందం రాసినట్టున్న, ఆమె అరికాళ్ళను ఒక పులిపిల్ల మృదువుగా నాకుతోంది...

కొంచెం తెరిచిన కిటికీలోంచి, తొంగి చూసిన చంద్రుడు, అమృతం కలిపిన విషాన్ని చల్లి వెళ్ళి పోయాడు. లోపల ఏదో పాట, నడుము వొంపు మీద జారిన, నగల అందాన్ని, రంపంతో కోస్తున్నట్టు వినబడుతోంది. బహుశా... హంతకుడు, పులికి దొరికే వుంటాడు."

**కవిత్వంలో లైంగికత :** ఉండండి. ఒక కొత్త కవిని పరిచయం చేస్తాను ముందుగా. నూత్నకవేగాని ఎవరూ గుర్తించినట్లు లేదితన్ని. ఇప్పటిదాకా ప్రచురించినవి నాలుగు గ్రంథాలు 2006 నుండి 2009 దాకా. వాటి పేర్లూ సుదీర్ఘాలు.

1. నిద్రతలుపు అను పొడవైన గదివేళ్ళు
2. నిష్ఫలగది... ఆమెతో వాళ్ళు
3. నిఘాలు... వృత్తాలు... వెల్తురారిన కళ్ళు
4. అసమయ రంగుల ముఖమూ... ఇద్దరి దాహం

నవ్విపోతారుగదా, కంగారు పడ్తారుకదా ఇంత సుదీర్ఘమైన పుస్తకాలపేర్లు విని? చివరికి ఒక్కటీ గుర్తుండదు కదా!

ఈ వ్యాస వృత్తంలోకి ఈ కవి ఇమడడు, స్థలాభావం కారణం. చాలా ఓపిగ్గా అన్నీ (ఈ 4) చదివే అంటున్నానీ మాటలు. మరో సందర్భంలో ఇతని రచనా మూలలన్నీ నేనే వెలికి తీస్తాను.

**అద్దేపల్లి రామమోహనరావు** అనే కవికీ, విమర్శకుడికీ ఏమి అర్థమయిందీ కవిత్వమని ఇతని మొదటి గ్రంథానికి

ముందుమాట రాశాడు? అలాగే శైలజామిత్ర కూడా. ప్రస్తుతానికి నాకు అర్థమైనంత వరకు ఇతని కవిత్వ శైలిలోని కొన్ని సుగుణాలు, అవగుణాలు పేర్కొంటాను (ఏమీ! ఈ మాటలంటున్నది 'మో' యేనా అని మీ సందేహం!).

**అవలక్షణం:** గ్రంథాన్ని నామ్నీకరణం సరిగ్గా చేయలేక పోవటం, క్లిష్టశైలిలో నికృష్టసమాసాలు, ఇతివృత్తం-భాషణంలో అసమాంతరత, పరోక్ష రచన అనిపించే అలీనత్వం, అసంకల్ప క్రియావాక్యాలు ఊపిరాడనివ్వని అవిశ్రాంత వాక్యాలు!

**సలక్షణం:** నిర్మలత్వం, అభివ్యక్తి మీద గొప్ప విశ్వాసం. వేల పదాల్ని ఒక్క పంక్తిలో ఇముడ్చుకోగల సాంద్రీకృత స్థితి. భావచిత్రాల ప్రామాణికత, అధివాస్తవికత-ఎల్లెడలా వాస్తవ నిరాకరణ, ప్రయోగాత్మక పద విన్యాసం, విశృంఖలత్వం ఈ నాలుగు గ్రంథాల్నీ సరైన రూపంలో ప్రదర్శించినట్లైతే, ప్రచురించినట్లైతే ఎంత బావుండేదో!

**కుమార్‌ని** textuality నుండి sexuality కి మార్గం వేసిన సరికొత్త తెలుగు సర్రియలిస్ట్ కవిగా గుర్తిస్తూ ఈనాలుగు సంకలనాలలోని ముందుగా అనుకోకుండా ఏ పేజీ వస్తే ఆపేజీనే నేను మీకు 'స్వజేళనం' లాగా సమర్పిస్తున్నాను కాచుకోండి (మీ మానసిక ఆరోగ్యానికి నా పూచీ ఏమీ లేదిందులో!).

**పునర్జననం:**

గుర్తుకు వెనుక కంటి మసకల పోలికలు
కాటుకని కడిగే నస నవ్వు
కంచె...దేహం చుట్టుతా....వెన్నెముకలోకి వచ్చాడు
తలుపుపై పుట్టే వేలిముద్రల నీటికాడలు
తొలిగిన దుస్తులపై...రాత్రి రాలిపోతూంది
ఆనవాళ్ళని గుచ్చుతూ ఇసుక కిటికీలు...
కొన్ని మన నిశ్శబ్దాలు నా దేహం వెనుక మృదువుగా పూస్తాయి
అరికాళ్ళ చివర వెలిగిన కంఠమో...
ఊపిరి విచ్చిన రెప్పల శబ్దమో... లేదా చెమట జారే శబ్దమో...
రాత్రిధార... కాలి మువ్వల్లో గాలి చెమ్మలు
పొడవైన సన్నని గాయపు గుహలోకి...
చిట్లిన గావుకేకలతో 'ఆమె' ముక్కలైంది
వెలిగించని గదిలో ఆరిన కాంతితో అతను.

నేనో మాటంటాను! కవి శ్రీకాంత్ నించి కుమార్, కవి కుమార్ నించి శ్రీకాంత్ ఎంతో నేర్చుకోవాలి.

**పరిపూర్ణ సాహితీవేత్తలు-కవులుగా : మునిపల్లె రాజు** పేరులోనే 'ముని' ఉంది. ఈ దశాబ్ది తొలి ఏడాదిలో ***'అలసిపోయినవాడి అరణ్యకాలు'***తో పునర్దర్శనం. పురాతనంలోనూ, ఆధునికతను అందులోనూ మార్మికతనూ, చైతన్య ప్రవంతినీ చొప్పించగల నేర్పరి. ఈయన కవిత్వ ఋషులు: వాల్మీకి, కాళిదాసు, శంకరుడు. యోగులు: పతంజలి, జైమిని భరద్వాజుడు, అగస్త్యుడు, అంగీరసుడు, శాక్యాయుడు, నాదముని త్యాగరాజు. ఇక ఆధునిక కవి మునులు, కవి మిత్రులు-విశ్వనాథ, కరుణశ్రీ, జాషువా, శ్రీశ్రీ, శిష్లా, అజంతా, తిలక్, దాశరథి, త్రిపురలు - ఈ **అరణ్యకం** -

**- యజ్ఞ కుండి నుండి పద్యం ఆవిర్భవిస్తున్నది.**
**అప్పుడే మృత్యువు దీపంగా దర్శనమిస్తున్నది -**

ఆధునిక జనజీవన తొడతొక్కిడిలో, అలజడిలో, ఆందోళనలో, అస్తిమితంలో ఓ మహాకావ్య నిర్మాణం జరగటమనేది ఒక గొప్ప ఆశ్చర్యకరమైన సంఘటన. దాన్ని నిజం చేసింది *'పునర్యానం.'* ఈ నిర్మాత **చినవీరభద్రుడు.** ఈయన రచనలన్నీ సహృదయులకు రాసిన ప్రేమలేఖలే.



**చినవీరభద్రుడు**

**పునర్యానం** కావ్యనిర్మాణంలో ఎంపిక లక్ష్య లక్షణాలన్నీ నిర్మాణపరంగా, శైలీపరంగా పరిపుష్టి నొందాయి. ఈ కావ్యం కేవలం నేల విడిచిన సాము కాదు. లోకవృత్తమే దీని ఇతివృత్తం. ఎన్నెన్ని ప్రాంతాలు, ప్రదేశాలు, పట్టణాలు, గ్రామాలు ప్రవేశిస్తామో దీని పఠనంలో - హరిద్వార, అరకులోయ, పత్తికొండ సీమ, నల్లమల అడవి, శ్రీరంగ పట్టణం, కెరమోరిఘాట్, లేపాక్షి, అనంతగిరి, రాజమండ్రి, గోదావరీ కోనేరు లోయలు, సవర గూడాలు, కొదమగ్రామం, మహానంది, ఆళ్ళగడ్డ, ఇంద్రవెల్లి! ఎన్నెన్ని వృత్తులతో కవికి పరిచయాలు, ఆత్మీయ బాంధవ్యాలు ఉన్నవో వాటన్నిటితో సహానుభూతిని పొందుతాం. ఆదివాసులు, కొండరెడ్లు, సవరకవి, కోయవనిత, కుమ్మరులు, గానుగౌడ్, తెలుకులాళ్ళు, కోడు పిల్లవాడు, నేతవాళ్ళు, జాలర్లు మాత్రమేగాక, వాళ్ళ వాళ్ళ సంపూర్ణ సజీవ ముఖ చిత్రాలుగా కంసాలి సోమలింగం, మంగలి వీరస్వామి, చెంచు బాలుడు, సవరపూజారి,

మూకదొర, మన్నెదొర, చెంచు, గోండు, వడ్డెర, గదబల యువతీ యువకులు, వృద్ధులు ఎందరెందరో!! ఈ కావ్యంలోని పంచభూతాల ప్రపంచంలో (పృథ్వి, అగ్ని, రసః, మరుత్, ఆకాశ) మొత్తం 19 సర్గలుండగా, పృథ్విలో 101, అగ్నిలో 95, రసఃలో 31, మరుత్‌లో 24, ఆకాశంలో 197 పద్యాలున్నై. తైత్తరీయోపనిషత్తు భూమికగా ఈ ఆధునిక కవి ఏం ప్రవచిస్తున్నాడిందులో అని తెలుసుకోవాలంటే ఈ కావ్యాన్ని చాల నిదానంగా, శ్రద్ధగా, భక్తితో, ప్రేమతో, రసైక్య భావనతో మాత్రమే చదువుకోవాలి. ఈ ఆధునిక కవి చెప్పే సత్యాలు–పరమసత్యాలు ఇవీ: అన్నం, ప్రాణం, మనస్సు, విజ్ఞానం, ఆనందం అన్నీ పరమ సత్యాలు. కానీ వేటికవే పాక్షిక సత్యాలు. అన్నీ కలిస్తేనే పరమ సత్యాలు. 264 పుటల ఈ సుదీర్ఘ కావ్యంలోనించే ఒకే ఒక పంక్తి నుదహరిస్తూ కావ్య పఠనం ఎలా ఉంటుందో చూపిస్తాను.

– **బత్తాయి పండు వలుస్తుంటే చేతుల్లోకి**
**చిమ్ముతుంది చూడు ఆవిరి సుగంధం** – అలా ఉంటుంది.

***'కోకిల ప్రవేశించే కాలం'*** ఇతని ఇటీవలి గ్రంథం. ఇది ప్రకృతి కృతి. హేమంత, శిశిర వసంతాల జీవనోత్సవం. ప్రకృతిలో ఐక్యమయ్యే కవిత్వపు పర్వదినాల పండుగ. ముఖచిత్రం కవి స్వయంగా రచించిన జాపనీస్ శైలీ రమ్యత్వంతో అలరారింది. పైకి ఏదో ఓ ప్రార్థనలానో, ధ్యానంగానో విన్పించే ఇతని కవితలో ఒక హఠాత్ చలనం చూడండి –

– **ఆ ఒక్క క్షణాన్ని రెండు చేతుల్తో జాగ్రత్తగా పట్టుకో**
**పేపర్‌వాడు వార్తా పత్రిక ఇంట్లో గిరవాటు పెట్టి**
**వెళ్ళిపోయినట్టుగా, కుళాయి నీళ్ళు చిమ్మినట్టుగా**
**పొయ్యి మీద పాలు పొంగినట్టుగా**
**తటాలున లేవటం మంచిది.**

**ఒకానొక విశిష్ట కవి** దేవీప్రియ మూడు దశాబ్దాలలో రచించిన మూడు కావ్యాలు ***అమ్మచెట్టు, నీటి పుట్ట, తుఫాను తుమ్మెద*** ఒక సంపుటిగా వచ్చింది **దేవీప్రియ కవిత్వం** పేరున. దీనికి ముందుమాట రాస్తూ పతంజలి 'కవన మహాశిల్పి దేవీప్రియ' అని గొప్ప కవితాత్మకంగా ప్రశంసించాడు. ఈ ప్రకటనను ఉపపత్తిగా పేర్కొన్న అంశాలు ఇవీ: వైవిధ్యము, విస్తృతి, సాంద్రత, అభివ్యక్తి; గాఢత, కాల్పనికత, భావుకత, శబ్ద చిత్రణ, భాషా ఛందో అలంకార జ్ఞానాలు. దేవీప్రియ వ్యక్తిత్వాన్ని గురించి పతంజలి మాటలు – "జెండాలు, కాగడాలు, నెత్తిమీద పెట్రోమాక్స్ దీపాలు పెట్టుకు తిరిగే కవుల మధ్య దేవీప్రియ ఒక ద్వీపం లాంటివాడు." దేవీప్రియ నిరంతర వర్తమాన పైగంబర కవి.

**విభిన్నకవులు** ఎవరెవరూ అంటే **పసుపులేటి పూర్ణచంద్రరావు (లెట్‌మీ కన్ఫెస్), అయిల సైదాచారి (ఆమె నా బొమ్మ, నీలం మాయ), జగన్‌రెడ్డి (నేనొక్కన్నే), అరుణ్‌సాగర్ (మాగ్జిమమ్‌రిస్క్, మియర్ మేల్).** వీళ్ళంతా ప్రధాన స్రవంతిని వెలివేసిన కవులు. బహుశా తమను తామే బహిష్కరించుకొన్న వాళ్ళు.

**పసుపులేటి** తెలుగు కవయిత్రుల ఆగ్రహానికి, అసహనానికీ గురయ్యాడు. తన కవిత్వంలోని పోర్నటోపియాతో, స్కోపో ఫీలియాతో తన ఫేలోక్రాటిక్ భాషా భావ ప్రాప్తితో.

***లెట్‌మీ కన్ఫెస్‌కి*** **' మో'** రాసిన 24 పేజీల వెనుకమాట కూడా విఫలమైంది కవిగా ఇతన్ని రక్షించడానికి.

**అయిల సైదాచారి** లిబరేటెడ్ ఉమన్‌ని స్వప్నిస్తూ వివాహితుడైన కవినని తనే చెప్పుకున్నాడు ***'ఆమె నా బొమ్మ'*** సంకలనంలో. లైంగిక కవిగా స్వీయ ముద్ర వేసుకొన్నాడు – **"తలుపు తెరు / నీ కాస్మిక్ యోనిలోకి / దారిచ్చి దాపున జేర్చి దోపుకో నన్ను ముద్ద జేసి". "ఆత్మకు లింగం ఉందా?"** అని ఇతని సందేహం. ***'నీలం మాయ'*** లో మరీ ముదురుగా కన్పిస్తాడీ కవి. **''అగ్ని స్నానంతో కాలువోపాలి / స్త్రీ మర్మ మందిరంలోకి"** – ఆత్మ మేళాలో తప్పిపోతూంటాడప్పుడూ ఓ కవి, 'మర్మాంగాలులేని స్త్రీలు' ఎదురవుతూంటా రప్పుడప్పుడూ! అయినా సంచార జీవితం కావాలి, సంసార జీవితం ఒద్దంటూ **"కవిత్వీకరించటం, స్ఖలించటం రెండూ మృత్యువు"** అని నిర్ధారించుకొంటున్నాడు.

**జగన్‌రెడ్డి** సంకలనం ***'నేనొక్కన్నే.'*** ఇతను మరొక ఆవారా కవి. కవిత్వాన్ని చరిత్ర, తత్వశాస్త్రంతో కలగలిపి చదువుతాడితను. ఇప్పటి తరానికి ఆవలి ప్రతినిధి. చిట్లిపోయిన ఆరుద్ర పురుగు. దిల్ అంతా దిగులు. ఆలోచనే అసలైన గాయం. నిర్విరామ పలాయన నిర్మాణం. రాత్రిని దుమ్ములా కుమ్ముకుంటాడు. జేబుల్నిండా పేజీలు. బొమ్మ జెముడు నీడలో పడక. రాత్రి ఆదమరచిన అనాథ. యమలోక


**జగన్‌రెడ్డి**

స్వర్గం. కుక్కల నవ్వు, హొయలు హొయలుగా, చితిరాత్రి ఏకాంతం, దేహదిమ్మరి తనం–ఇదీ ఈ కవి విశ్వం. **నగ్నత్వమొక భగ్న నిమగ్న ఉద్విగ్న పద్య స్థలి** – అని తన కవిత్వానికి తానే ఇచ్చుకొన్న నిర్వచనం.

**అరుణ్‌సాగర్** ఒక మెట్రోకవి. ఆరుద్ర ***'సినీవాలీ'*** రాసేనాటికి మనకంటూ ఒక మహానగరమేదీ లేదు. మెట్రో కల్చర్‌తో పాటు వచ్చిపడే మెరిట్రీషస్‌నెస్ కవిత్వంలో మనకు పరిచయం కాలేదు. ఒక్క పఠాభి తప్ప సిటీ పొయెట్ అంటూ ఎవడూ లేదు.



**అరుణ్‌సాగర్**

***'నగరంలో వాన'*** రాసిన **కుందుర్తి**కి తెలిసిందల్లా మహా అయితే మలక్‌పేట ఒక్కటే. అమెరికన్ కవి కార్ల్ శాండబర్గ్ కవి పేరున ఓ నగరమే వెలిసింది కదా! కవిత్వానికీ, కంప్యూటర్ గ్రాఫిక్స్‌కీ పెళ్ళి చేశాడు అరుణ్‌సాగర్. తెలుగు, ఇంగ్లీషుల సప్తపది కూడ నడిపించాడు. కావ్యశైలికి చిత్రకళా రీతిని కూడా గోరింటాకులా పెట్టాడు. మెట్రోసెక్స్యువల్ (రెట్రో సెక్స్యువల్ అనే మాట కూడా విన్పిస్తోందీనాడు) కవిత్వం ఎలియట్ చిత్రించిన ఆల్ఫ్రెడ్, జె. ఫ్రూఫ్రాక్ వ్యక్తిత్వం లాంటిది. 2002లో **మార్క్ సింప్సన్** కాయిన్ చేసిన ***'మెట్రోసెక్సువల్'*** అనే పదాన్ని వెంటనే అందిపుచ్చుకొని గొప్ప భయాశ్చర్య కవిత్వాన్ని తెలుగులో ప్రవేశపెట్టాడు అరుణ్‌సాగర్. తర్వాత మళ్ళీ ***'మియర్ మేల్'*** అంటూ మరోసంకలన సంచలనం. ఇది కేవలం పురుషులకేననే ఓ హెచ్చరిక! ఎంచేతంటే అధాట్టుగా చూస్తే–

- **చివరకు నేను / నీ నిండు వక్షోజాలకు వేలాడుతున్న / ఖండిత శిరస్సును –**
- **మోహమో దేహమో వయస్కాంత క్షేత్రం**
- **దేవునికికూడా లాస్ట్‌టెంప్టేషన్ కలిగెనట**

లాంటి పంక్తులు కళ్ళల్లోకి ఇరుక్కుంటయ్.

తెలిసో తెలియకో ఇలాంటి విభిన్న కవుల్ని రూపొందించిన వాడు **త్రిపుర.** తెలిసో తెలీకో త్రిపుర కవిత్వ సారమైన బాహ్య ప్రపంచ వాస్తవ నిరాకరణకు ఆకర్షితులైన వాళ్ళీ విభిన్న కవులు. తెలుగు తనాన్ని ఈనాటి వచన కవిత్వం దాటి పోయిందనే సూచన ఎప్పుడో ఇచ్చేశాడు త్రిపుర –

- **దూరంగా లైట్ హౌస్ చీకట్లో**
  **నాడిలాగా కొట్టుకుంటూ వుంటుంది** – అంటూ

**ఇస్లాం/ముస్లిం కవిత్వం:** ఒకే దేశంలోని అనేక సమాజాలకూ, వాటి అనేక మతాలకూ, వాటి అనేకానేక మత గ్రంథాలకూ సంబంధం ఉంటే, కవిత్వానికీ, మతానికీ సంబంధం తప్పకుండా ఉంటూనే ఉంటుంది. కాకపోతే కొంతలోకొంత సహిష్ణుత పరస్పర అస్తిత్వాల అంగీకారం, ఆమోదం, ఆప్యాయతలు లోపించినపుడు సంఘర్షణ వస్తుంది. కవులూ కలహించుకొంటారు. రాజ్యాంగం నిజంగా మతాతీతంగా ప్రవర్తిస్తే సమస్యలుండవు. సహజీవన సమాజంలో అప్పుడప్పుడూ కన్పించే విలోలాలు, విన్పించే కల్లోలాలు కవుల్ని సహజంగానే కదిలిస్తయ్. ఎవరి మూలాల్లోకి వాళ్ళు వెళ్ళిపోవాలనే స్వీయ రక్షణ మొదలవుతుంది.

ఈ సందర్భంలో వచ్చిన కావ్యాలే **ఇక్బాల్ చంద్ *'ఆరోవర్ణం, బా రహమతుల్లా పీపల్ కే నీమ్,'*** సంకలనాలు ***'అలావా, అజా'*** (ముస్లిం సంస్కృతి కవిత్వం, గుజరాత్ ముస్లిం కవిత్వం). వీటికి ముందెన్నడో వచ్చిన సంకలనాలు ***'జిహాద్, జల్‌జలా. అలావా'***లో 102 కవితలున్నై. ముస్లిం కవుల సందేహాలకూ, సందిగ్ధాలను విశ్లేషిస్తూ సూఫీతత్వమే సరైన మార్గమని సూచించాడు ఖాదర్ మొహియుద్దీన్. దేశీ ముస్లిం సంస్కృతుల్ని కాపాడుకోవాలని నిర్దేశించాడు స్కైబాబ.

**ఖాదర్** ఏమంటున్నాడు? "హిందూ ఆధిపత్య వాదాన్ని ఛేదించటం అంటే ఆస్థానంలోనే ముస్లిం వాదాన్ని స్థాపించటం కాదు... ముస్లింవాదం తనలోనే తానొక ఏకవచనం, ద్వివచనం, బహువచనం...సృజనాత్మక నినాదం..."

**మరి స్కైబాబా?** "మతం వ్యక్తిగతం అనే స్పృహతో మతం జోలికి ముస్లిం వాదం వెళ్ళదు.... ముస్లిం ప్రజాస్వామిక ఉద్యమమే భావవిప్లవంగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది.. 'దివా' ముఖ్యం, 'దునియా' కాదనేవాళ్ళు ఎన్నో ప్రశ్నలకు జవాబు చెప్పాల్సి ఉంది."

**అన్వర్** అన్నమాట ***'అజా'***లో– "అతివాద, మితవాద, మతవాద రాజకీయాల నుంచి– మానవత వైపుగా... మానవత్వ మతాన్ని నూరిపోద్దాం."

**బా రహమతుల్లా** మెటఫర్ చాల గొప్ప ఆశంస.

**"పీపల్ వేరు నీమ్ వేరుగాక పీపల్ మే నీమ్‌లా**
**రావి చెట్టులో వేపచెట్టులా"** ఆమెన్!

**ఈ దశాబ్దపు కవి శివారెడ్డి** నిరంతరం ప్రవహిస్తున్న కవి. విట్మన్ తర్వాత ఫ్రాస్టనీ, ఫ్రాస్ట్ తర్వాత నెరూడానీ



కె. శివారెడ్డి

చదువుతూంటే మనలో మనకే తెలుస్తుంది కవిత్వం ఏ సమయంలో, ఏ దేశంలో ఎలా పరివర్తనం చెందుతూందీ అనే సంగతి. 1973లో ఇతని కవితా ప్రస్థానం *'రక్తం సూర్యుడు'* తో మొదలయి *'మోహనా! ఓ మోహనా!'* కొంత మలుపుతిరిగి *'అంతర్జనం'* (2002)లో ఒకానొక అంతర్గత్వానికీ, అంతర్వీక్షణకూ లోనయి ఈ నాటికి *'గగనమంత తలతో'* పరిణతి పొందింది. వినగానే అహంకారమనిపించవచ్చు. కాని టాగోర్ – "వేర్ ది హెడ్ ఈజ్ హెల్డ్ హై" గానే మనం భావించాలి.

**ఆమె ఎవరైతే మాత్రం** (2009) స్త్రీ మూర్తిత్వానికీ, మూర్తి మంతానికీ పుటంపెట్టి పటంకట్టింది. ఈనాటి శివారెడ్డి కవిత్వంలో వచ్చిన మూడు మార్పులేమిటంటే – డిక్షన్, ప్రిడిక్షన్, ప్రిడిలిక్షన్. *'అంతర్జనం'*లోంచి ఓ కావ్య వాక్యం –

**– ప్రతివాడు పొద్దున్నే లేవగానే**
**వాడి కాళ్ళకి వాడు నమస్కరించి**
**తిరగడానికి బయల్దేరాలని –**

అధ్యయన శీలాన్ని ఇంకా పెంచుకోవాల్సిన మన వందలాది తెలుగు వచన కవులకు వందనాలతో..

★

ఇహ ఇపుడు కవిత్వాన్ని వెనకినించి ముందుకి చదవాలి.

★

(*గమనిక* : ఈ వ్యాస రచన నాటికి నాకు అందుబాటులో ఉన్న గ్రంథాల్ని మాత్రమే చదవటం జరిగింది.)

*(సమాప్తం)*



'మో'

## 'మో' కు కృతజ్ఞతలు

**మా అభ్యర్థనమేరకు గత దశాబ్దంలో వచన కవితల తీరుతెన్నులు - వందకుపైగా సంపుటి, సంకలనాలు పరిశీలించి, నూటయాభై కవులను పరామర్శించి ఒక సమగ్రమైన కవితా వస్తు - విన్యాసాల మదింపును ఎంతో శ్రమ - శ్రద్ధతో అందించిన మోహన ప్రసాద్‌గారిని అభినందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. - సంపాదకులు**

---

# వృద్ధాప్యపు ఛాయలు

**- గెడ్డాపు లక్ష్మీ ప్రసాద్**

అన్నా!
నేను చిన్నప్పుడు చేసిన ఘనకార్యాలు
గతంలో సాధించిన అద్భుత కృత్యాలు
పదేపదే గుర్తుకొస్తున్నాయి.
అవకాశం దొరికిందే తడవుగా
ఎవరు దొరికితే వారితో
వాటి గురించే ముచ్చటించాలనిపిస్తుంది.
ముచ్చటిస్తున్నాను కూడా!
అన్నా! ఏమిటిది? ఎందుకిలా?

తమ్ముడూ! ఏం లేదు.
నీకు ముసలితనం వచ్చేసింది.
ఎప్పుడైతే దృష్టి
ముందుకు వెళ్లడం ఆగిపోతుందో
అప్పుడే మనస్సు
వెనక్కు మళ్లడం మొదలౌతుంది.
ముసలితనాన్ని జయిస్తావో
మృత్యువుకే లొంగిపోతావో
అంతా నీ యిష్టం.

# అహింస అంటే అ (తి) హింస?

- సముద్రాల వేంకట కృష్ణ

"మనము అహింసో పరమో ధర్మః" అన్న ధర్మ సూత్రం మీద జీవిస్తున్న భారతీయులము. ఈ మాటతో విభేదించే వారు ఎవరూ కనిపించరు కానీ, హింస అంటే ఏమిటి, 'అహింసకూ హింసకూ' ఎంత దూరము అన్న దాని మీద అవగాహన ఉన్న వారు కూడా అరుదే. చిన్నప్పుడు అహింసకు మొదటి భాష్యం శాకాహారమని. ఇది నాకు మొదటినుంచీ అసంబద్ధమనిపించింది. నాకు అప్పటికే జగదీశ్ చంద్ర బోసుగారి జంతు, వృక్ష సమానాంతర లక్షణాలను గూర్చి (పద్మనాభరావు అనే టీచరు, తర్వాత ఆయన శ్రీ వేం. యూనివర్సిటీలో బోటనీ ప్రొఫెసరు, ద్వారా) తెలుసు. ఆలోచించిన పిదప, ప్రతి బెండగింజలోనూ జీవముందని, జీవము లేని పదార్థము, జీవము నివ్వలేదని, ఎదుగుదలకు దోహదము కాజాలదని గ్రహించాను. అప్పటికి భగవద్గీత చదవనందున, యజ్ఞమంటే ఒక జంతువును చంపటమనే మూఢాభిప్రాయంలో ఉండి శాకాహారులు (అహింసా పరులు) యజ్ఞమెట్లా చేస్తారనే సందేహమొచ్చింది. మనకు స్వాతంత్ర్యము అహింసా మార్గాన వచ్చిందన్న మూఢ నమ్మకం, నాకు 9-10 ఏళ్ళ మధ్యలోనే పొట్టి శ్రీరాములు గారి మరణము తర్వాత హింస కళ్ళార చూసిన తర్వాత తొలగి పోయింది. అంతే కాదు, అహింస హింసగా మారితేనే కొన్ని పనులు సాధ్యమౌతాయని సిద్ధాంతము కూడా మొలకెత్తింది. ఇదంతా కలసి, అహింసకసలు నిర్వచనం మరుగున పడేసాయి. సంవత్సరంలో 9 నెలలకు పైన గడ్డి పరక కూడా మొలవటానికి లేకుండా మంచుతో కప్పబడే సైబీరియా లాంటి చోట్ల చిక్కుడు కాయలు తిని బతకటమయ్యే పనేనా? 'కేసరి జీర్ణ తృణంబు మేయునే' అని భర్తృహరి కూడా ఎదురు ప్రశ్న వేశాడు. సింహం, పులి ఇవన్నీ మనకు పవిత్ర జంతువులే. అంచేత ఒకటి మటుకు సత్యం. అహింసకూ, ఆహారానికి సంబంధం లేదు.

ధర్మ సూత్రాల భాష్యం వ్యక్తిగతంగా, సమిష్టిగతంగా వేరు వేరుగా ఉంటాయి. ఒక దానిని వేరొక చోట అమలు చేస్తే కలిగే నష్టమపారం. నా పర్సులోని వెయ్యి రూపాయలెవడయినా కొట్టేస్తే, "పోన్లే నాయనా నీకెంత అవసర మొచ్చిందో, ఇంద ఈ వంద ఉంచు" అన్న అహింస వ్యక్తిగతంగా గొప్పే (కావచ్చు), కానీ దేశపు సొమ్ము లక్షల కోట్లు ఆంఫట్ చేసే మంత్రి రాజులను మోహిత మనసుతో వదిలేయటము 100 కోట్ల మందికి హింస కాదా? భగవద్గీతలో ఒక చిత్రమైన శ్లోక త్రయముంది.

**కింకర్మ, కిం అకర్మ ఇతి కవయో అపి అత్ర మోహితాః**
**తత్ తే కర్మ ప్రవక్ష్యామి యత్ జాత్వా మోక్ష్యసే అశుభాత్**

**కర్మణో హి అపి బోద్ధవ్యమ్ బోద్ధవ్యమ్ చ వికర్మణః**
**అకర్మణః చ బోద్ధవ్యమ్ గహనా కర్మణో గతిః**

**కర్మణి అకర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మ యః**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్న హోకర్మ కృత్**

*(4.16 - 18, భగవద్గీత)*

"పని చేస్తూనే కర్తృత్వాభిమానము లేక పోవటమే అకర్మ. ఆ కర్మ స్వార్థానికి కాక లోక కల్యాణమునకే వినియోగపరచడం విశిష్టమైన వికర్మ. కర్తృత్వాభిమానము స్వార్థము లేకపోతే, మూడింటి మధ్య భేదము కనిపించదు" అని సూక్ష్మంగా వీటి భావము.

మానవాళిలో, మరీ ముఖ్యంగా మనదేశములో ఒక సన్నాసి వర్గముంది. "ఏ పని (కర్మ) చేసినా పాపం చుట్టు కుంటుంది. కనుక, ఏ పనీ చేయకుండా అకర్మణిగా ఉంటే పాపమంటుకోక, కైలాసానికి ఫ్రీ టికెట్ దొరుకుతుందని" ఈ వర్గం వారి బోధ. ఏ పనీ చేయకపోతే తిండి ఎట్టా అని మొదటి ప్రశ్న. గ(అ)డుసు సమాధానం "అడుక్కు తినవచ్చు"

డా. సముద్రాల వేంకట కృష్ణ, ఫోన్ : 9490743829

అని. ఏదైనా తెలుగులో చెప్తే నీచం, సంస్కృతంలో అయితే ఉచ్చం. అంచేత భిక్షాటన లేక ఊంఛ వృత్తి అంటే మహా గౌరవం. ఇంకా ఏమైనా అంటే, అంతా మాయే కద, పని మాయ అందుకని పనులుమాను అని మాయమాటలతో మాయ చేస్తారు. ఇట్లాంటి దగుల్బాజీ వాదనలు విని విని విసిగిన కార్యశీలి కృష్ణుడు. "కర్మ చేయక నీవెట్ట పుట్టావు, కడుపు నింపటమే కాదు, ఊపిరి పీల్చడం, ఇత్యాదులు కూడా పనులే కదా అవి మానేసి నిలవగలవా, అందరూ (నీమాదిరి) సన్నాసులైతే నీకు కబళమేసేది ఎవరురా సన్నాసీ! అసలు కర్మ, అకర్మ, వికర్మల గురించి తెలుసుకొని అప్పుడు సన్యాసివవుతావో, సన్నాసివవుతావో తేల్చుకో" అని చెపుతూ, ఈ మూడు శ్లోకాలు చెప్పాడు.

అహింస అంటూ హంసగీతి పాడతానని ఈ గీత హింస ఏమిటంటారా? కర్మ, అకర్మ, వికర్మ సూక్ష్మ బంధము తోటి ఎలా ముడిపడి ఉన్నాయో అట్లాగే హింసలో అహింస, అహింసలో అతిహింస జంట కవలలవలె అతుక్కొని ఉన్నాయి. అది ఎట్లాగో చూద్దాము.

అహింస అంటే, అవతలవాడు ఎ.కె. 47తో చంపుతూంటే "శాంతి, శాంతి" అంటూ చంపబడటమా? సవ్యమైన మనో ప్రవృత్తి కల వాడికి, అహింస అనగానే ధర్మం తలపుకు రావాలి. ధర్మం మూల సూత్రం ఋగ్వేదం నుంచి ప్రతి ధర్మ శాస్త్రంలోనూ చెప్పి ఉంది. మహాభారతములోని తిక్కన (భీష్ముడితో చెప్పించిన) మహావాక్యం–

**ఒరులేయవియొనరించిన నరవర**
**యప్రియము తన మనంబునగు దా**
**నొరులకు నవి చేయకునికి పరాయణంబు**
**పరమము ధర్మముల కెల్లన్**

ధర్మమనగానే చాలా మంది బౌద్ధమే అనుకుంటారు. బౌద్ధం ధర్మములో ఒక ముఖ్య అధ్యాయమే. బౌద్ధం కానీ, జైనం కానీ పై ధర్మ మూలసూత్రానికి వ్యాఖ్యానాలే. పరమము ధర్మముల కెల్లన్, అంటే పరమో ధర్మః మనము మొదలు పెట్టింది "అహింసో పరమో ధర్మః" అని కదా. కాబట్టి అహింసకు అసలైన నిర్వచనమీ తిక్కన పద్యముగా తీసుకోవాలి. (ఈ భావమొచ్చే శ్లోకము పద్మపురాణములో కూడ ఉంది.) ఎంతటి గొప్ప వాడైనా చెప్పింది విశ్లేషించకుండా "అక్షరాలా" ఆచరణలో పెట్టాలనుకోవటం అనర్థదాయకం.

బుద్ధ భగవానుడు "సాటి జీవులకు హాని తలచ వద్ద"న్నప్పుడు, చెట్టు, దానికున్న కాయ సాటి జీవులని తెలియదా ఆయనకు. అది విస్మరించి, ఆయన శాకాహారివి కమ్మన్నాడనటము మన తెలివిలేమి. ఈ విషయములో భగవద్గీత 18.63 శ్లోకమవిస్మరణీయము.

నీవు, అనగా భారతీయుడవు, సైనిక బలముతో ఇంగ్లాండ్, స్కాట్లాండ్, వేల్స్ ఇత్యాది దేశాలను కుతంత్రంతో విడగొట్టి, వాటి సమాఖ్య అయిన దేశంను బానిస దేశంగా చేసుకొంటే అక్కడివారు మనస్తాపానికి లోనవరా. అందుచేత ఆ పని వారు మనకు చేసినపుడు వారు ధర్మచ్యుతులైనారు. మనము ధర్మ పరాయణులమైతే ధర్మచ్యుతులను నిలువరించి నిహతులను చేయటం మన విద్యుక్త ధర్మము. సామము, దానము నిరర్థకమని తెలుసుకోడానికెక్కువ సమయ మక్కరలేదు. సమయమెక్కువయ్యే కొద్దీ అధర్మము పాతుకొని ఊడలు దిగుతాయి. భేదము, దండము త్వరగా అమలు చేయాలి. అలా కాకపోతే మనము అధర్మ పరాయణుల మవుతాము. ఈ సందర్భంలో బుద్ధ భగవానుడి మహా పరి నిర్వాణ సూత్రము (మహాపరినిబ్బన)లో ఒక విచిత్రమైన ఘట్టం గుర్తు చేసికొందాము.

భగవానుడు, ఎక్కువగా రాజకీయ సమస్యలకు దూరంగా సంచరించినా, అప్పుడప్పుడూ వాటి సంపర్కం తప్పలేదని ఈ ఘట్టం చెబుతుంది. అజాతశత్రు (అజాతసత్తు) వనే మగధ రాజు వజ్జి (వైశాలి) రాజ్యాన్ని గెలవాలనే యోచనలో భాగంగా తన మంత్రి వశ్యకారుని (వస్సకార) భగవానుని వద్దకు పంపాడు. అజాతశత్రువు క్రూరత్వము లోకవిదితమే. అయినా, అతను పొరుగు రాజ్యాన్ని ఆక్రమించాలనే ఉబలాటాన్ని శాంతి స్వరూపమైన బుద్ధుని కెందుకెరుకపరచాలన్నాడో! పైగా అతను వజ్జి రాజ్యాన్ని కబళించాలన్న గాఢ వాంఛ, సరితూగే హింసాపూరిత పదజాలంతో మంత్రికి చెప్పి, "నీవు బుద్ధుని వద్దకు వెళ్ళి, నమ్రతా పూరిత నమస్కారములు చేసి, పిమ్మట, నా ఉద్దేశ్యము నా తీవ్ర పదజాలాన్ని ఏ మాత్రం మార్చక ఆ స్వామికి చెప్పు; అంతే కానీ ఆయనను ఏ ప్రశ్న వేయకు," ఆ సిద్ధార్థుడేమంటాడో పొల్లుపోకుండా మనసుకెక్కించుకొని నాకు చెప్పు; "తథాగతులెప్పుడూ అసత్యము నుడువరు." పాలి భాషలో *"యథా చ భగవా వ్యాకరోతి ఉగ్గహేత్వా మ మమ్ ఆరోచేయ్యాసి. న హి తథా గత వితథమ్ (1) భనన్తితి."* గాథా స్రవంతి ప్రకారం. ఇది విని భగవానుడు వశ్యకారునికి

అపరిహాణీయ సప్తధర్మసూత్రములు తెలిపి, ఇవి పాటించినంత కాలం వైశాలి రాజ్యం అజేయముగానూ, సంపన్నంగానూ శోభిల్లుతుందని చెప్పాడు. అంతేగానీ, యుద్ధమేల శాంతి మేలని అనలేదు. దీనిలోని మర్మమెరిగి వశ్యకారుడు. అజాతశత్రువు, వజ్జి రాజ్యపు ఐకమత్యమును విభజించి, దానిని ఆక్రమించారు. దీనిపై సుదీర్ఘ చర్చ జరిగింది, జరుగుతూంది. మనమిక్కడ గ్రహించవలసినదొక విషయము: భగవానుడు కూడా పాలకులు యుద్ధాలు చేయటమనే విషయాన్ని పూర్తిగా ఖండించలేదు. అవసరమైనప్పుడు అప్పుడప్పుడూ, ఇటువంటివి తప్పనిసరి అని తథాగతుని మనో భావనేమో! లేకుంటే వశ్యకారుడు అజాతశత్రు హింసాపూరిత మాటలను యథాతథంగా తథాగతునికి విన్నవించినపుడు, స్వామి ఇంకేమీ మాట్లాడకుండా యుద్ధం హింస అది పనికిరాదని ఖచ్చితంగా చెప్పేవాడు కదా.

ఏదిఏమైనా, పోరాటమనగానే హింసా సూచితము. అహింసా పోరాటమంటే పోరాట పటిమలో లోపముండాలనో, లేక అహింసకన్యభాష్యముందనో తెలుస్తుంది. ఇప్పటి పరిస్థితి చూద్దాము. అహింసా మార్గమని, ఒక పెద్దాయన నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నౌకాశ్రయము కట్టాలని గుడారమేసుకొని ఆమరణం నిరాహారదీక్షకు కూచుంటాడు. అద్దెకు తెచ్చిన 5 వేల మంది ఓ పనికి మాలిన ప్రొఫెసరు నాయకత్వంలో రంగనాయకుల పేటలో రైల్ రోకో, దర్గామిట్టలో రోడ్ బంద్, ఇట్టాంటివి చేస్తారు.

ఉదయగిరి బాధితులకు మద్దతుగా, పోలీసులు లాఠీలు ఝుళిపిస్తారు. ఒక లాఠీ సంతపేటలో సమరసేనారెడ్డికి తగులుతుంది. అంతే, పోలీసు దౌర్జన్యం నశించాలంటూ ఇంకా పెద్ద గుంపు, ఈసారి బస్సులు భగ్న, పోలీసుల ఫైరింగు, జమీన్ రైతు నుంచి, హిందుస్తాన సమయం వరకు పేజీలు పట్టనంత అక్షరాలతో “పోలీసు ఫట్ కు పదిమంది హట్” ఇదంతా అహింసా పోరాట పటిమ ప్రసాదం. ఆ మరణ నిరాహార దీక్షకు కూచున్నాయన మాత్రం ముఖ్యమంత్రి నెల్లూరులో అత్తవారింట్లో భార్యతో “ఉదయగిరి దగ్గరకు సముద్రం రాగానే పోర్ట్ కట్టేద్దాం” అన్న హామీ ఇచ్చారనే వంకతో గుడారమెత్తేస్తాడు. **ఇది అహింసా మార్గపు గమ్యం.** అవతలి వ్యక్తి, సంస్థ కాస్తో కూస్తో కరుణ, జాలి మానవత్వపు విలువలనెరిగి ఉంటే, అప్పుడే అహింసా మార్గము ఫలితమివ్వచ్చు. లేనప్పుడు (పొట్టి శ్రీరాములకులా), అది హింస, సంబంధితులకు అపార నష్టం కలిగిస్తుంది. నిజంగా అహింసా మార్గమెప్పుడూ సమస్యకు సమాధానమివ్వలేదు. (చరిత్ర పుస్తకాల్లో తప్ప), అది సమస్యను వాయిదా వేస్తుంది అంతే. కాలం గడిచేకొద్దీ సమస్య జటిలతరమయ్యి ఉద్వేగానికి, ఉపద్రవానికి రాచబాట వేస్తుంది. హింసను, అహింసను సరిగా అర్థం చేసికొనకుండా, కార్యాశూన్యతే అహింస, కార్యశీలత హింస అనుకొంటే మనగతి అంతే. అహింస “పోరాటం” ఫలవంతమవ్వాలంటే, మన ప్రత్యర్థికి కొన్ని సద్గుణాలుండాలి. ఈ అహింసాపరుడు, ఎపుడైనా హింసకు వెనుకాడడనే భయమతనికుండాలి. అమెరికా మహిళోద్యమ రచయిత D.A. Clarke, "A Woman With A Sword", అన్న వ్యాసములో ఇలా అంటుంది. For nonviolence to be effective, it must be practiced by those **who could easily resort to force if they chose.** Nonviolent tactics will be of little or no use to groups that are traditionally considered incapable of violence, since nonviolence will be in keeping with people's expectations for them and thus go unnoticed. Such is the principle of dunamis (restrained power ).

దాదాపు 45 ఏళ్ళకిందట చందమామలో ఒక కథ చదివాను. గౌతముడనే ముని రోజు అహింస మీద జనాలకు బోధన చేసేవాడు. ఒక నాగుపాము ఆ బోధనలు విని, విని తన విషపూరిత జీవితాన్ని, దానితో తనుచంపిన జీవులను తన హింసను గూర్చి దుఃఖిస్తూ, మునివద్ద తన గోడు వెళ్ళ బోసుకుంది. ముని దానిని ఓదారుస్తూ, జరిగిపోయినదానికి పశ్చాత్తాపంతో, ఇకమీదట కాటు మాను, శుభం భూయాత్ అని చెప్పాడు. పాము కరవదని తెలిశాక చుంచెలుక కూడా దానితోకపట్టి లాగా, పిల్లలు రాళ్ళతోటి కొట్టటం మొదలెట్టారు. దాని బతుకు దుర్భరమయ్యింది. ముని వద్ద మొర పెట్టుకొంది. ముని, శాంతంగా చిరువ్వునవ్వి ‘నిన్ను కరవ వద్దన్నాను కానీ బుస కొట్ట వద్దనీ, కోరలు పీకేసుకోమనీ చెప్పానా’? అన్నాడు. మొఘలుల ఆక్రమణ గురించి చెపుతూ విఖ్యాత చరిత్రకారుడు విల్లియమ్ డ్యురాంట్ "The bitter lesson that may be drawn from this tragedy is that eternal vigilance is the price of civilization. A nation must love peace, but keep its powder dry." (2) శాంతి అవసరమే కానీ ఆ శాంతికి, మనోబలమే కాక, మన బలిమి కూడా అవసరం.

# ఆత్రేయ - ఎన్జీఓ నాటకం

*- పి. విజయకుమార్*



*తెలుగు సాహిత్యంపై చెరగని ముద్రవేసిన కీర్తికిరీటం ఆత్రేయ. 'మనసు', మన 'సుకవి'గా శాశ్వతంగా ఆంధ్రుల మనస్సుల్లో గూడుకట్టుకున్న మహనీయుడు ఆత్రేయ. ఆత్రేయ అన్నది 'కలం' పేరు. అసలుపేరు కిళాంబి వేంకట నరసింహాచార్యులు. కలం పేరు చిన్నదైనా చాల పెద్ద పేరు గడించిన మణిదీపం ఆత్రేయ.*

*తొలుత గుమస్తాగా, 'జమీన్ రైతు' పత్రికలో సహాయ సంపాదకుడిగా పనిచేసి, వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై, 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని దేశంకోసం కారాగారవాసం కూడ అనుభవించిన దేశభక్తి ప్రపూరితుడు ఆత్రేయ. ఆచార్య ఆత్రేయ నాటక రచయిత, నటుడు, దర్శకుడు, ప్రయోక్త. తెలుగు నాటక రంగ చరిత్ర వికాస దశలో ఒక నూతనాధ్యాయానికి పునాది వేసిన నాటక కళాస్రష్ట ఆత్రేయ.*

*ఆత్రేయ తెలుగు నాటక రంగానికి రచయితగా, దర్శకుడిగా, నటుడిగా ప్రవేశించే నాటికి తెలుగు నాటకరంగం అనేక సమస్యలను ఎదుర్కొంటున్న తరుణమది. ఆ నాటికి మూడురకాల నాటకాలు (పద్యనాటకాలు, గద్యసమస్యా నాటకాలు, పద్యసమస్యానాటకాలు) ప్రాచుర్యంలో ఉన్నాయని డా॥ మొదలి నాగభూషణశర్మ వివరించారు.*

**పద్య నాటకాలు :** అప్పటికే పల్లెపట్టుల వరకు వ్యాపించిన ఈ నాటకాలకు దాతల సహాయం క్రమేపి క్షీణించింది. పద్య నాటకాల ఫణితిలో ఆరితేరిన నటులకు బదులు కాంట్రాక్టర్లు ఎంపిక చేసిన కిరాయి నటులు రంగప్రవేశం చేయడంతో పద్యనాటకాల స్థాయి క్షీణించింది.

**గద్య సమస్యానాటకాలు :** ఆ నాటికే నవలలు, కథల్లో ఆర్థిక సామాజిక సమస్యల చిత్రణ ప్రారంభమై నాటక రచయితల దృష్టిని ఆకర్షించింది. పి.వి. రాజమన్నారు, చలం వంటి రచయితలు గద్య సమస్యానాటకాలు రచించారు. కాని వీరి నాటకాలు ప్రదర్శనల్లో ఎక్కువ ఫలితాన్ని చూపలేకపోయాయి. చలం నాటకాలు అసలు ప్రదర్శనకే నోచుకోలేదు.

**పద్య సమస్యానాటకాలు :** గద్యం కంటే పద్యమే ప్రదర్శనల్లో ప్రాచుర్యం కలిగి ఉందని గుర్తించిన కొందరు నాటక రచయితలు సామాజిక సమస్యలను పద్య నాటకాలుగా రచించారు. వీరు దువ్వూరి రామిరెడ్డి, పింగళి నాగేంద్రరావు, కాళ్లకూరి నారాయణరావు. ఈ సమన్వయ ఉద్యమం కూడ ఊహించిన స్థాయిలో ఆశించిన సత్ఫలితాలను సాధించలేదు.

## ఆత్రేయ ప్రవేశం

ఆత్రేయ నాటక రచయితగా పుట్టింది 1943 ప్రాంతంలో. తెలుగు నాటకరంగంలో అప్పుడప్పుడే సామాజిక చైతన్యంతో కూడిన సాంఘిక సమస్యాత్మక నాటకాలు విరివిగా వెలువడుతున్నాయి. సాంఘిక ప్రయోజనం కలిగిన

డా. పి. విజయకుమార్, ఫోన్ : 9849302546

నాటకాలను, ప్రజానాట్యమండలి, ఆంధ్రనాటకకళాపరిషత్ వారు విస్తృతంగా ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించారు. ఈ ఉద్యమంలో భాగంగా తనవంతు కృషిగా ఆచార్య ఆత్రేయ అనేక సాంఘిక నాటకాలు రచించారు.

ఆత్రేయ 10 దాకా నాటకాలు, 15 దాకా నాటికలూ రచించారు. వివిధ సామాజిక వర్గాలను పాత్ర చిత్రణ ద్వారా ప్రతిష్ఠాత్మకంగా వ్యక్తం చేయడంలో నేర్పరి ఆత్రేయ. సామాజిక సంఘర్షణ, సామాజిక వాస్తవికతను తన రచనలలో చిత్రించారు.

ఆచార్య ఆత్రేయను 'ట్రెండ్ సెట్టర్'గా నిలిపిన సంచలన నాటకం 'ఎన్జీఓ'. ఎన్జీఓ రచనా కాలం 1948. రచయిత అనుమతితో ఈ నాటకం హిందీలోనికి అనువదింపబడింది. అనుమతి లేకుండా 'కన్నడం'లో 'లంచావతార'గా అవతరించింది.

1953లో ఇది 'గుమస్తా' పేరుతో సినిమాగా వచ్చింది. 'ఎన్జీఓ' నాటకానికి తొలుత ఆత్రేయ 'అద్దెకొంప', 'గుమస్తా' అని పేరుపెట్టడం జరిగింది. 'ఎన్జీఓ' గురించి స్వయంగా ఆత్రేయ పలికిన మాటలివి. "ఇది నా తృతీయ కావ్యపుష్పం. ఈ నాటకానికి తొలుత 'అద్దెకొంప' అని పేరు పెట్టాను. ఆ తరువాత నాటకంలో జరిగిన కొన్ని మార్పుల ననుసరించి 'ఎన్జీఓ' అన్నాను. ఈ రెండు పేర్లు నాటకంలోని ముఖ్యోద్దేశ్యాన్ని ప్రస్ఫుటం చేయడానికి చాలవని అభిప్రాయపడుతున్నా. గత్యంతరం లేకపోయింది.

'ఎన్జీఓ' అని పేరేగాని, మన మధ్యతరగతి కుటుంబాల-అందులో పట్నవాసుల అగచాట్లు, మనస్తత్వం, ప్రెస్టేజి పేరిట పడుతున్న ఆర్థిక సాంఘిక బాధలు చిత్రించడానికి ప్రయత్నించాను. ఏమాత్రం సఫలుణ్ణి కాగలిగానో ప్రజా బాహుళ్యమే నిర్ణయించాలి."

ఆత్రేయ నాటకాలు 'మధ్యతరగతి పీడిత ప్రజ'గా గుర్తించి వారు చేసే ఆక్రందనలు కూర్చిన అక్షరతూణీరాలు. తిండికి లేని సామాన్యుడు ఆడంబరాలకుపోయే గొప్పవాడిని చూసి చేసే అవహేళన, గొప్పవాడు స్వార్థంకోసం సామాన్యుడిని ఉపయోగించుకోవడం, రాజకీయాల కుళ్లు, అందులో సామాన్యుణ్ణి పావుగా వాడుకోవడం, ఇటువంటి సామాజికమైన అన్యాయాలకు సంఘాన్ని, ఈ అన్యాయాలకు కారణమైన వారిని నిలదీసి అడగడం ఆత్రేయ చూపినంత బలంగా అంతకు ముందుగాని, ఆ తరువాతగాని ఏ నాటక రచయిత చూపలేదు" అని మొదలి నాగభూషణశర్మ అభిప్రాయపడ్డారు...

'ఎన్జీఓ' నాటకంలో అద్దెయింటి అగచాట్లు, వరకట్నం లాంటి సామాజిక రుగ్మతలు, మధ్యతరగతి మనస్తత్వాలు, భేషజాలు, సర్దుబాట్లు, ఉన్నవాడు-లేనివాడు వంటి వ్యత్యాసాలు, అవినీతిలాంటి సామాజిక సమస్యలతో సన్నిహిత సంబంధాన్ని వ్యక్తంచేస్తూ ఆ యా పాత్రలద్వారా సామాజిక చైతన్యాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారు. ఆనాడు, అంటే 1948 స్వాతంత్ర్యం వచ్చిన రోజులలో మన ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు సమాజంలో మధ్యతరగతి ప్రజల జీవన విధానం, అవినీతి, మొదలగు అంశాలను ఈ నాటకం హాస్యం, వ్యంగ్యంతో దర్శనమిస్తుంది.

పట్టణాలలో జీవనయాత్ర కొనసాగించే మధ్యతరగతి ప్రజల ఇరుకు జీవితమే 'ఎన్జీఓ' నాటకంలో ప్రధాన కథావస్తువు. మధ్యతరగతి జీవన విధానంలో ధర్మాధర్మాల మధ్య జరిగే సంఘర్షణ, మారుతున్న విలువలు, వర్గ సంఘర్షణ, ధనికుల దోపిడీ విధానం ఇవన్నీ మధ్యతరగతి జీవితంపై చూపే ప్రభావం, ప్రధానంగా ఈ నాటకంలో స్పష్టం చేయబడ్డాయి. ఆనాటి సమాజంలో మధ్యతరగతి జీవనంలోని కృత్రిమత్వం, నిస్సహాయత, విషాదం, చేదునిజాలను విశ్లేషించి కన్నులకు కట్టినట్లు సామాజిక చైతన్యం నేపథ్యంగా చిత్రించిన మొదటి నాటకం 'ఎన్జీఓ'.

'ఎన్జీఓ' నాటకం 'రంగనాథం' అనే గుమస్తా కుటుంబం చుట్టూ అల్లబడిన కథ. అద్దె ఇల్లుగా చలామణి అయ్యే కారు షెడ్డులో 'రంగనాథం' సకుటుంబ సమేతంగా కాపురం కొనసాగిస్తుంటాడు. 'రంగనాథం' పేదరికం తాండవిస్తున్న వాతావరణంలో జీవితాన్ని నెట్టుకొస్తూ కనీసం పసిపిల్లలకు, తండ్రికి మందులు కూడ కొనలేని దుర్భర దారిద్ర్య ఆవేదన అనుభవిస్తుంటాడు. 'రంగనాథం' జీతం ఎనభై రూపాయిలు. మురుగు కాలువ వాసనతో మగ్గిపోతున్న ఇంటికి అద్దె నిమిత్తం '30 రూపాయిలు' వెచ్చిస్తుంటాడు. పెళ్లీడుకెదిగిన చెల్లెలిని మేనమామ ఇంట వదలి, సంసారం కొనసాగిస్తుంటాడు. ఆర్థిక పతనాన్ని భరిస్తూ, నైతిక పతనం పొందనందుకు 'రంగనాథం' ఆత్మగౌరవంతో జీవనం కొనసాగిస్తూ ఉంటే ఒకవైపు భార్య బిడ్డల అనారోగ్యం, మరొకవైపు చెల్లెలి వివాహం, మానసికంగా క్రుంగదీస్తుంటాయి. ధనమే సమస్యకు 'పరిష్కారం' అని దిక్కులేని స్థితిలో 'లంచం' తీసుకొని అవినీతికి పాల్పడతాడు.

అదే సమయంలో 'రంగనాథం' తమ్ముడు గోపిపై ఇంటి యజమాని దౌర్జన్యం కేసు బనాయించడం జరుగుతుంది. లంచగొండిగా రంగనాథం, విప్లవకారుడిగా గోపిలపై ముద్రపడి ఇద్దరు అన్నదమ్ములు అరెస్టు కావడంతో ఈ నాటకం ముగుస్తుంది. ఈ నాటకంలో ప్రధానంగా మధ్య తరగతి జీవన విధానంలో ఉండే భేషజాలు, మధ్యతరగతి వారు ధనికవర్గ దోపిడీకి గురయ్యే విధానం, వరకట్నం, ప్రభుత్వాల అలసత్వం, అజ్ఞానం వంటి అంశాల చిత్రీకరణ కనిపిస్తుంది. నాటకంతెర ఎత్తగానే 'అద్దెకొంప'ను చిత్రీకరించారు. వంటింట్లో గోడ మీద దర్శనమిచ్చే బిచ్చగాడి బొమ్మ మధ్యతరగతి జీవితంలో పేదవాడి దీనావస్థను చెప్పకనే చెబుతుంది. ఇల్లంతా అల్లుకు పోయిన పొగ, చిన్న గుమస్తా జీవితం ఎలా పొగబారి పోయిందో ధ్వనిస్తోంది. రేడియోలో నుంచి వస్తున్న 'వందేమాతరం జాతీయగీతం' 'ఎన్జీఓ'ల బాగోగుల్ని ప్రభుత్వం ఏవిధంగా పట్టించుకోవడం లేదన్న విషయాన్ని వ్యంగ్యంగా ప్రకటిస్తోంది.

ఒక కారుషెడ్డు, వసారాలను కలిపి అద్దెకొంపగా రంగనాథం కుటుంబం జీవనం కొనసాగిస్తుంటారు. దీనికి తోడు ఇంటిప్రక్కనే మురుగుకాలువ. దీనితో కుటుంబానికి అనారోగ్యం. కాలువను మూయిస్తానన్న మాటను ఇంటి యజమాని ఏనాడూ నిలబెట్టుకోలేదు. ఈ మాట ప్రతిసారీ రంగనాథం తమ్ముడు గోపి యజమానికి గుర్తుచేస్తుంటే ఆ వసారాను కూడ తీసేసుకొని మరొకరికి అద్దెకివ్వడానికి సిద్ధపడతాడు యజమాని. వేరే ఇంటికోసం గోపి ప్రయత్నించినా యజమానుల షరతులకు అసహనాన్ని ప్రదర్శించి ఏమీచేయలేక అదే యింటిలో అద్దెకు కొనసాగుతుంటారు. ''పట్నంలో మనలాంటి వాళ్లు కాపురముండే ప్రతి అద్దెకొంపా ఒక దయ్యంకొంపే" అని గోపి అనటంలో యజమానులు అద్దెకుండే వారి పట్ల ప్రవర్తించే తీరు, కనీసావసరాలకు ఏ రకంగా 'ఎక్స్‌ప్లాయిట్' చేస్తాడో 'ఎన్జీఓ' నాటకం చిత్రించింది. గోపి అసహనంతో ఎదురు తిరిగితే గోపిని కర్రతో కొట్టడమే కాక, జైలుకు పంపిన యజమాని భాగోతం చూస్తే సమాజంలో ఇటువంటి చిత్రాలు ఎన్నో గమ్యమానమవుతాయి.

సమాజంలో ప్రతిదశలో ధనిక, పేద వర్గాల మధ్య సంఘర్షణ కనిపిస్తుంది. ధనికవర్గం పేదవారి శ్రమశక్తిని దోచు కోవడం అనాదికాలం నుండీ కనిపిస్తూనే ఉంది. ఈ 'ఎన్జీఓ' నాటకంలో కూడ నలుగురు ధనికవర్గ ప్రతినిధులున్నారు. వారు రంగనాథం ఉంటున్న అద్దెయింటి యజమాని గుప్తా, గోపి మిత్రుడు శేఖర్, లంచంతో సకల కార్యాలు చక్కబెట్టుకొనే దయాళ్ సేట్, వరకట్నంకోసం పీక్కుతినే రామశాస్త్రి. "భూమి సూర్యుడి చుట్టూ తిరగడంలేదు పైసా చుట్టూ తిరుగుతోంది కనుక ఆ పైసా మన చేతుల్లో ఉంటే ఈ భూమి, అంటే ఈ ప్రపంచంలో ఉన్న మనుష్యులు, మృగాలు, వస్తువులు అన్నీ మనచుట్టూ తిరుగుతాయి'' అని గోపీ పేర్కొనడంలో సమాజంలో పైసా విలువ ఏపాటిదో ధనికవాదుల ఆగడాలు ప్రతి అక్షరం వెనుక ఆవేదన వ్యక్తమవుతుంది. అన్యాయంగా కారుషెడ్డుకు 30 రూపాయిలు వసూలుచేసి గోపిని పోలీసులకు అప్పగించడం గుప్తా ధనిక వర్గం అమానుష స్వభావానికి నిదర్శనం.

దయాళ్ సేట్ రంగనాథానికి డబ్బాశ చూపించి చివరికి అతణ్ణి పోలీసులకు పట్టించడం కూడ దోపిడీలో భాగమే. పేదవాడిని ధనాశకి పురికొల్పి నైతికపతనానికి దారితీసే పరిస్థితులు కల్పించేది ధనికులే. వారిచే తప్పులు చేయాలన్న ఆలోచన కల్పించి, శిక్షకు గురిచేసేదీ ధనికులే. పేదవాడి కష్టాన్ని, అవసరాన్ని ధనికుడు ఏ విధంగా దోచుకుంటాడో 'ఎన్జీఓ' నాటకం చక్కగా చిత్రించి సామాజిక చైతన్యంలో భాగంగా అమాయకులు ఇటువంటి స్థితికి గురికాకూడదని ఆత్రేయ భావన.

సామాజిక స్పృహలో భాగంగా 'వరకట్న' సమస్య ఈ నాటకంలో ప్రధాన భూమిక వహించింది. రంగనాథం అవినీతికి పాల్పడటానికి ప్రధాన కారణం 'చెల్లెలి పెళ్లికి పదివేల రూపాయిలు లాంఛనంగా ఇవ్వడానికే. ఎక్కడ "తనను స్వంత చెల్లెలికి కూడ పెళ్లి చేయలేని అశక్తుడిగా సమాజం ముద్ర వేస్తుందో" అనే భయం రంగనాథం పాత్ర పతనానికి కారణమయింది. తాను నైతికంగా ఎంత దిగజారినా తన భార్యాబిడ్డలనైనా సుఖపెట్టాలని కోరుకుంటాడు. 'అవసరం' మనిషిని మారుస్తుందనటంలో రంగనాథం లాంటి పాత్రలు సమాజంలో ఎన్నో కన్పిస్తాయి. ఏన్నో అప్పులుచేసి కూడ దొరల్లా చెలామణి అవుతున్న వారు ఎందరో సమాజంలో దర్శనమిస్తారు. అత్యవసరం అనివార్యం అయిన పరిస్థితిలో మొదటి తప్పుకే జైలుపాలయ్యే వాళ్లలో రంగనాథం పాత్ర లాంటి వాళ్లూ కనిపిస్తారు.

*(మిగతాది 31వ పుటలో ...)*



లోహియా, ద్వారా ఆయనకు బద్రీ విశాల్‌పిత్తీతో పరిచయమైంది. భారతీయ ప్రసిద్ధ గ్రంథాలయిన రామాయణ మహాభారతాలకు ఆధునిక ధోరణిలో చిత్రాలు వేయమన్న లోహియా సలహా ననుసరించి ఆయన కాశీ వెళ్ళి అక్కడి పండితుల సాయంతో వాటిని చదివింపజేసుకొని ఒక అవగాహనకు వచ్చారు. ఈ ధోరణిలో వేసిన చిత్రాలను మొట్టమొదట కొనుగోలు చేసింది బద్రి విశాల్‌పిత్తీయే.

మహారాష్ట్రలోని పండరిపురంలో 1915లో జన్మించిన హుస్సేన్, తల్లి మరణానంతరం ఇండోర్ చేరుకుని ప్రాథమిక విద్యను పూర్తి చేశాడు. 1935వ సంవత్సరములో జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో విద్యార్థిగా ప్రవేశించి ఆర్థిక ఇబ్బందులతో చదువు మధ్యలో ఆపుకుంటూ, దుర్భర దారిద్ర్యంతో కొట్టుమిట్టాడుతూ, చదరపు అడుగుకు పావలా చొప్పున సినిమా బ్యానర్లు వేసుకుంటూ బ్రతుకు వెళ్లదీశాడు.

1946వ సంవత్సరంలో అతని జీవితంలో ఒక గొప్ప మలుపు తిప్పింది. హుస్సేన్ చిత్రాలను చూచిన 'బాంబే ప్రోగ్రెసివ్ ఆర్ట్ గ్రూప్'కి చెందిన 'సౌజా' అనే ప్రఖ్యాత చిత్రకారుడు ఆధునిక ధోరణిలో చిత్రాలు వేసే తమ లాంటి

# ఇంటికి తిరిగిరాని బహుదూరపు బాటసారి

**- కాండ్రేగుల నాగేశ్వర రావు**

చిత్రకళ పట్ల మీకు అభిరుచి ఉన్నా లేకపోయినా 'హుస్సేన్' అన్న పేరును మాత్రం తప్పక వినుంటారు. ఆధునిక భారతీయ చిత్రకళను ప్రపంచపుటంచులకు తీసుకువెళ్లిన వ్యక్తిగా అందరికీ చిరపరిచితుడతను.

అతను హైద్రాబాదు నివాసిగా చాలా మంది పొరపడుతుంటారు. హైదరాబాదులోని నిజాం కాలం నాటి తొలి కమ్యూనిస్టు పార్టీ కామ్రేడ్స్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యుడైన "ఆలంకుంద్ మీర్" సోదరిని హుస్సేన్ వివాహమాడాడు. ఇది అతని అత్తవారి యిల్లే కాదు ఎందరో అభిమానుల నిలయం కూడా. కొన్ని కోట్లు ఖరీదు చేసే అతని వేలాది చిత్రాల సేకర్తలు కూడా ఇక్కడే ఉన్నారు. ఇక్కడి పాతనగరం, ఒకప్పటి ఆచారవ్యవహారాలు, ఆహారం, ఆహార్యం అన్నీ ఆయనకిష్టమైనవే. మరీ ముఖ్యంగా ఇరానీ ఛాయ్. ప్రముఖ సోషలిస్టు నాయకుడైన రామ్‌మనోహర్

భావైక్యత కలిగిన ప్రోగ్రెసివ్ గ్రూప్‌లోనికి ఆయనను ఆహ్వానించి సభ్యునిగా గౌరవించాడు. ఆ మరుసటి సవత్సరమే హుస్సేన్ వేసిన "సున్‌హరో సంసార్" అనే చిత్రానికి బాంబే ఆర్ట్ సొసైటీ బహుమతి లభించింది. అప్పటి నుంచి ఆయన అంచెలంచెలుగా ఎదుగుతూ 1952వ సంవత్సరంలో తన మొట్టమొదటి చిత్రకళా ప్రదర్శనను మొదట బొంబాయిలో, తరువాత జర్మనీ దేశపు జ్యూరిక్ నగరంలో జరుపుకున్నారు. 1954వ సంవత్సరంలో లలితకళా ఎకాడమీ ఆయనను ఒక ప్రత్యేక చిత్రకారునిగా గుర్తించి గౌరవించింది. 1971వ సం॥లో బ్రెజిల్‌లోని సావోలాలో పికాసోతో కలిసి ప్రత్యేక అతిథిగా ఆయన చిత్రకళా ప్రదర్శన జరిగింది. అప్పటినుంచి ఇక అతను వెనక్కు తిరిగి చూసింది లేదు.

హుస్సేన్ చిత్రాలలో రేఖా విన్యాసం ఒక ప్రత్యేక వేగాన్ని సంతరించుకుంటుంది. ఈ విషయంలో అతన్నెవ్వరూ

మించలేరు. అతని రేఖలలో గమన వేగంతో పాటు సొగసు, సాంద్రత కలిసి ఉంటాయి. జమిలీగా కలిసిపోయిన నైపుణ్యం, నాణ్యత, అతని సొంతం. ఒక్కనిమిషం అక్షరాల 60 సెకన్ల కాలంలో అతను ఒక కోటి రూపాయలు ఖరీదు గల చిత్రాన్ని వేయగలడు. చిత్రాలు వేయటం అతనికి ఇరానీ హోటల్లో ఛాయ్ తాగినంతసులువు. ఎందరో అభ్యుదయ భారతీయ చిత్రకారులకు హుస్సేన్ ఒక రోల్ మోడల్.

చిత్రాలను వేయటంలో అతను మొదట ఒక విషయాన్ని ఎన్నుకుంటాడు. అది 'అశ్వం' కావచ్చు, 'క్రికెట్' కావచ్చు, 'మదర్‌థెరిస్సా' కావొచ్చు లేదా ఒక 'సాంఘిక సమస్య' కావచ్చు. వాటిపై అవలీలగా భిన్న రూపాలలో ఒక దానితో ఒకటి పోలని చిత్రాలను కొన్ని వంద చిత్రాలను కెన్వాస్‌పైకి ఎక్కించగలడు.

హుస్సేన్ చిత్రాలగురించి చర్చించేటప్పుడు అతనికి అత్యంత పేరు తెచ్చిన "అశ్వశక్తి" గురించి తప్పక ముచ్చటించుకోవాలి. 1958లో హుస్సేన్ మొదటిసారిగా చైనా వెళ్ళినప్పుడు అక్కడ 90 సంవత్సరాల వయస్సువున్న బిపి హాంగ్ అనే చైనీస్ చిత్రకారుడు వేసిన వెయ్యి గుర్రాల చిత్రాలను చూశాడు. దీని ప్రేరణతో "సప్తాశ్వరథమా రూఢం" అంటూ సూర్యుని ఏడు గుర్రాలను తన చిత్రాలలో పరుగులు తీయించాడు.

భారతదేశ ప్రభుత్వం 1954లో పద్మశ్రీతోను, 1973లో పద్మభూషణ్, 1991లో పద్మవిభూషణ్‌తో గౌరవించటమేగాక 1986లో రాజ్యసభ సభ్యునిగా నియమించింది. పార్లమెంటులో నున్న ఐదు సంవత్సరాల కాలంలో ఒక్కసారి కూడా పెదవి విప్పక పోయినా తన రాజకీయ పరిశీలనను "సన్‌సద్ పరిషత్" అన్న చిత్రాలద్వారా బహిర్గత పరిచాడు.

1950 నాటి అతని సహాధ్యాయులయిన రజా, సౌజాలు ఒకరు లండన్‌కి, మరొకరు పారిస్‌కు తరలిపోయారు. ఇండియాను వదలడానికి హుస్సేన్ ఇష్ట పడలేదు. దీనివల్లనే అంతర్జాతీయ గుర్తింపు ఆలస్యంగా లభించిందంటూ అభిమానులు వాపోతుంటారు. అయినా రజా, సౌజాలకంటే ప్రజాభిమానంలో అతడే ముందున్నాడు.

" వందకోట్ల భారతీయులకు నాచిత్రాలు అర్థంకావాలి. అందుకోసమే నేను మార్మికతను ఎన్నుకోలేదు.... పాశ్చాత్యనిర్మాణ కౌశలం భారత దేశపు ఆధ్యాత్మికత రెంటినీ సమన్వయ పరుస్తూ మానవత్వానికి ప్రతీకలుగా నా చిత్రాలు నిలబడాలన్నది నా కోరిక." డబ్బు పేరు ప్రతిష్టలు అతనిలో ఏమార్పుతేలేక పోయాయి. ఐదు నక్షత్రాల హొటలయినా రోడ్డు ప్రక్క డాబా అయినా అతనికొక్కటే.

1967లో అతను నిర్మించి దర్శకత్వం వహించిన "త్రూ ది ఐస్ ఆఫ్ ఏ పెయింటర్" అన్న డాక్యుమెంటరీ చిత్రం బెర్లిన్‌లో బంగారు ఎలుగును గెలుచుకుంది. అతను తీసిన



**రెండు, మూడు అట్టమీది బొమ్మలు :**

జపనీయులు తమదైనరీతిలో చేసే పుష్పా లంకరణను 'ఇకెబనా' గా పిలుస్తారు. ఎమ్.ఎఫ్. హుస్సేన్ వేసిన మహాభారత, గాంధీ, నెహ్రూ బెనారస్ లాంటి చిత్రాలను చూసి స్పందించిన శ్రీమతి రేఖారెడ్డి, తనదైన రీతిలో ఇకెబనా ద్వారా హుస్సేన్‌కు నివాళులర్పించారు.

*'Petals and Palette'* పేరుతో సాగిన ఈ పుష్పాలంకరణకు హుస్సేన్ ప్రతిస్పందించారు.

**"కొన్ని పుష్పాల చేరిక పుష్పగుచ్ఛమయితే**
**మాలకట్టి దండవేస్తే కంఠాభరణమవుతుంది.**
**పుష్పాలతో, ఆకులతో ఇకెబనా పేరుతో**
**నువ్వో పూదోటను నిర్మించావు.**
**నా చిత్రాలలోని భావాలను, నీ పుష్పాలంకరణ**
**మూర్తిమంతం చేస్తుంది"**

Husain

డాక్యుమెంటరీలు కళాత్మకంగా ఉంటాయి. ఫీచర్ ఫిల్స్, అయిన "గజగామిని" "మీనాక్షి" చిత్రాలు మితిమీరిన భావవాదంతో ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడతాయి. సన్నివేశాలలో స్థల కాల వస్తువులకు సంబంధము లేకుండా ఎక్కడెక్కడికో వెర్రి పరుగులు తీస్తాయి. ఇవి పూర్తిగా వ్యక్తిగత చిత్రాలు. కొన్ని సన్నివేశాలు మనసును ఆకట్టుకున్నా మొత్తం చిత్రాలు కళాఖండాలని చెప్పలేం. హుస్సేన్ "శ్వేతాంబరీ", "విసర్జన్" పేరుతో జరిపిన ప్రదర్శనలు మితిమీరిన అతని అహంభావ ధోరణికి అద్దం పడుతుందని, అతని సహాధ్యాయ కళాకారులే విమర్శించారు. వ్యక్తిలో ఎన్ని గొప్ప కళా లక్షణాలున్నా అప్పుడప్పుడూ వెర్రితలలు వేయటంలాంటి ప్రవృత్తికి హుస్సేన్ మినహాయింపు కాదు.



తూర్పు, పడమర కలయికతో హోల్కర్ మహారాజు

21వ శతాబ్దం మొదటి సంవత్సరంలో హుస్సేన్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలంటూ ఒక టి.వి. ఛానల్ ప్రజాభి ప్రాయాన్ని సేకరిస్తుండగా అలజడి బయలుదేరింది. 1970వ సంవత్సరంలో వేసిన 'సరస్వతి,' 'లక్ష్మి,' 'పార్వతి,' 'భారతమాత'లాంటి చిత్రాలు అసభ్యంగా ఉన్నాయంటూ, హిందూదేవతలను కావాలనే నగ్నంగా చిత్రిస్తూ, కించపరుస్తున్నాడని 1995 నుంచి అతనిపై ఆరోపణల వెల్లువ వెల్లివిరిసింది. ఈ విషయమై హుస్సేన్ క్షమాపణ చెబుతూ వాటిని ప్రదర్శనశాల నుంచి తొలగించినా వివాదం సద్దుమణగలేదు. ఇందులోని కొన్ని చిత్రాలు ప్రపంచ వ్యాప్తంగా 25 సంవత్సరాలక్రితమే ప్రదర్శితమయ్యాయి. 1995 నుంచీ వ్యక్తిగా కళాకారునిగా హుస్సేన్ వివాదాస్పదుడయ్యాడు. ఎనిమిది కోర్టు కేసులు, ఒకవెయ్యి పోలీసు కేసులు అతనికి వ్యతిరేకంగా నమోదయ్యాయి. ఇందులో మూడు కేసులు ఢిల్లీ హైకోర్టు మే 5, 2008లో కొట్టివేసింది. ఇతని చిత్రాలలో అశ్లీలత లేదంటూ సుప్రీమ్‌కోర్టు మరోక తీర్పునిచ్చింది. ఇన్ని గొడవల మధ్యకూడ కేరళ ప్రభుత్వం 2007వ సంవత్సరంలో అతన్ని 'రాజారవివర్మ' అవార్డుతో సన్మానించింది. ఈ సంక్లిష్ట పరిస్థితిలో 2006 సంవత్సరంలో హుస్సేన్ భారతదేశం విడిచి దుబాయ్ చేరుకున్నాడు. 2010వ సంవత్సరంలో ఖతర్ దేశం, తమదేశ పౌరునిగా సభ్యత్వం ఇచ్చింది. స్వతంత్ర భారతదేశం తిరిగి రావాలన్న ప్రగాఢ ఆకాంక్ష నెరవేరకుండానే జూన్ 9, 2011లో రాయల్ బ్రామ్‌టన్ హాస్పటల్ లండన్‌లో తుది శ్వాస విడిచారు.

చివరగా హుస్సేను మాటలతో ఈ వ్యాసాన్ని ముగించటం సమంజసమని భావిస్తున్నాను. "నా చిత్రాలు ఆధునిక శైలిలో వేయబడ్డ భారతీయ చిత్రాలు. వాటి పేర్లు ఈ దేశపు మట్టిలోనే వున్నాయి. నాచిత్రకళకు మూలం, ఆధారం భారతదేశమే. ఇక్కడి జానపద కళల యొక్క మౌళిక స్వరూపాల లోనికి వెళ్ళి అక్కడ వున్న ప్రతీకలతో తాదాత్మ్యం చెంది నేను పొందిన అనుభూతులను నాశైలిలో చిత్రాలుగా మలుస్తాను. నాది పూర్తిగా సింబాలిక్ ఆర్ట్, పశ్చిమ దేశపు ప్రతీకలను నేనెన్నడూ ఉపయోగించు కోలేదు. నేను వేసిన కొన్ని హిందూ పౌరాణిక పాత్రల చిత్రాలను ఆ మతం యొక్క సున్నితమైన అంశాలను కించ పరిచేవిగా ఉన్నాయన్న ఆరోపణలను ఎదుర్కొన్నాను. 5 వేల సంవత్సరాల సంస్కృతి గల భారతదేశంలో నేనొక భాగాన్ని. ఈ దేశంలో పుట్టడం నా సుకృతం.

చిత్రకళ అనే పవిత్ర కార్యం మనస్సు ప్రక్షాళన కోసమే తప్ప విధ్వంసం కోసం కాదు. నా చిత్రాలను భద్రపరచడమా, ధ్వంసం చేయడమా అనేది భారత దేశ ప్రజల ఇష్టం. విభిన్న వైరుధ్య సంస్కృతులతో భాసించే ఈ దేశంలో ఇటువంటి అభిప్రాయాలు రావటం భయావహం!!

**అట్టమీది బొమ్మ :** హుస్సేన్ అసంఖ్యాకమైన చిత్రాలు వేశారు. గాంధీ, నెహ్రూ, మదర్ థెరిస్సా, చార్లీచాప్లిన్ ప్రముఖు లెందరో ఆయన చిత్రాలకు స్ఫూర్తి. చార్లీచాప్లిన్ (ది కిడ్ – సినిమా) ఈ చిత్రానికి స్ఫూర్తి.

హుస్సేన్ చిత్రాలు సేకరించిన అనేక మందిలో సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్, ఇందిరాగాంధీ ఒకప్పటి భారత ప్రధాని వాజ్‌పేయిలాంటి వారెందరో ఉన్నారు.

**ఆత్రేయ - ఎన్జీఓ నాటకం**

**27వ పుట తరువాయి...**

ఆత్మాభిమానంతో, ఉన్నత విలువలతో, జీవించాలన్న మధ్యతరగతి మానవుణ్ణి 'వరకట్నం' సమస్య ఎటువంటి అనైతికమైన కార్యాలకు, అధోస్థితికి దిగజారుస్తుందో సమర్థవంతంగా మనసున్న మన'సు' కవి ఆత్రేయ ఈ నాటకంలో దృశ్యీకరించారు.

మధ్యతరగతి కుటుంబాలలో ఎక్కువ మందిని పరిశీలిస్తే భేషజాలకు (ఫాల్స్‌ప్రెస్టేజి ) పోతుంటారు. డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ని గుర్తించక పోవడం, చిన్న చిన్న పనులు చేస్తే నామోషీగా భావించడం, తింటానికే గతిలేక పోయినా తాహతుకు మించి ఆలోచనలు చేసి, కట్నాలు ఇచ్చి పెళ్లి చేయడం, ఇంటి యజమానుల దౌర్జన్యాన్ని ఎదిరించలేక, వేరే చోటికి వెళ్లలేక, అద్దె కట్టలేక సహించి ఉండటం, స్త్రీలు బయటకు వెళ్లడాన్ని భరించలేక పోవడం, ఇలాంటి ఎన్నో సమస్యలకు ప్రధాన కారణం, మధ్యతరగతి కుటుంబాలలో నెలకొని ఉన్న కుహనా విలువలే. ఉదాహరణకు 'ఎన్జీఓ' నాటకంలో గోపి పళ్లపొడి అమ్మినందుకు అన్న రంగనాథం తిడుతూ ఇలా అంటాడు. "మనం పస్తులున్నా పడి ఉండాలి గాని ఇలాంటి పనులు మాత్రం చేయకూడదు. ఇదేగా మన ప్రెస్టేజి. పిల్లలు రోగాలతో కుళ్లిపోతూండవచ్చు, అప్పుల వాళ్లు నానా బూతులు తిట్టవచ్చు, నీతిని అమ్మవచ్చు, ఒక్కడు సంపాదించాలి ఇందరం బ్రతకాలి, ఆడది ఇల్లు వదలి పెట్టకూడదు, ఆ డబ్బుగల వాళ్లలో మనుష్యులమనిపించు కోవాలి" అనే రంగనాథం ప్రతి పల్కులో మధ్యతరగతి జీవితంలో పాతుకుపోయిన భేషజాలు బహిర్గతమయ్యాయి. పరువు-ప్రతిష్ఠల పేరుతో మనిషి ఎంతగా పతనమవుతున్నాడో అంతకుముందు కంటే ఘోరమైన సామాజిక నిందలకు గురవడం గొప్ప ఐరనీ.

మధ్యతరగతి జీవితాల్లోని సమస్యలు, దాని పర్యవసానాలు, వాటిమూలాలు ఆవిష్కరించి సాంఘిక దృక్పథంతో వారి సమస్యలు విశ్లేషించారు. వాస్తవ కథనంతో సహజ సన్నివేశాలతో సాధారణ సంభాషణలతో గొప్ప నాటకాన్ని రచించ వచ్చని నిరూపించిన నాటకం 'ఎన్జీఓ'. అందువల్లనే ఈ నాటకం తెలుగు నాటకరంగంలో కొత్త ఒరవడిని సృష్టించింది. మి




మిసిమి మాసపత్రిక

చందాదారులుగా చేర్పించండి

# బహుమతి

పొందండి!

**మీ** ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల - ఇవన్నీ మీకు అపురూపమైనవే కదా. మీకు ప్రియమైన వారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యం కదా. వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెల నెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. మీరు కోరిన గ్రంథాలయానికి, లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం **మిసిమి**కి చందా **₹200** పంపండి (వారి పూర్తి చిరునామాతో). ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపికచేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీరు ఇచ్చిన చిరునామాకు నెల నెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే - మంచి సారస్వతంతో...

ఈ క్రింది పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి

| | | ₹ |
|---|---|---|
| 1. | వేమన - *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 2. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 3. | VEMANA - Through Western Eyes - *V.R. Narla* | 50.00 |
| 4. | THE FIRST POETICAL READER (Walter Joyes and N.C. Sashacharloo) | 50.00 |
| 5. | వేమన ఉపదేశామృతం - *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |
| 6. | జాతక కథలు - *శివశంకర స్వామి* | 60.00 |
| 7. | తెలుగా, ఆంధ్రమా? - వాగరి | 40.00 |
| 8. | అమాహ (కథలు) వి. అశ్వినీకుమార్ | 60.00 |
| 9. | అంతర్వీక్షణం (వ్యాసాలు) " " | 60.00 |
| 10. | నాలో నేను (కవితలు) " " | 60.00 |

**మీ చందా మిసిమి పేర ఈ క్రింది చిరునామాకు పంపండి**

మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



# ఒక శకం ముగిసింది

నాట్యాచార్యులు కన్ను మూశారు. 'కళ కళకోసమే' 'కళకే జీవితం అంకితం' అన్న తపస్వీ యికలేరు.

ఆంధ్రనాట్యాన్ని ఈ తరానికి ప్రసాదించారు నటరాజ రామకృష్ణ. కాని, ఆయన చేసిన ఎన్ని త్యాగాల ఫలమిది! తొలి దశలో వెలిగించిన నాట్య జ్యోతి జీవితాంతం ఆరిపోకుండా కాపాడాడు. ఆయనది పూర్ణ జీవితం. ఆయనే చెప్పుకున్నట్లుగా, తనకు నచ్చినట్టుగా జీవించాడు. నాట్యం ఆయనకు వృత్తికాదు. అది ధ్యానం. కుటుంబాన్ని, బంధుమిత్రుల్ని వదులుకుని అనుక్షణం ఆ ధ్యాన ముద్రలో జీవించాడు. ఆయన వెలిగించిన నాట్యజ్యోతి నాట్య ప్రియుల, నాట్య విద్యార్థుల జీవితాలను కాంతిమంతం చేసింది. నాట్యం ఆయన శ్వాస. "ఎప్పుడూ ఆర్థిక సమస్యనే, అందువలన పెళ్లి వద్దనుకుని బ్రహ్మచారి జీవితం ఎంచుకున్నాను. ఉన్న కాసిని డబ్బులూ, నాట్యం నేర్చుకోవటానికి నావద్దకు చేరిన వాళ్లమీదే ఖర్చుచేశాను." అన్నారొకసారి.

కనీసావసరాలు తీరితే చాలనుకునే మనస్తత్వం. శాస్త్రీయ నృత్యరీతుల్ని కొత్తతరాలకు అందించడమే ఆయన ధ్యేయం. కాలం మారింది. ఒకప్పటి ధార్మిక విలువలు తగ్గి, అన్ని కళల్లోనూ వ్యాపార దృష్టి పెరిగింది. 'కళ' వినియోగ వస్తువుగా మారింది. ఆయన సమకాలీనులు కాలప్రభావానికి తలవంచారు. కాని 'నటరాజ' మాత్రం వ్యాపార ధోరణిని ధిక్కరించాడు. అందరూ బహుమతులు, పురస్కారాలకోసం అఱ్రులు చాస్తారు. కాని, ఈయన మాత్రం పరిశోధనలో తలమున్కలై మనకు అమృతభాండం అందించటానికే కృషి చేశాడు.

కుతుబ్ షాహీల కాలంనాటి గాయని-నర్తకి ద్వయం తారామతి-ప్రేమావతిల కోసం స్మారక చిహ్నం నిర్మించాలని

కలలు గన్నాడు. వీళ్ల గురించి విస్తారంగా రాశాడు. చివరికి ఆయన కల సాకారమైంది. తారామతి బారాదరి కళాక్షేత్రం పునర్నిర్మాణం.

శిష్యప్రశిష్యులే ఆయన కుటుంబం. అందులో ముఖ్యుడు కళాకృష్ణ (ప్రముఖ్య నాట్యకారుడు.) ఆయనమాటల్లో". 38 సంవత్సరాలుగా కరీంనగర్ నుండి హైదరాబాద్ వచ్చి నటరాజ వద్ద శిష్యుడిగా చేరాను. ఒక 'సత్యభామ'గా నా ప్రదర్శన చూసి, నాట్యంమీదే యింకా కేంద్రీకరించమని సలహా యిచ్చారు గురువుగారు. నా జీవితాన్ని ఆయన చేతుల్లో పెట్టాను. తల్లీ, తండ్రీ ఆయనే. మమ్మల్ని బస్సుల్లో ప్రయాణించవద్దనే వారు. కళాకారులకది అవమానకరం. ఆటోరిక్షాలో మాత్రమే వెళ్లమని ఆయన సలహా. పెళ్ళయిందాకా నేనాయన వద్ద గడిపాను. ఆ తర్వాత, ఆయన మాతో ఉన్నారు.

నాట్యం గురించి, బాల్యంలోనే ఆయన కుటుంబ సభ్యులతో విభేదించారు. అది గౌరవ ప్రదమైన వృత్తి కాదని వాళ్ల అభిప్రాయం. ఇది సరిపోదన్నట్టుగా, ఆయన దేవదాసీల యిళ్లకు వెళ్లి మరీ నాట్యంలోని మెళకువలు నేర్చుకున్నారు. దేవదాసీల నాట్యకౌశలం పట్ల ఆయనకు అమిత గౌరవం.

పంచమహాకావ్యాలను ఆపోసనపట్టిన వాళ్ళు. నాట్యం, గానం, కవిత్వం వాళ్ల స్వంతం. వాళ్ల ప్రతిభ సామాజిక నీతి నియమాలకు అతీతమైనది అంటారాయన. బోధనకూ ఆచరణకూ తేడా చూడలే దాయన. సరిదె మాణిక్యమ్మ లాంటి దేవదాసీలను వృద్ధాప్యంలో చేరదీసి, యింటి మనుషులుగా చూశాడు.

ఆయన మహనీయుడు. అలాంటి వ్యక్తులు ఈ రోజుల్లో అరుదుగా కనిపిస్తారు. నాట్య ప్రియులందరికీ ఆయన జీవితం ఆదర్శం.

సుమారు 87 ఏళ్ల క్రితం సంగీత, నాట్యాలకు పుట్టినిల్లు అయిన బాలి (ఇండోనేషియా)లో జన్మించారు నటరాజ రామకృష్ణ. ఆయన తల్లిదండ్రులు అక్కడికి వలస వెళ్లిన తెలుగు వారు. బాల్యంలోనే ఆగమనాట్య సాంప్రదాయాలలో పరిచయం కలిగింది. మూడేళ్లప్పుడే తల్లి మరణించింది. ఎనిమిదేళ్లప్పుడు కుటుంబం భారతదేశానికి తిరిగి వచ్చింది. మద్రాసులోని రామకృష్ణామిషన్‌లో రామకృష్ణ పెరిగారు.

ఆ కాలంలోనే, ప్రముఖ్య భరతనాట్య కళాకారిణి శ్రీమతి బాలసరస్వతి అభినయం చూసి శాస్త్రీయ, సాంప్రదాయ నాట్యంపట్ల అభిరుచి పెంచుకున్నారు. తమ్ముడి ఆసక్తిని గమనించాక, ఆయన సోదరుడు శ్యామసుందర్ కుటుంబం నుండి కొంత వ్యతిరేకత వచ్చినా, ఆ తర్వాత రామకృష్ణను ప్రోత్సహించారు. దేవదాసి కాళహస్తి రాజమ్మ వద్ద అభ్యాసం కొనసాగింది. అన్నగారి అకాలమరణంతో, నాట్యంలో ప్రావీణ్యం సంపాదించాలనే పట్టుదల పెరిగి, తండ్రితో సంబంధం తెంచుకుని నాట్యానికే జీవితం అంకితం చేశారు, రామకృష్ణ. నాగపూర్ సమీపంలో వున్న బండార రాజావారు యిచ్చిన 'నటరాజ'నే బిరుదును తన ఇంటిపేరుగా మార్చుకున్నారు. ప్రముఖ్య నాట్యాచార్యుడు ఉదయుశంకర్ ప్రదర్శన చూసిన రామకృష్ణలో సాంప్రదాయక నాట్య పద్ధతులకు ప్రచారం కల్పించాలనే కోరిక పెరిగింది. దేవదాసీ వ్యవస్థను నిర్మూలించటంవల్ల అనేక నాట్యరీతులు కనుమరుగై పోయాయి. వాటిని పునరుద్ధ రించటానికి కంకణం కట్టు కున్నారు రామకృష్ణ.



కొంతకాలం ప్రముఖ దేవదాసి పెండ్యాల సత్యభామ వంటి వారి వద్ద శిశ్రూష చేసిన రామకృష్ణ అనితర సాధ్యమైన పరిణతిని సాధించారు. అరవయ్యయిదేళ్ల నిర్విరామకృషి ఫలితంగా, ఆంధ్ర 'దేవాలయాల 'లాస్య' సాంప్రదాయాన్నీ, యుద్ధకళ తాండవ సాంప్రదాయాన్నీ, (పదమూడవ శతాబ్దిలో కాకతీయుల పతనం తర్వాత కనుమరుగైన 'పేరిణి' యిదే.) ఆధునిక నాట్యరీతులకు దించారు రామకృష్ణ.



నవజనార్ధనపారిజాతం

## ఆంధ్రనాట్యం

అనేకమంది దేవదాసీలనుండి సేకరించిన సమాచారంతో ఆగమ నర్తనరీతులను పునరుద్ధరించిన నాట్య గురువు రామకృష్ణ. తనజ్ఞానాన్ని వంద లాది శిష్యప్రశిష్యులకు దానంచేసిన వితరణశీలి. 1970లో, రాజమహేంద్ర వరంలో ఒక దేవదాసీల సమ్మేళనం ఏర్పాటుచేసి ఆగమనర్తనాన్ని క్రమబద్ధీకరించటమేగాక అనేక మంది దేవదాసీలను తన శిష్యులకు బోధించటానికి ఉపాధ్యాయినులగా నియమించారు. అభినయ ప్రధానమైన 'నవజనార్ధనపారిజాత'మనే ప్రబంధ నాట్యరీతికి పునః ప్రాశస్త్యం కల్పించారు. (నవరాత్రి సందర్భంగా తొమ్మిది రోజులు వరుసగా దీన్ని ప్రదర్శిస్తారు.) అప్పటి దాకా, పిఠాపురంలో కేవలం ఒక కుటుంబానికే పరిమితమైన ఈ నాట్యం రామకృష్ణగారి కృషివల్లనే మనమీనాడు చూడగలుగుతున్నాం. ఈ వివిధ నాట్యరూపాల సంగమమే ఆంధ్రనాట్యం. ప్రస్తుతం, యిది ఆంధ్రప్రదేశ్ నాట్య పాఠశాలల్లో, తెలుగు విశ్వవిద్యాలయంలో, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో పాఠ్యాంశంగా వుంది.

## పేరిణి

తాండవ సాంప్రదాయంలోసాగే యుద్ధనాట్యకళ 'పేరిణి' సైనికులను వుత్సాహపరిచి, యుద్ధోన్ముఖులను చేయటానికి కాకతీయుల కాలంలో (10 నుండి 13 శతాబ్దల మధ్య) విస్తృతంగా ప్రచారంలో వున్న నాట్యమిది. దేవాలయ కుడ్యాలమీది శిల్పాల చిత్రాలసాయంతో ఈ నాట్యంలోని అడవు, కరణాలను సేకరించి, పరిష్కరించి నృత్త సాంప్రదాయాన్ని ఆవిష్కరించారు. రామకృష్ణ ఈ నాట్య ప్రచారం కోసం 'పేరిణి ఇంటర్నేషనల్' అనే సంస్థను కూడా



పేరిణి

హైదరాబాద్‌లో నెలకొల్పారు. 700 ఏళ్లుగా విస్మృతమైన ఈ నాట్యశైలి తిరిగి ఈనాడు ప్రదర్శిస్తున్నారంటే అది కేవలం నటరాజ రామకృష్ణగారి కృషి ఫలితమే. తెలుగు, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయాల్లో యిది కూడా పాఠ్యాంశంగా వుంది. ఈ నాట్యానికి జన్మస్థలమైన వరంగల్లులో 'సెంటర్‌ఫర్ పేరిణి'ని నెలకొల్పారు, రామకృష్ణగారు.

## తారామతి

నటరాజ రామకృష్ణగారి కృషి ప్రోద్బలం వల్లనే, పదిహేడవ శతాబ్దినాటి అబ్దుల్లా కుతుబ్‌షా పాలకుల రాజ నర్తకి, గాయని తారామతి పేర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యటన కేంద్రం ఏర్పాటు చేసింది. వివిధ నాట్య, సంగీత ప్రదర్శనలకు అనువైన చోటు యిది.



తారామతి, బారదరి

## నాట్యతపస్వి

*సంగీత నాటక అకాడెమీ ఫెల్లోషిప్*
*అకాడెమీ రత్న పురస్కార్ గ్రహీత.*



ఈ యిరవయ్యొకటవ శతాబ్దిలో శాస్త్రీయ నృత్యానికి భీష్మపితామహుడాయన. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాచీన ఆగమనాట్యరీతులను పునరుద్ధరించటానికే అంకితమైన జీవితం ఆయనది. కేవలం నాట్యకళ కోసమే అనుక్షణం తపించిన ఆయనలాంటి వ్యక్తి మరొకరు లేరు. నాట్యం కోసం కుటుంబాన్నీ, బంధుమిత్రుల్నీ వదులుకున్నారు నటరాజ రామకృష్ణ. సంగీతనాట్య అకాడెమీ ఫెల్లోషిప్ (అకాడెమీ రత్న) జీవిత చరమాంకంలోనే ఆయన్ను వరించింది. తనను వెదుక్కుంటూ వచ్చిన యువ నాట్య విద్యార్థులను చూసి, శారీరకంగా బలహీనంగా వున్నా, వుత్సాహంగా అంగీకరించారాయన.

"అకాడెమీ రత్న అనేది ఒక అరుదైన గౌరవం. కనీసం, యిలాగైనా, నాకృషి ముందుతరాల వారికి చేరుతున్నందుకు ఆనందంగా వుంది. అనేకమందిని కలిసి, సేకరించిన జ్ఞానాన్ని పరిష్కరించటంలో, క్రమబద్ధీకరించటంలోనే నా జీవితం గడిచింది."

"దైవాన్ని ఆరాధించినట్టుగా, గజ్జెల్ని ఆరాధించిన కళాకారులు వాళ్లు. వాళ్లు నాట్యకళా కోవిదులు. వంశపారంపర్యంగా వచ్చిన కళను వాళ్లు పవిత్రమైనదిగా భావించి అభ్యసించారు. వాళ్ల తపనను అర్థంచేసుకుని, ఈ కళాసాంప్రదాయం లుప్తం కాగూడదని కృషి కొనసాగించాను," అంటూ తొలి రోజుల్ని గుర్తు చేసుకున్నారు నటరాజ రామకృష్ణ.

ప్రతి ముద్రనూ తను స్వయంగా నర్తించి తెలుసుకుని, నృత్త, నృత్య, అభినయాలను (నాట్యకళలోని) గణితమంత ఖచ్చితమైన అంగాలుగా నిర్ధారించారాయన.

"నా గురువు కాళహస్తి దేవాలయానికి చెందిన నాయుడు పేట రాజమ్మ. రామకృష్ణ మిషన్‌లో గడిపిన బాల్యం నన్ను ఆధ్యాత్మికతవైపు మళ్ళించింది. వీటి సంగమ ఫలితంగానే అభినయ కళను నేను నాలో జీర్ణించు కున్నాను. స్వంతంగా ప్రయత్నించి చూడనిదేదీ నేను సిద్ధాంతీకరించ లేదు. తెల్లవారుజామునే నా అభ్యాసం ప్రారంభమయ్యేది. అభినయంలో పట్టు సాధించాలంటే పదాలు బాగా నేర్చుకోవాలి. నాగ్‌పూర్‌కు చెందిన చంపాబాయి వద్ద హిందూస్తానీ తుమ్రీలు పాడటం తెలుసుకున్నాను. వైష్ణవ, శైవ దేవాలయాలలోని నాట్య పద్ధతుల్ని అధ్యయనం చేశాను. నాట్యప్రయోజనం ఆధ్యాత్మికమని గ్రహించాను." అంటూ గతాన్ని గుర్తు చేసుకున్నారు రామకృష్ణ.

"ఆంధ్రనాట్యం నిజంగా శాస్త్రీయమైందేనా? అదొక పేరు మాత్రమే. ఆంధ్రదేశంలోని దేవాలయాలలో చేసిన నాట్యం గనక దానిని ఆంధ్రనాట్యమన్నాను. ఈ ఆగమ నాట్యాన్ని 'భారతం' అన్నారు. అంటే భాగవతం నుండి భిన్నమైనది అనే అర్థంలో. (కూచిపూడి వారిది భాగవతం.) ఇది శబ్ద ప్రధానమైనది. తమిళనాడులో దీన్ని 'దాస్యఆట్టం' అంటారు. కాని నేను ఆ అభిప్రాయంతో ఏకీభవించను. ఆంధ్రనాట్యంలో లాస్యం ముఖ్యం. అంటే పురుషనాటక సాంప్రదాయమైన తాండవానికన్నా భిన్నమైనదిది. ఈ నాట్యంలోని సాంకేతిక అంశాలను, శబ్ద, రస (అభినయ) శాస్త్రాన్ని క్రోడీకరించి ఆంధ్రనాట్యంగా తీర్చిదిద్దాను. (ఇది యింకా వ్రాతప్రతి రూపంలో నా శిష్యుడి వద్దవుంది.)" అంటూ వివరించారు నటరాజ రామకృష్ణ.

శరీరం జీర్ణమైనా, నాట్యంపట్ల ఆయన ప్రేమ ఏ మాత్రం తగ్గలేదు. సంగీత నాటక అకాడెమీ పురస్కారం ఒక జీవిత కాలపు గౌరవం. ఇది 35మందికి మాత్రమే ప్రదానం చేయబడుతుంది. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు గత యిరవై సంవత్సరాలలో ఆ అరుదైన గౌరవం ఆయనకే దక్కింది.

– మిసిమి




# యానాం చరిత్ర

– దాట్ల దేవదానం రాజు

మహారాష్ట్రలోని నాసిక్‌లో పురుడుపోసుకున్న గోదావరి నది ఆంధ్రప్రాంతం చేరి అక్కడ మంజీర, మానేరు, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి మొదలైన ఉపనదులను కలుపుకొని అఖండ గోదావరిగా రూపుదిద్దుకుని ధవళేశ్వరం వద్ద గౌతమి, వశిష్ట అనబడే రెండు ముఖ్యపాయలుగా చీలి 1450 కిలోమీటర్ల పయనించి బంగాళాఖాతంలో సంగమిస్తుంది. గౌతమినది ఒడ్డున సముద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో యానాం పట్టణం ఉంది. దీనికి అన్ని పక్కల సరిహద్దులు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవే. ఇక్కడి వారి సంబంధబాంధవ్యాలు చుట్టుపక్కల గ్రామాలతో పెనవేసుకుపోయాయి. ఇది పాండిచ్చేరిలో ఒక భాగమైనా ఇక్కడ అందరూ తెలుగే మాట్లాడతారు. చాలామందికి ఫ్రెంచి వచ్చు.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం, దక్షిణ భారతదేశమంతా కరువు విలయతాండవం చేసింది. ఆ పరిస్థితులు ఈ ప్రాంతాన్ని తాకాయి. అది ఎంత ఘోరంగా ఉండేదంటే, ఎక్కడో ఒకచోట ఎలాగోలా బతుకుతారనే ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని సముద్ర తీరానికి తెచ్చి ఓడల్లో వచ్చిన యూరోపియన్లకు అమ్మడం మొదలెట్టారు. ఓడ వచ్చిందంటే చాలు వేలాది మంది పిల్లల్ని తీసుకురాసాగారు. ఒక పిల్ల లేదా పిల్లవాడికి ఐదు పణాలు ఖరీదు కట్టారు. కొనుక్కున్న పిల్లల్ని వారేంచేస్తారనే అనుమానం రావచ్చు. నరనరాన వ్యాపారపు ముసుగు తొడుకున్న వాళ్ళ కంటికి అన్నీ సరుకులుగానే కనబడతాయి. విలియం మేథవల్డ్ ఇంగ్లాండులోని అధికారులకు రాసిన లేఖలో – 'సముద్ర తీరాన జరిగే పిల్లల సంతని 'సీ సైడ్ సెల్లింగ్' అంటున్నారు. పిల్లల్ని ఇండియాలోనే పరిస్థితులు బాగా వున్న మరోచోటుకు తీసుకెళ్ళి తిరిగి అమ్ముతారు మనవాళ్ళు అని వుంది. ఇది క్రీ.శ. 1614 నాటి పరిస్థితి.

యానాం చరిత్ర క్రీ.శ. 1723లో ఫ్రెంచివారు తమ వర్తక స్థావరంగా ఏర్పాటు చేసుకున్నప్పటి నుండి ప్రాధాన్యత నొందింది. మచిలీపట్నం ఫ్రెంచి ముఖ్య అధికారి, ఫ్రెంచి జాతీయుడు కోర్టన్ 1723లో యానాం వచ్చాడు. రెండు నదులమధ్యగల ఈ ప్రాంతాన్ని అమితంగా ఇష్టపడ్డాడు. అందంగా ప్రకృతి పారవశ్యంగా ఉన్న ఇక్కడ ఒక ఇల్లు కూడా కొన్నాడు. అప్పుడే ఇది స్థావరంగా నెలకొనడానికి పునాదులు ఏర్పడ్డాయి. అయితే వారు ఆశించిన వాణిజ్య ప్రయోజనాలు నెరవేరక నాలుగు సంవత్సరాల పాటు యానాం విడిచిపెట్టి పోయారు. డూప్లెక్స్ హయాంలో 1731 సంవత్సరంలో తిరిగి స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాదు నిజాం ముజఫర్ జంగ్ ఈ ప్రాంతంపై సార్వభౌమాధికారం ఫ్రెంచి వారిదని 1750లో ప్రకటించాడు. అంతకుముందు రెండు వందల సంవత్సరాల నుంచి దుర్భర కరువు పరిస్థితులు రాజ్యమేలాయి.

ఫ్రెంచి స్థావరాల్లో యానాం చిన్నది. గోదావరి సముద్రంలో కలిసే ముఖద్వారం వద్ద ఇసుకమేటలు ఓడల రాకకు అడ్డంకిగా ఉన్నాయి. ఒక ప్రధాన రేవుగా యానాం ఉపయోగపడదనే వాస్తవం ఫ్రెంచివారికి బాగా తెలుసు.

దాట్ల దేవదానం రాజు, ఫోన్ : 9440105987

అడ్మిరల్ డెన్‌లే (1829-35) 1835 మే 8వ తేదీన డైరీలో 'యానాం', కేరళలోని 'మాహేల'వల్ల ఎలాంటి ఉపయోగంలేదు. ఫ్రెంచి పతాకం ఎగరేస్తున్నామన్న ఆనందం తప్ప ప్రయోజనంలేదు' అని రాసుకున్నాడు. మార్సెలిడే సెన్ట్ సైనే (1835-40) 1840 ఏప్రిల్ 20వ తేదీన 'యానాం ఫ్రాన్సు పరిపాలనకు అనుకూలంగాలేదు విడిచిపెట్టడం మంచిది' అన్నాడు.

1857 ఫిబ్రవరిలో అడ్మిరల్ ఏమేలిన్ (నౌకాదళ మంత్రి, స్థావరాల మంత్రి) ఇండియాలోని ఫ్రెంచి స్థావరాల పరిస్థితి గురించి తెలియజేశాడు. యానాం, చంద్రనాగూర్‌లకు భవిష్యత్ లేదన్నాడు. 1894లో ఫ్రెంచి గవర్నర్ డిలోంకల్ యానాం ప్రాంతంవల్ల ఆర్థికంగా నష్టమే కలుగుతుందనీ ఫ్రెంచి జాతీయుడెవరూ అక్కడే ఉండి వ్యాపారం చేయడానికి ఇష్టపడటం లేదని తెలిపాడు. ఇక్కడ నుండి లభించే ఆదాయం కంటే ఖర్చు ఎక్కువని కూడ చెప్పాడు. తర్వాత 1899లో ఫ్రెంచి ఇండియా గవర్నరు ఏ బాన్ హెూరే యానాం ఇంగ్లీషు వాళ్ళకిస్తేనే మంచిదని అభిప్రాయపడ్డాడు. సామాన్య ప్రజలు, స్థానిక నాయకులు బ్రిటిష్‌వారికి అప్పగించడాన్ని నిరసించారు.

'ఫ్రెంచి ఇండియా' ఆర్థికస్థితి 1827 నుండి మరీ దిగజారిపోయింది. ఆదాయం పెరుగుదల లేదు. ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. సంవత్సరానికి 60,000 ఫ్రాంకులు లోటు వచ్చింది. పదేళ్ళయినా మార్పులేదు. గ్రామంలో వైద్య సేవలందిచే డాక్టరు జీతంలోనూ కోత విధించారు. 9000 ఫ్రాంకులనుండి 5000 ఫ్రాంకులకు తగ్గించారు. ఇతర ఉద్యోగుల సంఖ్య కూడ తగ్గించారు. ఒక జడ్జి ఉంటాడు. ఆయన చెప్పింది సిరాస్తదారుడు రాసుకుంటాడు. ఒక పోలీసు అధికారి ఉంటాడు. అతను పబ్లిక్‌ప్రాసిక్యూటర్ చేసే పనిని నిర్వర్తిస్తాడు. ఇక రైతులు కౌలుదారులు-వీరందరకూ ఒక పెద్ద రైతు ఉంటాడు. రైతుల మధ్య తగవుల్నీ, సమస్యల్నీ ఇతనే పరిష్కరిస్తాడు.

రాడికల్ సోషలిస్ట్ పార్టీకి చెందిన హెన్రీ మేయర్ 1911లో 'యానాం' అనేది ఫ్రెంచివారి రక్తం ఖర్చు పెట్టగా సంపాదించినదని తెలిపాడు. 1936లో అయితే మారిషష్‌కు బదులుగా స్థావరాల్ని బదలాయింపు జరగొచ్చనే మాటలు వినబడ్డాయి. కొద్దికాలంలోనే ఈ ఆలోచన కూడ ఆగిపోయింది. 'యానాం చిన్న చిన్న సందులతో కూడుకుని ఉన్న గ్రామం. ఆ సందుల్ని 'రోడ్లు' అని పిలవడం కష్టమే. పైగా ఇవి చాల కాలంగా తుడవబడక చెత్త చెదారంతో నిండి ఉన్నాయి. ఎక్కడపడితే అక్కడ పందులు, కుక్కలు తిరుగుతున్నాయి.' ఈ విషయాలు 1934లో ఎస్తోనే దుపాస్ అనే జర్నలిస్ట్ పాండిచ్చేరినుండి యానాంవచ్చి చూసి చెప్పినవి.



ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా యానాం స్వాతంత్ర్యం వచ్చేవరకూ ఫ్రెంచివారి అధీనంలోనే ఉంది.

యానాం మీద ఫ్రెంచి విప్లవ ప్రభావం చాల వుంది. విప్లవ సమయంలో ఇక్కడ అన్ని రకాల వ్యాపారాలు బాగా సాగేవి. అన్నింటికన్న బట్టల వ్యాపారం, కలప వ్యాపారం ఫ్రెంచి వారికి ఎక్కువ లాభదాయకంగా వుండేది. వీటితో బాటు నూనె, బియ్యం, ఇతర ధాన్యాలు, పశుగ్రాసం వ్యాపారాలు ప్రయోజనకరంగా ఉండేవి. ఉప్పు పండించే ప్రాంతాలకు యానాం ముఖ్య కేంద్రంగా మారింది. దీనికి ముఖ్యమైన కారణం వుంది. ఉప్పు అన్ని శీతోష్ణమండలాలలో పండేది కాదు. ఉష్ణమండల వాతావరణంలో మాత్రమే ఉప్పును సాగుచేయడం కుదురుతుంది. ఇంగ్లాండు, ఫ్రాన్స్ దేశాలలో సంవత్సరంలో ఎక్కువ రోజులు అతిశీతలంగా వుంటాయి. మంచు కురుస్తుంది. వేసవి కాలంలో అయినా వేడి వాతావరణం సరిపోదు. అందుకని ఆ దేశాలలో ఉప్పు పండే అవకాశం లేదు. అదేకాకుండా ఉప్పును దేశంలోనే బెంగాలులాంటి ప్రదేశాలకు భారీగా ఎగుమతి చేసేవారు. ఉప్పుపంటకు అనుకూలంగా ఉండే సముద్ర ప్రాంతాల కోసం యూరోపియన్లు ఎదురు చూసేవారు.

ఫ్రెంచివారు వ్యాపారంలో భాగంగా ఇక్కడ నుండి ఇతర దేశాలకు కూలీలను పంపించేవారు. ఎమిగ్రెంట్స్‌గా యానాం నుండి వెళ్ళిన కూలీలు అక్కడ అనేక ఇబ్బందులు పడ్డారు.

బట్టల నేతగాళ్ళను ఎక్కడ్నుంచో తీసుకొచ్చి నేయించేవారు. వీరిలో ఎక్కువ మంది శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మచిలీపట్నం మొదలైన చోట్ల నుండి వచ్చినవారే. యానాం అతిస్వల్ప జనాభాగల ప్రాంతం. ఇక్కడి వారంతా అనేక చోట్ల నుండి వచ్చి స్థిరపడిన వారే.

1856-61ల మధ్య యానాంలో గానుగ నూనె వ్యాపారం బాగా జరిగింది. ఆర్థికంగా యానాం పుంజుకుంది. నువ్వుల నూనెతో బాటు కొబ్బరి నూనె కూడ ఫ్రాన్సుకు ఫ్రెంచి ఇండియా ఎగుమతి చేసేది. పాండిచ్చేరి, మాహే, కారైకాల్ కంటే యానాం నుండే అధికశాతం నూనె వ్యాపారం జరిగింది. ముడిసరుకును ఒరిస్సా తదితర ప్రాంతాల నుండి తీసుకొచ్చేవారు. ఒరిస్సా తీరం నుండి కోరింగ మీదుగా యానాం చేరేవి. ఇక్కడ నూనె ఆడించి ఎగుమతి చేసేవారు. కొన్ని సమయాలలో కలకత్తా పంపేవారు. 1857 నుండి స్వంతంగా నౌకలు సమకూర్చుకుని ఆ సంవత్సరంలో ఫ్రాన్సు వెళ్ళడానికి 19 నౌకలు మొత్తంగా ఓడల్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 1859 లో 28 నౌకలు 1860 లో 19 నౌకలు మొత్తంగా 66 వరకు సిద్ధమయ్యాయి. చాలా సంవత్సరాలు మధ్యవర్తుల ద్వారానే నూనె వ్యాపారం సాగింది. యానాం ట్రిబ్యునల్‌లో వీటికి సంబంధించిన తగవులు పరిష్కారం అయ్యేవి. 1861 జనవరి 5న మూడవ నెపోలియన్ ఈ వ్యాపారాన్ని రద్దు చేసాడు.

1934-36 సంవత్సరాల మధ్య శారదాచట్టం అమలులోకి రావడంతో ఆంధ్రాలో బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. దాని ప్రకారం మైనారిటీ తీరని పిల్లల వివాహం చేయడానికి పూనుకుంటే శిక్షార్హులవుతారు. అలాంటి పెళ్ళిళ్ళకు నామమాత్రపు రుసుము వసూలు చేసి ఫ్రెంచివారు యానాంలో నిర్వహించుకోడానికి అనుమతినిచ్చారు. ఫలితంగా కొన్ని వందల బాల్య వివాహాలు యానాంలో జరిగాయి. కొన్ని సామాజిక వర్గాలలో రజస్వల కాకుండా ఆడపిల్లలకు కళ్యాణం చేయాలనే ఆచారాలు వుండటం వల్ల వారంతా యానాం చేరుకునేవారు. ఆ కారణంగా యానాం 'కళ్యాణపురం' గా వ్యవహరించబడేది. ఇది తాత్కాలికమే అనుకోవాలి. బయట్నుంచి వచ్చే వారందరూ యానాం పేరు పైకి ఉచ్చరించకుండా కొన్ని సమస్యల్నుండి తప్పించుకోడానికి కళ్యాణపురం అనే గుప్తనామంతో పిలిచేవారు. శారదాచట్టం అమలులో వున్నంతకాలం కొద్దికాలం పాటు మాత్రమే అలా పిలవబడింది. తర్వాత ఆ పేరు మరుగున పడిపోయింది. రికార్డుల్లో ఎక్కడా కళ్యాణపురంగా నమోదు కాలేదు. అలాగే త్యాగరాజపురం అనే పేరు ఉండేదని కొందరు పెద్దలు చెప్పారు ఇపుడు యానాంలో త్యాగరాయవీథి ఉంది. బెజవాడ వీథి ఉంది.

సుమారు 1802 ప్రాంతంలో యానాంలో ఒక సంఘటన జరిగింది. అది కులం కట్టుబాట్లకు సంబంధించినది. యానాం, నీలపల్లి, తాళ్ళరేవు, కోరంగి ఇంకా తీర్థాల మొండి, పండి పోరలాంటి సముద్రతీర గ్రామాల్లో పల్లెజాతి (మరకాళ్ళు అనేవారు) కులవృత్తులతో జీవిస్తూ వుండేవారు. పెళ్ళిలో పల్లకీ ఎక్కే ఆచారం కొన్ని కులాల వారికే పరిమితమని పూర్వం అనుకునేవారు. అప్పట్లో మత్స్యకారుల్లో కొందరు ఐశ్వర్య వంతులుండేవారు. వాళ్ళ యింటిలో ఒక వివాహం జరిగింది. ఆ వివాహంలో పల్లకీలో ఊరేగాలనే పట్టుదల వచ్చింది. కాపువర్గానికి చెందినవారు వ్యతిరేకిస్తారని వారికి తెలుసు. అంచేత ఫ్రెంచి ప్రభుత్వాన్ని

అనుమతి కోరారు. వారు అంగీకారం తెలిపారు. ఎక్కడెక్కడి నుండో వేలాదిగా పల్లీలు వచ్చారు. పూర్వాచారపరాయణులైన మానాటి కాపులకు ఆ ఊరేగింపు అవమానంగా తోచింది. మనం ఆ కాలంలోకి వెళ్ళి ఆలోచించి భావన చేస్తే తప్ప ఆ ఊరేగింపు కాపుదనానికి ఎంతటి ప్రాణసంకటమో అర్థంకాదు. అందులోనూ యానాం కాపుదనం ప్రతిష్ఠ అంతా ఇంతా కాదు. ఆఖరికి గవర్నమెంటు కూడా కాపుదనం చెప్పినట్లు చేయాల్సిందే. ఫ్రెంచి దేశం ప్రజారాజ్యంలోకి వచ్చి చాలా ఏళ్ళయింది. యానాంలో ఈ కులస్థుల్లో ఎక్కువమంది ఉద్యోగులు. పూర్వాచారానికి విలువ ఇచ్చేవారు. అట్లాంటి వారికి ఊరేగింపు చాల తలవంపుల కిందే లెక్క. పట్నమంతా వేల కొలది తరలి వచ్చిన పల్లీలు, పైగా ప్రభుత్వ అనుమతి పొందారు. తలుపులు బిగించుకుని ఇంట్లోనే ఉండి కాపుదనం కాపాడుకున్నారు. ఇట్లాంటి స్థితిలో ఊరేగింపు చక్కగా జరిగింది. అందుకు పెళ్ళివారు సంతోషిస్తే బాగుగా ఉండేది. ఇప్పటి దాకా ఆ జాతిలో ఎవ్వరూ పల్లకీ ఎక్కె భాగ్యం కలుగనందున వారి ఉత్సాహం అక్కడితో ఆగలేదు. యానాం సమీపంలోని కనకాల పేటలో కూడా ఊరేగి కాపుదనానికి మరింత తలవంపు కలిగిద్దామనే కుతూహలం పెరిగింది. విరమించుకున్న ఊరేగింపు మరల ప్రారంభమైంది. ఇంచుమించు కనకాలపేట చేరుకుంది. ఊరేగింపు కేరింతలతో ఆనందంగా సాగుతూంది. ఏదో ఘనత సాధించినట్లుగా వుంది వాళ్ళ వాలకం.

పల్లీల ఊరేగింపు వస్తున్న సంగతి తెలుసుకుని అక్కడి వాళ్ళు ఒక పని చేశారు. నార తీసిన జనపకట్టలను కొన్ని భాగాలుగా చేసి ఆ పోగుల మీద తెల్ల బట్టలు కప్పారు. వాటి మీద సున్నం, పసుపు కలిపిన నీళ్ళు చల్లారు. అప్పుడవి బలవంతంగా కొట్టిన దెబ్బలతో స్పృహకోల్పోయిన వాళ్ళో లేక చచ్చిపడినవాళ్ళో అని భ్రాంతి కలిగించింది. ఊరేగింపులో ఉన్నవాళ్ళు అక్కడ పడిన వాళ్ళు మన వాళ్ళేనని భయపడి దక్షిణ దిక్కుగా వున్న గౌతమి నదిలోకి ఈతకు దూకేసారు. అట్లాంటి భ్రాంతికి అది సంధ్యాసమయం కావడం ఒక కారణం. అంతేకాదు కొంచెం ముందుగానే ఒకరిద్దరు

> **1498లో పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా దక్షిణ భారతంలోని కాలికట్ చేరుకున్నాడు. బ్రిటిష్‌వారు ఈస్టిండియా కంపెనీను 1600 లో స్థాపించారు. డచ్చివారు 1602 లోనూ, ఫ్రెంచి వారు 1664 లోనూ మనదేశంలో కాలుమోపారు. యానాంను మోటుపల్లిగా పిలిచారనే బుర్రకథ ఒకటుంది. విజయనగర రాజులు బుస్సీకి దీనిని ఇనాంగా ఇవ్వటం వలన ఇది యానాం అయిందని మరో నానుడి ఉంది. రెంటికీ చారిత్రక ఆధారాలులేవు.**

పల్లీలను కొట్టడం జరిగింది. దీని ఆధారంగాకూడా అనేక మందికి దెబ్బలు తగిలుంటాయని ఊహించారు. పారిపోగా మిగిలిన కొద్దిమందికి దేహశుద్ధి చేశారు. పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఉన్న పల్లకీని ఎత్తుకుని యానాం ఊరిలోకి పారిపోయారు. సమతం కృష్ణయ్యనాయుడు 'మా నాటి కాపుల యెదుట పల్లీలకు పల్లకీనెక్కె అర్హతలేదు' అని తన వారిని రెచ్చగొట్టాడు. ఊరేగింపులోకి జొరబడి పల్లకీ విరగ్గొట్టి శివాలయం వద్దనున్న తూములో పారవేయించాడు. తర్వాత పల్లీలు తిరుగుబాటు చేయగా వారినందర్నీ కొట్టించారు. అయితే పెళ్ళికొడుకు, పెళ్ళికూతురులు కాపుల యోగ్యతల వల్ల సురక్షితంగా ఇల్లు చేరగలిగారు. ఇది అంతటితో ముగియలేదు. పల్లకీని విరిచేసిన తర్వాత కాపుదనం పల్లెగూడెంలో ప్రవేశించి దోపిడీ ఆరంభించారు. కొందరు వెండి బంగారాలను నూతుల్లో దాచుకున్నారు. ఈ అల్లరిని ఆపడానికి ఊళ్ళో ఉన్న సిబ్బంది చాలదు. ఆ సిబ్బందిలో కూడా ఎక్కువమంది కాపువర్గీయులే వుండటం వల్ల అల్లరిని వ్యతిరేకించలేకపోయారు. యానాంలో ఉన్న పరిపాలనాధికారి స్వయంగా వచ్చి ప్రధాననాయకునితో మాట్లాడారు. ఈ లోపులో యూరోపియన్ ఆఫీసర్లకు భయం వల్ల పాండిచ్చేరికి తంతి పంపారు. ఒక పటాలాన్ని పంపి గ్రామాన్ని కాపాడాలన్నది ఆ తంతి సారాంశం. ఇక్కడుండే ఆఫీసులను పరిరక్షించడానికి సామర్లకోటలో వున్న పటాలాన్ని పంపమని బ్రిటిష్ వారిని కోరారు. గ్రామం తూర్పుభాగాన ఉన్న గోదావరి దాటి రాకుండా పడవలకి కన్నాలు కొట్టి ముంచేసారు. తర్వాత కొంచెం ఆలస్యంగా ఎలాగో బ్రిటిష్ వారి పటాలం వచ్చి ప్రమేయం వున్న వాళ్ళని అరెస్టు చేసి పాండిచ్చేరి నుంచి వచ్చిన వాళ్ళు వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. పెద్దలకు ఆరు ఏడు సంవత్సరాల శిక్షలు పడ్డాయి. ఈ శిక్షలన్నీ దోపిడి గురించి వేసినవే.

ఆ కాలంలో పూర్వాచారాలు పాటించబడటంలో ఎంత పట్టుదల ఉండేదో ఈ సంఘటనల వల్ల తేట తెల్లమవుతుంది. ప్రజాపాలకులైన రాజులకన్నా ప్రజలే ఈ ఆచారాలను కాపాడుతూ వుండేవారని అర్థమౌతుంది.

# మాచు – పీచు (పెరూ)

## ఆరోహణ-5



జె. బ్రొనొస్కి

'ఇంకా'ల సంఖ్యా పరిజ్ఞానం తాళ్లముక్కల్లో నిక్షిప్తమై వుంది. తాడుముక్కను 'క్విపు' అంటారు. గణితశాస్త్రంలో సుదీర్ఘ అనుభవం వున్న వాడిగా నాకు తెలుసు. అక్షరాలే కాదు, అంకెల ద్వారా కూడా మనం సమాచారాన్ని విస్తారంగా సేకరించవచ్చు (అక్షరాలు, అంకెలు – రెండూ ప్రతీకలే గద!). 'ఇంకా'ల సైనిక సామర్థ్యం, ధాన్యాగారాలు, గిడ్డంగుల గురించి మనకు ఈ క్విపుల వల్లనే తెలిసింది. పెరూ అప్పటికే గొప్ప సంపన్న దేశం. ఆ ప్రజల జీవనసరళి, వృత్తి వివరాలు కూడా మనకు నిక్కచ్చిగా చెప్పాయి అంకెలు.



గాఢంగా అల్లుకు పోయిన సామాజిక వ్యవస్థ అది. ప్రతిపౌరుని విధులనూ, స్పష్టంగా నిర్వచించారు. తిండి కొరత లేదు. రైతులు, వృత్తి నిపుణులు, సైనికులు అందరూ ఒక అధినేత ఆదేశానుసారంగానే పనిచేశారు. అతడే సుప్రీం ఇంకా. అతడే రాజు, దైవాంశసంభూతుడైన మతాధికారి. సూర్యుడినీ, దేవుణ్ణీ, రాజునీ కలిపి శిల్పాలు చెక్కారు 'ఇంకా' కళాకారులు.

క్రీ.శ. 1438 నుండి సుమారు మూడు శతాబ్దాలలో మూడువేల మైళ్ల సముద్రతీర ప్రాంతాన్ని అంటే-ఆండీస్ పర్వతాల నుండి పసిఫిక్ సముద్రందాకా తమ అధీనంలోకి తెచ్చుకున్నారు ఇంకాలు. అయినప్పటికీ, 1532లో నిరక్షరాస్యుడైన ఒక స్పానిష్ మోర్ధ ఫ్రాన్సిస్కోపిజారో కేవలం అరవైరెండు గుర్రాలు, వందలమంది సైనికులతో అంతటి మహాసామ్రాజ్యాన్నీ అలవోకగా జయించాడు – ఇంకా రాజును బంధించటం ద్వారా యిది సాధ్యపడింది. బంగారం కోసం దండెత్తివచ్చిన రాబందులకు మృత కళేబరంలా మిగిలింది. ఒకనాటి 'ఇంకా' రాజ్య సంపద, కాని నగరమంటే నగరాధిపతి ఒక్కడే కాదు. నగరమంటే ప్రజలు. వాళ్ల సమిష్టి కృషికి ఒక సజీవ సాక్ష్యం. గ్రామాలలోవున్న రైతులు, వృత్తి కళాకారులు నగర జీవితానికి వెన్నెముక.

ఈ దోపిడీమూకలు వెన్నెముకనే విరిచేశారు. మాచు-పీచుని నిర్మించిన స్వర్ణకారులు, లోహ కార్మికులు, నేతగాళ్లు, కుమ్మరివాళ్లు అంతరించారు. నేసిన వస్త్రాలు చివికి పోయాయి. ఇత్తడి వస్తువుల మీద మురికి పేరుకు పోయింది. బంగారాన్ని అపహరించారు. వాళ్ల కళా సామర్థ్యపు ఆనవాళ్లు మాత్రం యింకా మిగిలున్నాయి. ఎందుకంటే, నగర నిర్మాత 'ఇంకా' కాదు, అక్కడి వృత్తికళాకారులే నిజమైన నాగరికతా స్రష్టలు. అయితే, ఎక్కడైనా, ఎప్పుడైనా ఒక వ్యక్తికోసం, ఆయన ఆజ్ఞానుసారం పనిచేసినప్పుడు అతడి అభిరుచులు కళాకారుల కృషిలో ప్రతిబింబిస్తాయి. స్తంభాలనే తప్ప, వంగిన కప్పు (Arch)ను వాళ్లు నిర్మించ లేదు. ఇంకా నాగరికతకూ, గ్రీకులకూ వున్న ముఖ్యమైన తేడా యిదే. ఇంకాలకన్నా, రెండువేల సంవత్సరాల క్రితమే గ్రీకులు Archల నిర్మాణ పద్ధతులను ఆవిష్కరించారు.

తెలుగు : ముక్తవరం పార్థసారథి, ఫోన్ : 9177618708

దక్షిణ ఇటలీలో వున్న 'పేస్టం' (ఒక నగరం) పార్థినన్ కన్నా ప్రాచీనమైనది. (క్రీ.పూ. 500 నాటిదని ఒక అంచనా). గ్రీకుల భవన నిర్మాణ సామర్థ్యానికి పరాకాష్ఠ పేస్టం.

గణితశాస్త్ర మూలాలతో ముడిపడి వున్నదీ నగరం. ఈ ప్రాంతంలోనే పైతాగొరస్ గణితం బోధించాడు.

సెగోవియా (స్పెయిన్)లోని సాగునీటి కాలువలను గ్రీకులు క్రీ.శ.100లో నిర్మించారు. నీటిపై కట్టిన వంతెనలు అర్థచంద్రాకారంలో వంగటం చూసి మూఢనమ్మకాలు రాజ్యమేలిన మధ్యయుగాలలో, దయ్యం వంతెనలన్నారు స్పెయిన్‌ను ఆక్రమించిన మూర్‌లు.

Arch, రోమన్ల ఆవిష్కరణ కాదు. నిర్మాణపరంగా చూస్తే, వంతెన అనేవి, రెండు బిందువుల మధ్య, ఒత్తిడిని, బరువును తట్టుకుని నిలబడగలిగిన ఒక కట్టడం మాత్రమే. వంగి వుండడం వల్ల, ఒత్తిడి, ఒకేచోట కేంద్రీకరించబడటానికి బదులు, చివర్ల దాకా సమంగా విస్తరిస్తుంది. ప్రకృతి విధించిన పరిమితులను అధిగమించే క్రమంలో జరిగిన గొప్ప ఆవిష్కరణ Arch.


ఆర్చ్ నిర్మాణ శైలి

రోమనుల కాలంనాటి Arch లన్నీ అర్ధ వృత్తాకారంలోనే కనిపిస్తాయి. తరవాతి దశలో ఈ నిర్మాణ పద్ధతినే అరబ్బులు కూడా అనుసరించారు. క్రీ.శ. 785లో అరబ్బుల ఆక్రమణ తర్వాత, స్పెయిన్‌లోని కోర్డోబాలో నిర్మించిన మసీదు యిందుకో ఉదాహరణ.

సైద్ధాంతిక ఆవిష్కరణలు అనన్య సామాన్యమైన మేధోగణితంతో మనల్ని అప్రతిభుల్ని చేస్తాయి. కాని రోజువారీ అవరాల కోసం జరిగిన ఆవిష్కరణలు సామాన్య మైనవిగా కనిపిస్తాయి. Arch నిర్మాణ పద్ధతిలోని పరిమితుల్ని అధిగమించటానికి చాలాకాలం పట్టింది. అర్ధవృత్తాకారంలో గాక, అండాకారంలో జరిగిన నిర్మాణ పటిమవల్ల యిది సాధ్యపడింది. ఇది గొప్ప ఆవిష్కరణగా కనిపించక పోవచ్చు గాని భవన నిర్మాణ శైలిలో వచ్చిన మౌలిక మార్పులకిదే నాంది. అర్ధవృత్తాకార Arch ఎత్తు ఎక్కువ. కాని అండాకార Arch వల్ల వైవిధ్యం పెరిగింది.

మానవ మేధస్సు సృష్టించిన అద్భుతాలన్నింటిలోకీ, ఉత్తర యూరోపులో, క్రీ.శ. 1200 సంవత్సరాల క్రితమే వెలసిన గోతిక్ భవన నిర్మాణకళ అతివిలక్షణ మైనది. ఆకాశంలో కెగసినట్టుగా వున్న ఈ మహా హర్మ్యాలు నిర్మాణ సంక్లిష్టత దృష్ట్యా అత్యంత కీలకమైనవి. గణితశాస్త్రజ్ఞులు ఇంజనీరింగ్ సూత్రాలు కనిపెట్టక పూర్వమే వీటిని నిర్మించారంటే, ఆనాటి విశ్వకర్మల దూరదృష్టి ఎంతటిదో అర్థంచేసు కోవచ్చు. పొరబాట్లు జరగలేదని కాదు, శాస్త్ర విజ్ఞానమెప్పుడూ ప్రయత్నం, పొరబాటు సరిదిద్దుకుని ముందుకు పోవటం (Trial & Error) పద్ధతిలోనే అభివృద్ధి చెందుతుంది.

ఈ గోతిక్ చర్చి భవనాలు కట్టింది మామూలు కూలీలు, పనివాళ్లే. నిర్మాణ దశలో వాళ్లు ప్రదర్శించిన మెళకువలే ఆవిష్కరణలు. మెకానిక్సు పరిభాషలో, అర్ధవృత్తాకార Arch. నిటారుగా పైకి లేచి, ఆ ఒత్తిడిని భవనంలోని అన్నిగోడలమీదా సమంగా విస్తరించింది. స్టీలు వాడకంలోకి వచ్చేటంతవరకూ, ఈ నిర్మాణ పద్ధతి మారలేదు. అయినప్పటికీ, రాళ్లను పోగుచేసి, గురుత్వాకర్షణ శక్తిని అర్థంచేసుకున్న ఆనాటి తొలి భవన నిర్మాణ నిపుణులు 150 అడుగుల ఎత్తున్న కట్టడాలకు రూపకల్పన చేశారంటే, వాళ్ల సృజనాత్మక శక్తికి మనం జోహారు లర్పించక తప్పదు.

శాస్త్రాధ్యయనమంటే, పరిశీలన, విశ్లేషణ అంటారు తాత్వికులు. ఉదాహరణకు, ఇంద్రధనుస్సును అర్థం చేసుకో వాలంటే దానిలోని రంగులు విడదీసి చూడాలి. అలాగే, కళ అంటే, వివిధ అంశాల సమ్మేళనమని కూడా ఒక భావన వుంది. అంటే అన్ని రంగులూ కలిసిన ఇంద్రధనుస్సును స్పందించడం. ఈ ఆలోచనా ధోరణి సరైంది కాదు. ప్రకృతిని విశ్లేషించగలగటమే వ్యూహాశక్తికి నిదర్శనం. బుద్ధి, శారీరక నైపుణ్యం కలిస్తేనే కళాసృష్టి జరుగుతుందన్నాడు మైకలేంజిలో (శిల్పి, చిత్రకారుడు). ప్రకృతిలో ముడిసరుకుగా లభ్యమైన వస్తువులు కళాకారుడి చేతిలో ముగ్ధమోహన రూపాన్ని సంతరించుకుంటాయి. అంటే, ఆ రూపం మొదట, కళాకారుడి

మెదడులో మెదిలిందన్నమాట. భవననిర్మాణ నిపుణుల్లాగే, శిల్పికూడా రూపాన్ని మొదట ఊహిస్తాడు. అంటే ప్రకృతి సిద్ధమైన ముడిసరుకుతో (రాళ్లతో, మట్టితో) అతడు తన మనసులో వూహించుకున్న ఆకారానికి ప్రాణం పోస్తాడు. ఇది సార్వజనీన మైన, సార్వత్రికమైన సూత్రం.

"బ్రూటస్ శిరస్సు" చెక్కే సమయంలో యితరులు పాలరాతి గనులనుండి తొలిచిన శిలలను ఆయనకు సప్లై చేశారు కాని, పూర్వాశ్రమంలో మైకలేంజిలో కూడా 'కరారా' గనులలో కార్మికుడిగా పనిచేశాడు. ఆనాడు శిలలను తొలిచిన అదే చేయి ఈ శిల్పం చెక్కింది.

కరారా పాలరాతి గనుల నుండి ప్రముఖ శిల్పులు మారినో మారిని, జాక్ లిప్ చిట్జ్, హెన్రీమూర్‌లాంటి వాళ్లు తమ ముడిసరుకును సమకూర్చుకుంటారు.

'కళాకారుడు సృష్టించబోయే రూపం, ముందే అతడి మనస్సులో ఏర్పడి వుంటుందన్నమాట', నూటికి నూరు పాళ్లు నిజం కాకపోవచ్చు. కాని మరో అర్థంలో, మన ఆవిష్కరణలన్నీ యిప్పటికే ప్రకృతిలో నిబిడీకృతంగా వున్నవే అని స్ఫురించటం లేదా రాతిబండలో ఆకారం దాగివుంటుంది. దాన్ని వెలికి తీస్తాడు శిల్పి. ప్రకృతిలో నిక్షిప్తమైన విషయాన్ని బహిరంగపర్చటమే ఆవిష్కరణ. ఈ సత్యాన్ని మనం అంగీకరించినప్పటికీ, ఏ యిద్దరు వ్యక్తుల ఆవిష్కరణలూ ఒకే రకంగా వుండవు. విశ్లేషణ, సంయోగాలు ఏకీకరణ ఫలితమే ఆవిష్కరణ. విశ్లేషణ, ఒక వస్తువును, విషయాన్ని విభజించి పరిశీలిస్తుంది. సంయోగం, తిరిగి వాటిని కలిపి కొత్తరూపాన్ని తయారు చేస్తుంది. అదే సృజనాత్మకత.

ఇంద్రియ జ్ఞానం తత్సంబంధమైన స్పందనలకు ఫలితమే శిల్పం (వీక్షించటానికి కాకుండా, కేవలం చేతులతో తడిమి ఆస్వాదించటం కోసం చిన్న చిన్న శిల్పాలను చెక్కుతారు ఎస్కిమోలు). శాస్త్రీయ ఆలోచన నైరూప్యమైనదిగా కనిపించదుగాని, శిల్పాలు, భవన నిర్మాణాలు భౌతిక రూపాలు, ధ్యానం, వూహాలోక విహారం ద్వారాకాక, ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా మాత్రమే మనం లోకాన్ని అర్థం చేసుకోగలం. చక్షువు కన్నా చేయి ముఖ్యం. ప్రాక్ దేశాలలో, మధ్యయుగాలలో, కదలకుండా కళ్లు మూసుకుని కూర్చున్న యోగులు మాత్రమే లోకాన్ని తమ ధ్యానదృష్టితో దర్శించగలరన్న భావన వుండేది. కాని పశ్చిమదేశాల శాస్త్రజ్ఞులు, పరిశీలన, విశ్లేషణ ద్వారానే ప్రకృతి రహస్యాలను ఛేదించగలరని నమ్మారు. ఇది మన స్వభావం. మన వ్యక్తిత్వం, మానవ పరిణామ క్రమంలో, చేయి అలవర్చుకున్న సామర్థ్యమే, బుద్ధిని కూడా శాసించిందని తేటతెల్లమవుతుంది. మెదడు పూర్తిగా ఎదగని దశలో కూడా మనిషి పనిముట్లు తయారు చేశాడు. ఆ పనిముట్లు వాడకం ఆలోచనా క్రమాన్ని ప్రభావితం చేసింది. 1778లో బెంజమిన్ ఫ్రాంక్లిన్, మనిషిని 'పనిముట్లు తయారు చేసే జంతువు'గా అభివర్ణించాడు.

**మాచు - పీచు** నిర్మాణంలో పాలుపంచుకొన్నవారు స్వర్ణకారులు, లోహకారులు, సాలెలు, కుమ్మరులు. కాలగతిలో స్వర్ణం దొంగలపాలయ్యింది. లోహాలు కరిగిపోయాయి, వలువల చివికి పోయాయి. మరి మిగిలిందేమిటి? అది రాళ్లెత్తి కూలీల శ్రమ, అద్భుత నిర్మాణ కౌశల్యం. దీనిని నిర్మించిన వారు ఇంకాస్ ప్రజలు కాదు. వృత్తి నిపుణులు. వారు ఇంకాస్ రాజ్యం కొనసాగినంత కాలం తమ నిర్మాణ కౌశల్యాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. భవన నిర్మాణంలో దూలాలు వాడినా, అర్ధచంద్రాకారపు ఆర్చి గురించి వారికి తెలియదు. వీరికంటే రెండు వేల సంవత్సరాల క్రితం వచ్చిన గ్రీకు నాగరికతలో ఆర్చి చాలా ముఖ్యమైన ప్రగతిని సాధించింది. ఇది పాత, కొత్త ప్రపంచాల మధ్యనున్న అంతరాన్ని తెలుపుతుంది.

ఇంకాస్ వారు చక్రం ఉపయోపయోగించలేదు. కొండలను వెడల్పయిన మెట్లుగా అంచెలంచెలుగా విభజించి వ్యవసాయానికి అనుకూలంగా చదును చేసి పంటలు పండించుకున్నారు. నూటనలభై నిర్మాణాలు, దేవాలయాలు, నీటిని చిమ్మే గొట్టాలు, నీటి ప్రవాహాన్ని నదులను సంధానిస్తూ తవ్విన పిల్లకాలువలు, వారి నిర్మాణ వైశిష్ట్యాన్ని తెలుపుతాయి. 'ఉరుమాబా' కొండ చర్యపై నిర్మించబడ్డ ఈ నగరం సముద్రపు మట్టానికి 7970 అడుగు ఎత్తుపైన ఉంది.

ఇంకాస్‌పై శాస్త్రీయ చారిత్రక ఆధారాలు లభించలేదు. వారి పుట్టుపూర్వోత్తరాల మాయా మర్మాలతో నిండిపోయింది. సూర్య చంద్రులతో నిర్మించబడ్డ 'కిటికాక' అనే సరస్సునుండి 'మాంకో కాపా' అతని సోదరి 'మామ అక్లే'లో ఉద్భవించారు. వారిద్దరు ఒక స్వర్ణకాండను చేతబూని సరస్సునుండి బయటకి వచ్చి ఇంకాస్ ప్రజలకు సరిపడే ఆవాసం కోసం అన్వేషించారు. భూగోళ, ఖగోళ ధ్వని, ప్రతిధ్వనుల ఆధారంగా కుచుకో అనే ప్రదేశాన్ని ఎంపిక చేశారు. ఇంత జరిగినా, ఇంకాస్ తెగ ఒక చిన్న జాతి మాత్రమే.

పనిముట్టు ఎంత ముఖ్యమో, దాన్నుపయోగించగలిగిన చేయూ అంతే ముఖ్యం. చేతిలో పనిముట్టును పట్టుకోగలగటమే ఒక ఆవిష్కరణ. తరువాతి దశ పట్టుకోవటమనే ప్రక్రియను ఆనందించటం. ఇదే కళాసృష్టికి మూలం. తక్షణావసరాన్ని మించిన సామర్థ్యం నేర్చుకొనటమే కళ. చరిత్ర పూర్వకాలంలో కూడా మానవుడు, అవసరాలకి మించిన 'అందమైన' పని ముట్లను తయారుచేశాడు. కనిపించని మనసుకన్న కనిపించే శరీరం చేయి. నాగరకత అంటే కళాకృతులను ఒకచోట చేర్చిన ప్రదర్శన శాలకాదు. కళాసృష్టి దశల పరిణామక్రమమది. వేల, లక్షల ఏళ్లుగా మనిషి చేయి సంతరించుకున్న సంక్లిష్ట సామర్థ్య ఫలితం.

ఈ మానవారోహణకు మౌలిక ప్రేరణ మనిషి, తన సామర్థ్యాన్ని గుర్తించి ఆనందించటం. అసాధ్యమనుకున్నవి చెయ్యాలనుకుంటాడు. చేయగలిగింది మరింత బాగా చేస్తాడు. అంతటితో ఆగక, దానికి మెరుగులుదిద్ది మురిసిపోతాడు. శాస్త్రాధ్యయన క్రమంలో ఈ విషయం మనకు స్పష్ట మవుతుంది. గుళ్లు, గోపురాలు, రాజభవనాలు అనేక యితర అద్భుత హర్మ్యాల దేవుళ్లనూ, రాజులనూ కీర్తిస్తున్నాయను కుంటాం. నిజానికవి కాలగమనంలో మనిషి శక్తిసామర్థ్యాలకు, కళాతృష్ణకు నిదర్శనాలుగా ఎగరేసిన విజయపతాకాలు.

ప్రతి నాగరికతలోనూ, దేవాలయాల నిర్మాణంలో మనిషి తన ప్రతిభాపాటవాలను చాటుకున్నాడు. నశ్వరుడైన మనిషి, తన ముందుతరాలకందించిన నిర్మాణకౌశలా చిహ్నాలు ఈ గుళ్లు. తనుచేసిన పనులవల్ల, తాను వదిలివెళ్లిన కళా రూపాలవల్ల, మనిషికి అమరత్వం సిద్ధిస్తుంది. అస్త్ర శస్త్రాలతో, లోహకళలతో, అశ్వారూఢుడై సమాధి అయిన వీరుడు, ఓడలలో సముద్రమధ్యంలో మునిగి, జలగర్భంలో నివాస మేర్పరుచుకున్న నావికుడు, తమ జీవనసరళిని, ఈనాటి తరానికి తెలియజేస్తున్నారు. ఆనాటి నాగరికతకు ప్రతినిధులు వాళ్లు. చేయితోపాటే, మనిషి ఆలోచనా పరిధిని విస్తరించిన మరొక అంశం అతని దార్శనికత. భౌతికంగా కనిపించని విషయాలను కూడా వూహించగలడతడు. అవును, కనిపించే వస్తువుల మాటున కనిపించనివెన్నో దాగున్నాయి. ఈ అదృశ్యలోకాన్ని అవగాహన చేసుకో గలగటమే ఆరోహణలో తదుపరి దశ.

మనిషికీ, అగ్నికీ ఒక మార్మిక సంబంధముంది. మనిషికి మాత్రమే అందుబాటులోనికెళ్లిన ప్రకృతి శక్తి అది. పదార్థ రహస్యాలను ఛేదించటానికి ఆధునిక భౌతిక శాస్త్రంలో అనేక



జాన్ మిల్టన్ వర్ణించిన, విలియమ్ బ్లేక్ చిత్రించిన ఈ చిత్రం, దేవుడు భూమిని కంపాస్‌తో రూపొందించటం! (1794)

ప్రయోగాలు జరుగుతున్నాయి. అగ్ని సాయం లేకుండా ఈ ప్రయత్నాలు కొనసాగించటం అసాధ్యం. ఒక రకంగా, వేలసంవత్సరాలక్రితమే ఈ ప్రయోగాలు ప్రారంభమైనప్పటికీ (ఉదా: ఉప్పును వేరుచేయటం, లోహాలను, నిర్ధారించటం వగైరా) నిప్పులో కాల్చటం వల్ల మాత్రమే పరుసవేది లాంటి ప్రక్రియలకు బీజం పడింది. భౌతిక శాస్త్రానికీ, అగ్నికీ వున్న సంబంధం అంత మౌలికమైనది. ఆనాటి పరుసవేది మాంత్రికుల ప్రయోగమొకటి మనకు బాగా తెలుసు.

"Cinnabar (Red Mercury, Sulphide) ను వేడి చెయ్యటంవల్ల అనేక అద్భుతాలు జరుగుతాయి. వేడికి సిన్నాబార్ పాదరసంగా మారుతుంది. ఇంకా వేడి చేస్తే తిరిగి సిన్నాబార్‌గా మారుతుంది ("ఈ పద్ధతిలో మృత్యువును జయించటం సాధ్యమే" అని ప్రచారం చేశారు).

చైనా నుండి స్పెయిన్ దాకా, మధ్య యుగాలలో పరుస వేదులు చేసిన ప్రయోగాలలాంటివే ఎర్రటి సిన్నాబార్‌ను వేడి చెయ్యటంవల్ల సల్ఫర్ ఆవిరై తళతళ మెరిసే పాదరసం ప్రత్యక్షమవుతుంది. దీన్ని యింకా వేడి చేస్తే సిన్నాబార్‌గా మారుతుంది.

ఇదో ముఖ్యమైన ప్రయోగమని ఈనాడెవరూ అంగీకరించరు. కాని క్రీ.శ. 1500లో విశ్వమంటే పాదరసం, సల్ఫర్‌ల సంయోగమేనని విశ్వసించారు. అయితే, యిందువల్ల మనకు అర్థమైన మరో కొత్త విషయముంది. వాళ్లు, అగ్నిని నాశకకారిగా కాక, పదార్థాల రూప, స్వభావాల్ని మార్చే ఒక 'మాంత్రిక శక్తి'గా గుర్తించారు.

ఒకసారి ఆల్డస్ హక్స్లీ (ప్రముఖ రచయిత, తత్త్వవేత్త) నాతో సంభాషిస్తూ, "అగ్ని నాశనం చెయ్యదు, పునర్జన్మనిస్తుంది అని అనేక గాథల్లో చెప్పబడింది. ఫీనిక్స్ పక్షి కథ అదే గద. అది అగ్నిలో దహనం కాలేదు. మంటల్లోంచి మళ్లీ జన్మించింది గద. దానికి మరణం లేదు" అన్నాడు. నిత్య యవ్వనానికీ నెత్తుటికీ ప్రతీక అగ్ని. పగడాలు, సిన్నాబార్ నిప్పులాగే ఎర్రగా వుంటాయి. కొన్ని జాతులలో జనం ఒళ్లంతా ఎరుపు రంగు, కుంకుమ పూసుకుని వూరేగుతారు (గ్రీకు గాథ ప్రకారం). ప్రొమెలియస్, దేవతలకు మాత్రమే అందుబాటులో వున్న అగ్నిని మనుషులకోసం భూమికి తీసుకొచ్చాడు. ఈ కారణంగా దేవతలతణ్ణి శిక్షించారు.

కథలూ, గాథలలో అగ్ని ప్రస్తావన ఎలావున్నా నాలుగు లక్షల సంవత్సరాల క్రితం మనిషి నిప్పును కనుగొన్నాడు. ఆనాటి నుండి అది అతడి జీవితంలో ఒక భాగమైంది. తొలిరోజుల్లో వాళ్లు నిప్పును ఎలా తయారుచేసేవాళ్లో తెలియదుగాని అండమాన్ ద్వీపాల్లోని పిగ్మీలు సహజంగా అందుబాటులో వున్న దావాగ్నిని దాచుకుని తమ అవసరాలకు ఉపయోగిస్తున్నారు.

ఆదివాసులకు, అగ్నివల్ల వున్న ఒకే ఒక ఉపయోగం చలి కాచుకోవటం. కాగా క్రూర జంతువులను రానివ్వకుండా చెయ్యటం. ఆ తర్వాత వంటకూ, రాళ్లను పగులగొట్టటానికి కూడా నిప్పును వాడుకున్నారు. అయితే, దీని అసలైన వుపయోగం, లోహాలను శుద్ధిచెయ్యటంతో ప్రారంభమైంది. 'ఆరోహణ'లో ఇది కీలకదశ. రాతి పనిముట్లకు బదులుగా, లోహాలు వాడకంలోకి రావటానికి కారణం నిప్పే. ఇదో గొప్ప ఆవిష్కరణ, ప్రకృతి రహస్యాలను ఛేదించే ఖడ్గం భౌతిక శాస్త్రం. బహిరంగ లక్షణాలను కొంత, పదార్థ అంతఃస్వభావాన్ని విశ్లేషిస్తుందది.

పదివేల సంవత్సరాల క్రితం మధ్య ఆసియాలో రాగి వాడకం ప్రారంభమైంది. అయితే లోహాలు సమృద్ధిగా లభించనంత వరకూ, విస్తృతంగా వాటిని వుపయోగించటం సాధ్యపడదు. ఖనిజం నుండి లోహాన్ని వేరుచెయ్యగలగాలి. ఖనిజాలను వెలికితియ్యటం పర్షియా, ఆఫ్ఘనిస్తాన్‌లలో సుమారు ఏడువేల ఏళ్లనాడు ప్రారంభమైంది. మనిషి మొదట కరిగించిన లోహం రాగి. తక్కువ ఉష్ణోగ్రతలోనే యిది ఖనిజం నుండి విడివడుతుంది.

తనకు నచ్చిన పద్ధతిలో పోతపోయగల లోహం లభించిన తర్వాత మనుషులు దానితో సృష్టించని ఆకారం లేదు. నగలు, పాత్రలు, పనిముట్లు ఒకటేమిటి అది లోహకారుని చేతిలో ఆటవస్తువైంది. అయితే రాగి మెత్తటి లోహం. ఒత్తిడికి కరిగిపోతుంది. అయినా మరో లోహం తెలియక పోవటం వల్ల ఆరువేల సంవత్సరాల పాటు దానితోనే తృప్తిపడ్డాడు. అంటే మిశ్రమ ధాతువులను కనుగొన్నదాకా పరిస్థితిలో మార్పురాలేదు. రాగికి అంతకన్నా మెత్తటి మరో లోహం సత్తు కలిపి దృఢమైన కంచు తయారుచేశాడు. ఇది మనిషి కృత్రిమంగా సృష్టించటానికి ముందే ఈ రెండు లోహాలూ కలిసిన ఖనిజం అతనికి దొరికి వుంటుంది. నిజానికి దేనికది, లోహాలన్నీ మెత్తటివే. వాటిలో మరేదైనా కలసినప్పుడు మాత్రమే అవి గట్టిపడతాయి.

క్రీ.పూ. 3800 ప్రాంతంలో మధ్య ఆసియాలో కనుగొనబడిన ఇత్తడిని విస్తృతంగా వుపయోగించింది మాత్రం చైనాలోనే. క్రీ.పూ. 1500లో ఈ ఇత్తడి వాడకం ద్వారానే షాంగ్ వంశం ఉచ్ఛదశకు చేరుతుంది.

చైనాను సాంస్కృతికంగా, రాజకీయంగా సమైక్యం చేసింది షాంగ్‌వంశం. ఆ కాలంలో పింగాణీ వాడకం కూడా పెరిగింది (పింగాణీ మీద అక్షరాలు రాయటం, బొమ్మలు చిత్రించటం సులభం). ఇత్తడిని చెయ్యటానికి రాగి-సత్తులకు ఖచ్చితమైన నిష్పత్తి అంటూ ఏమీలేదు. 5 శాతం నుండి 20 శాతం దాకా సత్తును రాగికి కలపవచ్చు. 15 శాతం సత్తు కలిపిన రాగితో అత్యంత దృఢమైన కళాఖండాలను పోతపోశారు షాంగ్ కళాకారులు. ⓜ

అవసరాల అనసూయాదేవి

# సంగీతం, సాహిత్యం

- త్రివేణి

మనదేశంలో సంగీత, సాహిత్యాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. భారతీయ సాంస్కృతిక వైభవం ఈ రెండు కళల్లోనే ప్రతిఫలిస్తుంది. మన సంస్కృతికి అనుగుణంగా చేసిన చక్కని రూపకల్పనలు ప్రపంచ వ్యాప్తంగా పేరెన్నికగన్నాయి. భారతదేశం నుంచి వెళ్ళి వివిధ దేశాలలో స్థిరపడిన వారు మన కళలకు గొప్ప ఖ్యాతిని ఆర్జించి పెట్టారు. భారతీయ సంస్కృతిలో భాగమైన మనదేశ ప్రజల జీవనవిధానాన్ని, ఆచారవ్యవహారాల్ని, స్వచ్ఛమైన మనస్తత్వాల్ని, ఆప్యాయతా-అనుబంధాల్ని, ప్రేమానురాగాల్ని ప్రవాస భారతీయులు తమ తమ కళలల్లో ప్రతిబింబింపజేశారు. భారతదేశ ఔన్నత్యాన్ని దశదిశలా చాటారు. అందులో ప్రవాసాంధ్రుల పాత్ర కూడా గణనీయమైంది.



ప్రవాసాంధ్రులుగా అమెరికాలో స్థిరపడిన వారిలో అత్యద్భుత సంగీత ప్రతిభ చూపి, "కళా-ప్రపూర్ణ" బిరుదు గాంచిన ఒక గొప్ప కళాకారిణి డా॥అవసరాల (వింజమూరి) అనసూయాదేవి ముఖ్యురాలు, సుమారు తొంభై సంవత్సరాల వయస్సుగల అనసూయాదేవి ఇరవై సంవత్సరాల క్రితం అమెరికాకు వలస వెళ్లి తన కూతుళ్ళు, కొడుకుల వద్ద ఉంటున్నారు. డెబ్బైఐదు సంవత్సరాల క్రితం కొన్ని వందల వరకు తెలుగువారి జానపదగేయాలు సేకరించి సంగీత స్వరాలు కూర్చి, పాడి, పుస్తక రూపంలో ప్రచురించి అశేష ప్రజల అభినందనలను పొంది, తెలుగు జానపద సంస్కృతికి వన్నె తెచ్చిన వారు వింజమూరి సోదరీమణులు సీతా-అనసూయలు. సంగీత రంగంలో ప్రఖ్యాతి గాంచిన సోదరీమణుల్లో అనసూయాదేవి కృషి ఎనలేనిది. ఆమె జానపదగేయాల సంగీత రూపకల్పనలో గొప్ప ప్రజాదరణ పొందింది. జానపద సంగీత రంగంలో ఆమెకు గల అసమాన ప్రతిభను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు బిరుదు ఇచ్చి సత్కరించింది.

నాటి పండిత సాహిత్య, సంగీత సభల్లో జానపద గేయాలకుగాని, సంగీతానికిగాని చోటుండేది కాదు. ఆదరణ కూడా చాలా తక్కువస్థాయిలో ఉండేది. అయినా ఆమెకు నచ్చిన పల్లె పాటలకు స్వరాలు కూర్చి ప్రముఖుల సభల్లో నిర్భయంగా పాడి వినిపించేది. ఆనాటి పరిస్థితులకు ఎదురు నిలిచి ఒక సాహసంతో సాధించి పెట్టిన కీర్తి; నేడు జానపద నృత్య, సంగీత సాహిత్యాలకు పటిష్టమైన సాంస్కృతిక రంగాన్ని సిద్ధం చేసింది. ప్రజల జీవన సంప్రదాయంలో మమేకమైంది.

సాహిత్య వాతావరణంలో పుట్టి, పెరిగిన అనసూయాదేవి తన ఎనిమిదవయేట నుంచే సంగీత రంగ ప్రవేశం చేసింది. భావకవి దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రిగారి మేనకోడలు కావడంవల్ల, ఆమె సంగీత, సాహిత్య సంస్కారాలకు బాల్యం నుంచే ప్రోత్సాహం లభించింది. 1930లోనే గళంవిప్పి, సంగీత స్వరరచనకు హార్మోనియం పేటిక మీద తన సున్నితమైన వేళ్ళను కదపడం ప్రారంభించింది. అపరిమితమైన సంగీత కాంక్షగల అనసూయాదేవి తన గురువు మునుగంటి వేంకటరావు పంతులుగారి వద్ద శాస్త్రీయ సంగీతాధ్యయనం చేసింది.

డా. త్రివేణి, ఫోన్ : 9951444803

శాస్త్రీయం లేదా లలిత శాస్త్రీయం వంటి సంగీతాలకు అలవాటైన సభా సంగీతంలోకి కొత్తగా 'భావగీతం' అనే విధానాన్ని పరిచయం చేసింది. రేడియోల ద్వారా, గ్రామఫోన్ రికార్డుల ద్వారా లలిత సంగీతానికి ఒక స్పష్టమైన రూపాన్ని ఏర్పరిచింది. జానపద, భావగీత రీతుల ప్రచారాన్ని ఒక ఉద్యమంగా కొనసాగించింది. మొదటగా దేవులపల్లి కృష్ణశాస్త్రి వ్రాసిన గేయాలకు బాణీలు నిర్మించింది. "దిగిరాను దిగిరాను దివినుండి భువికి" అనే కృష్ణశాస్త్రిని నేలకుదించి, జానపద గీతాలను పలికించింది. ఆధునిక భావ గీతాకారులైన విశ్వనాథ, మల్లవరపు, వేదలు, శ్రీశ్రీ, బాపిరాజు వంటి కవుల గేయాలకు తొలిసారిగా స్వరాలుకూర్చి, విస్తృతమైన ప్రచారం కల్పించింది.

అతిచిన్న వయస్సులోనే అనసూయాదేవి పాడిన 'అయ్యో కొయ్యోడ' అనే పాటను విని ఆనందించిన సుప్రసిద్ధ హిందీ గాయకుడు కె.ఎల్. సైగల్ ఆశీర్వాదంతో గ్రామఫోన్ రికార్డుగా విడుదల చేసింది. నాటినుంచి ఆరంభమైన సంగీత ప్రస్థానం "మొక్కజొన్న తోటలో" వంటి జానపద గేయాలు, "జయ జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ" వంటి దేశభక్తి గీతాలు, మహోదయానికి మంచి ముహూర్తం" వంటి భావగీతాలు సృష్టింపబడటానికి కారణమైంది. ఆమె ఈ మూడింటిని ఒక ఉద్యమరూపంగా చేపట్టి తెలుగు సంగీతంలో తిరుగులేని ప్రతిష్టను నిలిపింది. నాటి కళాకేంద్రాలైన సూర్య కళామందిరం, సంతచెరువు, యంగ్‌మెన్స్ హేపీక్లబ్, బ్రహ్మసమాజ మందిరం వంటి వాటిలో నిర్వహింపబడే సాంస్కృతిక కార్యక్రమాల్లో అనసూయాదేవి చురుకుగా పాల్గొన్నది. శాస్త్రీయ, లలిత, జానపద, సంగీత త్రివేణి సంగమంలో నూతన ఝరీ వీణా తంత్రిని మీటింది. లలిత సంగీత రూపానికి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది. అర్ధశతాబ్దికి ముందే చలనచిత్ర గీతాలకు స్వరకల్పన చేసి దక్షిణాదిన ప్రథమ 'సంగీత దర్శకురాలి'గా పేర్గాంచింది.

సంగీత రంగానికి అనసూయాదేవి చేసిన సేవకుగాను, దేశ విదేశాలు "సంగీత కళాప్రపూర్ణ", "లలిత జానపద సంగీత సామ్రాజ్ఞి", "సంగీత సరస్వతి", "సంగీత శిరోమణి" వంటి బిరుదులతోనేకాక, ''లైఫ్ అఛీవ్‌మెంట్ అవార్డు''తో సత్కరించాయి. ఆంధ్రప్రదేశ్‌లోనేగాక దక్షిణాది, ఉత్తరాది భారతదేశంలో, విదేశాలలో అనసూయాదేవి అనేక ప్రదర్శనలు ఇచ్చింది. ఎనభైమూడవయేటలో కూడా అమెరికాలోని హ్యూస్టన్‌లో నిర్వహింపబడిన అంతర్జాతీయ కూచిపూడి నృత్య సదస్సులో ఆమె స్వరకల్పన చేసి మొదటి పాటను పాడి ప్రేక్షకులందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది.

సంగీత కళాపరంగా వైశిష్ట్యమేగాక, డా.అనసూయాదేవి సాహిత్య నేపథ్యంలో కూడా విశేషంగా రాణించింది. ఇటీవల కొన్ని కథలను, కవితలను వ్రాసి వివిధ పత్రికల్లో ప్రచురించింది. కవి కుటుంబంలో పుట్టిన ఆమె తన సహస్ర చంద్రోదయ దర్శనవేళ (80 సం॥) రచనారంగంలోకి అడుగుపెట్టింది. తత్ఫలితంగా వెలిసిన గ్రంథాలు "నేను-నా రచనలు", "గతానికి స్వాగతం." వంద సంవత్సరాల నాటి తెలుగు ప్రాంతంలోని జనజీవన విధానం, ఆచార సంప్రదాయాలు, వ్యవహారిక శైలి మొదలగు వాటిల్లో వచ్చే పరిణామక్రమం ఈ రచనల్లో దర్శనమౌతుంది. రచయిత్రి జీవితానుభవాలూ, అనుభూతులూ, ఆలోచనలూ, వివేచనలూ చాలా స్పష్టంగా తెలియజేయబడ్డాయి. వీటితోపాటు నాటి ప్రసిద్ధ కవులూ, కళాకారులూ, ప్రముఖ వ్యక్తులూ, వ్యక్తిత్వాలూ వర్ణింపబడ్డాయి.

"నేను-నా రచనలు" గ్రంథంలో జీవిత విశేషాంశాల్ని స్వయంగా అనసూయాదేవి తన మాటల్లో చెప్పుకొన్నది. తమ గురించి తాము చెప్పుకొనేటప్పుడు కవులుగానీ, కళాకారులు గానీ కొంతసంశయానికి గురవుతారు. తమ సృజనాత్మక శక్తిని తామే వర్ణించుకోవటానికి సంకోచిస్తారు. కాని ఏ కళాకారి యైన తన పూర్వపు పరిస్థితిని, కృషిని ఉన్నది ఉన్నట్లుగా 'తనమాటలలో చెప్పుకొన్నప్పుడే వారి జీవితరహస్యం అర్థమౌతుంది. ఈ ప్రామాణికత్వం అనసూయ రచనలకు ఉంది. ఒకవైపుబాధ, మరొకవైపు ఆనందం కలిపి ఒక కళా కారిణి తలపోతల సంపుటి ఆమె రచనల్లో ద్యోతకమౌతుంది.

ఈ రెండు గ్రంథాల్లో ఆమె బాల్యపు యౌవనాల కాలపు స్థితిగతుల్ని, నాటి భారత, ఆంధ్రదేశాలలో మహోద్యమాల కాలపు పరిస్థితుల్ని, మధ్యతరగతి వర్గంలో 'స్త్రీ' పురుషుల జీవన విధానంలో ఎదురౌతున్న పెనుమార్పుల్ని, బలవత్తర ప్రచార సాధనాలైన రేడియో, సినిమా విస్తృతంగా వ్యాపిస్తున్న కాలాన్ని అడుగడుగునా దర్శించవచ్చు. సౌందర్య దృష్టి, గాన నైపుణ్యం, మాట నేర్పరితనం కలిగిన అనసూయాదేవి కూడా నాటి కాలపు ప్రభావంతో మానసిక ఒత్తిడులకు, అసంతృప్తులకు గురి కావడం కనిపిస్తుంది.

"నేను–నా రచనలు" గ్రంథంలో అనసూయాదేవి తన జీవిత విశేషాలను తెలుపుతూ వ్రాసిన "అయిదు తరాలు" అనే స్వీయ చరిత్రాత్మక వ్యాసం చాలా విలువైంది. ఈ వ్యాసంలో నాటి జీవన విధానమంతా ప్రతిబింబింపబడింది. ఇంకా జానపద గీతాల మౌలికతత్త్వాన్ని గూర్చి, లలిత సంగీతం పుట్టుపూర్వోత్తరాల గూర్చి, మేనమామ కృష్ణశాస్త్రి గూర్చి, మునుగంటి వేంకటరావు పంతులు గూర్చి ఆమె తన ప్రత్యక్ష అనుభవాలతో చెప్పిన విశేషాలు ఒక చారిత్రక సమాజపు దృష్టిని వెలువరిస్తాయి. ఆంధ్ర పునరుజ్జీవనోద్యమ కాలంలో జానపద, భావగీత సంప్రదాయాల పుష్టికి, వ్యాప్తికి, వ్యక్తిగతంగా తాను చేసిన కృషి వర్ణింపబడింది. ఆమె ఈ గ్రంథంలో కథలుగా వ్రాసిన రచనలు తన జీవితంలో ఎదురైన వ్యక్తులను గూర్చి, సంఘటనలను గూర్చి చిత్రించినది. వాస్తవ రూపాలను కథలుగా మలిచి, నాటి జీవనాధార పరిస్థితులను అందంగా తీర్చిదిద్దింది.

ఇరవైఐదు సంవత్సరాల క్రితం నుంచి అనసూయాదేవి తన మనసులో కలిగిన ఆలోచనల్ని కథారూపకంగానో, వ్యాసంగానో రచించింది. అప్పుడప్పుడు కవితా రూపంలో కూడా బయటపెట్టింది. దాదాపు 75 సంవత్సరాల క్రితం ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సి.ఆర్.రెడ్డి గారు అనసూయాదేవితో – "You are a good coversationist. Your argument are perecise. Put your ideas and thoughts on paper and bring them in article forms" అన్నమాటలు జ్ఞాపకం వచ్చి, ఉత్తేజాన్ని ప్రోత్సాహాన్ని కలిగించి, ఆమె తన ''స్వీయచరిత్ర'' వ్రానుకోవటానికి కారణమైనాయి. ఆమె కథలు కొన్ని వాస్తవాలు, మరికొన్ని కల్పితాలు. ఇందులో పాత్రలు కూడా ఆమె ఇష్టా, అయిష్టాల అనుసరణీయం గానే చిత్రించబడ్డాయి. వింత మనుష్యులూ, విచిత్ర మనస్తత్వాలూ, అసూయాపరులూ, అసహ్య ప్రవర్తనలూ ఆమె జీవితాన్ని ప్రభావితం చేశాయి. అవే ఆమె కథల్లో పాత్రలుగా ప్రతిబింబింపబడ్డాయి. ఈ గ్రంథంలో అనసూయాదేవి వ్రాసిన వ్యాసాలన్నీ ప్రసంగ–వ్యాసాలే అని చెప్పవచ్చు. ఆమె జీవితంలోని స్వానుభవాలు, వ్యక్తులతో పరస్పర సంబంధ బాంధవ్యాలు, పుట్టుకతో సంక్రమించిన కళలు, వాటిలో ఆమెకుగల అభిరుచి, అభినివేశం, వివేచనాత్మక ఆలోచనలు, భావస్పందనలు మొదలగు నవన్నీ కలిసి వ్యాసాలుగా రూపొందాయి. ఆమె జీవితపు ఉత్తరార్థం అమెరికాలోనే గడిచిపోయినందువల్ల అనసూయాదేవి రచనల్లో ఆంగ్ల భాషా పద నిర్మాణం ఎక్కువగా కనిపిస్తుంది.

అనసూయాదేవి కథా సాహిత్యంలో భాగంగా ""కాంతం ఒక అయస్కాంతం, వేద (నీ) పండితులు, కవలల కలవరం, దంత సంగీతం, శషసమ్మ, అమెరికాకు వచ్చిన అమ్మలు, ప్రమీలా పెళ్ళి, పాపం! ప్రకాశం!!, వింత దంపతులు" అనే కథలు రచించింది. ఆమె రచించిన ప్రతి కథలో అంతర్లీనంగా సంగీత ప్రాధాన్యాంశం కన్పిస్తుంది. ముఖ్యంగా "కవలల కలవరం" కథ పూర్తిగా సంగీత మూలాంశానికి అంకితమైంది. ఇదేగాక ప్రతి కథలో ప్రవాసాంధ్రుల జీవన చిత్రణ కన్పిస్తుంది. ఏదో ఒక సందర్భంలో అమెరికాకు వెళ్ళడం, అక్కడి వ్యక్తుల వల్ల కానీ, పరిస్థితుల వల్ల కానీ విపరీత బాధలు పడటం కనిపిస్తుంది. కూతుళ్ళు, కొడుకులు అమెరికాలో స్థిరపడటం వల్ల, ఇక్కడి తల్లిదండ్రులు తమ పిల్లల దగ్గర ఉండాలని అక్కడికి వెళ్ళడం, అక్కడి సంస్కృతి, పాశ్చాత్య సంప్రదాయాలు, వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు నచ్చక మళ్ళీ మనదేశానికి తిరిగి రావడం వంటి వారి జీవన విధానాన్ని కథల్లో రచయిత్రి ప్రవేశ పెట్టింది. ఈ ధోరణి అంతా "అమెరికాకు వచ్చిన అమ్మలు" అనే కథలో కనిపిస్తుంది.



"కవలల కలవరం" కథలో ఇద్దరి కవలల గూర్చి, వారి పుట్టుక నుంచి వృద్ధాప్యం వరకు గల జీవిత విశేషాంశాల గూర్చి, వారి సంగీత కళాపరంగా తత్త్వం గూర్చి సవివరంగా విశ్లేషింపబడింది. నిడివి చాలా పెద్దదైన ఈ కథ ఏకాంశ సంభూతమైన సంగీత ప్రాధాన్యతకు చెందింది. పుట్టుక, బాల్యం, విద్యాభ్యాసం, సంగీతాభ్యాసం, యౌవనం, వివాహం, వృద్ధాప్యం వంటి విషయాల్లో సంగీత బద్ధమైన నిబంధనకు అనువైన అంశం ఈ కథలో ప్రస్తావనకు వస్తుంది.

కవలలంటే ఆకారంలోనే కాక, అలవాట్లు కూడా ఒకే విధంగా ఉంటాయని, ఒకరు నవ్వితే, మరొకరు నవ్వుతారని, ఒకరు ఏడిస్తే, మరొకరు ఏడుస్తారని అంటుంటారు కాని, ఈ కథలోని కవలలిద్దరు ఇందుకు విరుద్ధంగా ఉంటారు. కవలలిద్దరు ఆడపిల్లలు కావడం వల్ల, ఆడపిల్ల సహనానికి ప్రతీకయని తల్లి పెద్దమ్మాయి పేరు 'సహన'గా; తండ్రికి శహన రాగమంటే ఇష్టం కావడం వల్ల చిన్నమ్మాయి పేరు 'శహన'గా తల్లిదండ్రులు నామకరణం చేశారు. చిన్నప్పటి నుంచి కవలలిద్దరు సంగీత సాధనలో శిక్షణ పొందినా; 'సహన' ఓర్పుగా, ఒద్దికగా సంగీత శాస్త్రంలోని మెలకువలన్నీ నేర్చుకొంది, కానీ 'శహన'కు మాత్రం ఈ కళ అబ్బలేదు.

ఏకసంతాగ్రాహియైన 'సహన' త్యాగరాజ సంకీర్తనలన్నీ అలవోకగా నేర్చుకొంది. ముక్త, బృంద, క్షేత్రయ్య పదాలు బాగా పాడగలిగిన వ్యక్తిగా 'సహన'ను నిల్పడం, పతకాలూ, ప్రశంసలూ పొందినట్లుగా రచయిత్రి పేర్కొనడం ఈ కథలో ప్రధానాంశం. 'సహన', 'శహన'లు సంగీత శాస్త్రంతో డిగ్రీలు పొందినా, సంగీతశాస్త్ర పరిజ్ఞానం అపరిమితంగా ఉన్న 'సహన'కే సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా ఉద్యోగం వచ్చింది. స్వశక్తితో ఎదిగి నిరంతర సంగీత సాధన చేసే సహనంటే, చెల్లెలు శహనకు అసూయ. క్రమశిక్షణ, ఏకాగ్రత, స్వరకూర్పు సరిగ్గా అబ్బని 'శహన', సహన వెళ్లే సంగీత కచేరీలకు వంత పాడడానికి సహకరించేది, కానీ స్వంతంగా తానెప్పుడూ కచేరీలు చేసేది కాదు. సహనలో ఎంత ప్రతిభ ఉన్నా, కుటుంబ పరిస్థితులవల్ల చదువులో ముందుకు వెళ్ళలేకపోయింది. తల్లి మరణించిన తర్వాత కుటుంబ భారమంతా సహనపై పడటంవల్ల తాను చదువు మానేసి, క్షేత్రయ్య పదాలపై విశేష ప్రతిభ కలిగిన సహన, చెల్లెలి ఉన్నత చదువుకు అనువైన పరిశోధనాంశంలో పూర్తిగా సహకరిస్తుంది. ఈ కథలో తనకు సంబంధించిన అంశాలన్నింటిని తన చెల్లెలికి త్యాగం చేయటం, క్షేత్రయ్య పదాల మీది పరిశోధనను కూడా తనే చేసి పెట్టడం వంటివి సహనయొక్క నిస్వార్థ బుద్ధిని పేర్కొంటాయి. చెల్లెలికి ఏమీ రాకున్నా అన్నీ తనేచేసిపెట్టడం వంటివి చూసిన బంధు మిత్రులు సహనను ఆత్మీయంగా పలకరించేవారు. అక్క అదృష్టం చెల్లెలికి వరంలా పరిణమించడం, అందులోనూ వారిద్దరు కవలలు కావడం కట్టు బొట్టూ ఒకే తీరుగా ఉండటం వంటివి శహనకు బాగా కలిసొచ్చాయి. కచేరీలకు వెళ్ళినప్పుడు నిర్వాహకులుగానీ, ప్రేక్షకులుగానీ, వీరిని అధ్యాపకులుగా గుర్తించడమేకాక, సమానంగా ఆదరించే వారు. "చిన్నతనం నుంచీ ధనార్జన, పెద్ద పెద్ద స్నేహాలు, పలుకుబడి ఉండడం వల్ల, సహన పెద్ద తరహా జీవితానికి, సదుపాయాలకు అలవాటు పడిపోయింది. ఫస్ట్ క్లాసులో రైలు ప్రయాణాలు, పెద్ద హొటళ్ళలో బస, ఖరీదైన చీరలుకట్టడం, ఉద్యోగంవల్ల, కచేరీలవల్ల, రేడియో ప్రోగ్రాములవల్ల వచ్చిన డబ్బును దుబారాగా ఖర్చుచేయక, ఇంట్లో అవసరాలకు ఇచ్చి అందులో కొంత తనకు కావలసినవి కొనుక్కొని, హాయిగా బ్రతకడం సహనకు ఇష్టం. స్వశక్తిలేని శహనకూడా సహనతో సమానంగా అన్నీ అనుభవిస్తోంది."

సంగీత శాస్త్రంలో అత్యంత ప్రతిభ చూపిన సహనకు ఒక ప్రముఖ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ బిరుదు ప్రదానం చేసినప్పుడు; అక్కపై ఈర్ష్యకలిగిన శహన సహించలేక పోయింది. తనకు దక్కకుండా అక్క సహనకే కీర్తి, గౌరవాలు, పురస్కారాలు, సత్కారాలు లభించడం వంటి వాటిని జీర్ణించుకోలేక పోయింది. చివరకు సహన భర్తను, పిల్లలను సహనకు కాకుండా చేయడానికి ప్రయత్నించింది. కాని శహన అనుసరించిన చెడు ధోరణి, సహన మంచితనం ముందు నిలువలేక పోయింది. చివరగా కథను సుఖాంతం చేసే క్రమంలో వృద్ధాప్యంలో కవలలిద్దరూ ఒకటై హాయిగా కాలం గడిపి, వారి జీవితాలను ముగించునట్లు రచయిత్రి ప్రవేశపెట్టింది. కవలలిద్దరూ తమ జీవితమంతా ఒక క్షణం తీరిక లేకుండా అవిరళ పోరాటం చేసి, చివరికి శాంతియుత జీవనానికి ప్రాముఖ్యత ఇవ్వటం ఈ కథలో కనిపిస్తుంది. "సహన" పిల్లలు అమెరికాలో స్థిరపడటం వల్ల కవలలిద్దరు అమెరికాకు వలస వెళ్ళడం, అక్కడే వీరిద్దరు కలిసి జీవించడం విశేషాంశంగా కథాంతం అమెరికాలోనే ముగుస్తుంది.

*(మిగతాది 54వ పుటలో ...)*

# ఎక్కడ గొట్టో, అక్కడ నట్టు - ఒక పరామర్శ

- యార్లగడ్డ బాలగంగాధర రావు

'ఎక్కడ గొట్టో, అక్కడ నట్టు' అన్న శీర్షికతో డా॥లగడపాటి సంగయ్యగారు ఏప్రిల్ నెల 2011 సంచికలో వ్రాసిన వ్యాసం. దానిపై ఇరువురు పాఠకులు జూన్ 2011 సంచికలో వ్రాసిన లేఖలు చూడటం జరిగింది. ఆ విషయంపై నాదైన స్పందన ఇది. నేను ఈ విషయమై స్పందించక పోదునేమోగాని, సంగయ్యగారు ప్రస్తావించిన విషయాలలో ఒక దాని విషయమై 'తల్లి, ఒడి, కొల్ల, చట్టు' అనే శ్రీనాథుని పదబంధ విషయంలోని 'కొల్ల' శబ్దమే సమమైనదని నిర్ధారిస్తూ, అర్థం విషయంలో నేనేమీ చెప్పనట్లుగాను, నాకు కూడా అది ప్రశ్నార్థకంగానే మిగిలినట్లుగాను వ్రాయటం జరిగింది. అందువలన వ్రాయక తప్పని స్థితి ఏర్పడింది.

డా॥ సంగయ్యగారు ప్రస్తావించి, చర్చించిన విషయాలు అయిదు. 1) తీఅములు 2) కొల్లి 3) భగ్నాశులు 4) పామిడి 5) పెరుగుఁదోటకూర. ఈ అయిదింటిలో పెరుగుఁదోట కూర విషయమై ఆచార్య సముద్రాల వేంకట కృష్ణగారు, పామిడి విషయమై శ్రీ వి.ఎ.కె. రంగారావుగారలు స్పందించి లేఖలు వ్రాశారు. పాఠకులు చదివి వుంటారు. విచిత్ర మేమంటే, తెనుగు అధ్యాపకులు, ఆచార్యులు ఎవరూ స్పందించక పోవటం! సరే! దానికేమి!

పెరుగు తోటకూర విషయమై సంగయ్యగారు ప్రస్తావించిన ఆంధ్రభాషార్ణవం సూచించిన అర్థమే సరియైనది. అంటే–పెరుకు (పీకు) తోటకూర అన్నదే సరియైనది. మనకు బాగా ప్రచురతగా తెలిసిన తోటకూరలు మూడు. 1) పెరుగు తోటకూర 2) కొయ్య తోటకూర 3) ముళ్ళ తోటకూర. ఇందులో ముళ్ళ తోటకూర మొక్క పెరుగు తోటకూర మొక్క వలెనే వుంటుంది. అయితే కాండానికి ముళ్ళు వుంటాయి. కూరగా వండుకొనే విషయం నాకు తెలియనిది. ఇక కొయ్య తోటకూరకు, పెరుగు తోటకూరకు గల సామ్యం తోటకూర అన్నంత వరకే. మొక్కలుగా అంటే జాతిగా వేరైనది. ఇప్పుడు అన్నీ అన్ని కాలాల్లోనూ లభ్యమవుతున్నాయి. కాని వెనుకటి కాలంలో పెరుగు తోటకూర తొలకరి పంటగా జూన్, జూలై, ఆగష్టు, సెప్టెంబరు మాసాల్లోనూ, కొయ్య తోటకూర జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లోనూ విస్తారంగా లభ్యమయ్యేది. ఇందులో పెరుగు తోటకూరకు రాజశాకమని కూడ పేరు. ఇది కొంత ఎత్తుగా పెరుగుతుంది. చిన్న మొక్కలుగా వున్నపుడే అంటే అయిదారు ఆకులతో లేతగా వున్నపుడే సమూలంగా పెరికి శుభ్రం చేసుకుని కూరగా వండుకుంటారు. బాగా పెరిగితే ముదిరిన ఆకులను వదిలేసి కాండాన్ని దుంపను ముక్కలుగా తరిగి పులుసుగా వండుకుంటారు. రెండు సందర్భాల్లోనూ సమూలంగా పెరకటమే తప్ప, పాక్షికంగా విరవటంగాని (కాండాన్ని), ఆకులను మాత్రమే (లేత దశలో) తెంపుకుని ఉపయోగించడం గాని జరుగదు. అలా చేస్తే రెండు సందర్భాల్లోనూ, ఆ మొక్క చాల త్వరగా ముదిరి పోతుంది. ఆ పైన కూరకు పనికిరాదు. ఆకులు తుంచితే, తరువాత వచ్చే ఆకులు చాలా చిన్నవిగా వస్తాయి. రుచిగానూ వుండదు. అందువలన ఆ మొక్కలను సమూలంగా పెరకవలసిందే. పెరికే తోటకూర గనుక వ్యవహారంలో పెరుగు తోటకూర అయింది. అన్నట్లు దీనిలో మూడు రకాలున్నాయి. ఒకటి నలుపు, మరొకటి తెలుపు కాడగా వుంటుంది. మూడవది ఎరుపు.

ఇక కొయ్యతోటకూర విషయం. ఇది కోయు తోటకూర. ఇది కూడ చిన్న మొక్క. నిలువుగా గాక ప్రక్కలకు విస్తరిస్తుంది. ఇది పైపైన కోసిన కొలదీ చిలువలు పలువలు వేసి పెరుగుతుంది. కొంత వాత లక్షణం గలది. పెద్దగా స్వంత

డా. యార్లగడ్డ బాలగంగాధర రావు, ఫోన్ : 9849499169

పెరళ్లలో పెంచరు. వ్యాపారం కొరకు మడులుగా పెంచటం జరుగుతుంది. ప్రస్తుతం రెండూ అమ్మడానికొస్తున్నాయి. జాషువాగారి పద్య సందర్భ విషయమై సంగయ్యగారు ఇచ్చిన వివరణ సరియైనదే. అయితే సముద్రాల వారన్నట్లు అలాంటి సందర్భంలో లోకంలో వాడుక లోనిది 'నేతి బీరకాయ' మాత్రమే. మరి జాషువాగారు క్రొత్తగా ఎందుకు కల్పించినట్లో తెలియరాదు. ఇక్కడ మరో విషయం వివరించాలి. అదేమంటే నేతి బీరకాయలోని 'నేయి' విషయం. అది ఘృతసంబంధమైన నేయి కాదు. అందులో వున్నది నయ్ (నై). వ్యవహారంలో అది నెయ్‌గా వినపడి నెయ్యిగా పరిణమించింది. దాని వివరణకు ఇది చోటు కాదు. మరోసందర్భంలో వివరిస్తాను. కాగా ఈ పెరుగు, కొయ్యతోటకూర విషయమైనా 'మాటతీరు' అన్న పుస్తకంలో వివరించి చాలాకాలమైంది!

'పామిడి తురగపు పాదము' అన్న అన్నమాచార్యుల పదబంధంలోని 'పామిడి' విషయానికివస్తే, అన్నమయ్య చెప్పింది పైవిధంగా తప్ప, సంగయ్యగారు ప్రస్తావించినట్లు తురగపు పామిడి పాదము అని కాదు. పాఠపు స్థితిని యథాతథంగా ఉట్టంకిచాలి తప్ప మార్పు చేయటం తగదు. వి.ఎ.కె.రంగారావుగారు అన్నట్లుగా అక్కడ 'రికాబు' (సంగయ్యగారు సూచించినది)కు ప్రసక్తిలేదు. వారు చెప్పినట్లుగా అక్కడ దశావతారాల ప్రస్తావన లేని మాట కూడా నిజమే; అయితే సముద్రాల లక్ష్మణయ్యగారు చెప్పినట్లుగా రంగారావుగారు వ్రాసిన 'అడ్డమాకలేక' 'ఉద్దవిడి' అన్న భావాలకూ సంగతిలేదు. పదాలకు యోగిక రూఢ్యర్థా లుంటాయి. కొన్ని సందర్భాల్లో వ్యవహారంలో యోగికార్థం వెనుకపడి రూఢ్యర్థం స్థిరమై, అదే ఆ పదపు భావంగా స్థిరపడుతుంది. సందేహం లేదు. అయితే రూఢ్యర్థం కూడా యోగికార్థాన్ని అనుసరించే వుంటుంది, ఉండాలి. ఇక్కడ ముందు చెప్పిన అడ్డమాక లేక, ఉద్దవిడి అన్న భావాల్లో యోగికార్థ స్పర్శ లేదు. ఉన్నదంతా, అంటే భావించి చెప్పినదంతా పదాల పరిసరాల కనుగుణంగా చెప్పినదే. ఆ భావనలే సరియైనవైతే, రంగారావుగారు చూపిన ఇతర రెండు ప్రయోగాల్లోనూ అనువర్తించాలి. కాని అదే లోపించింది. ఇక విషయానికి వస్తే-పామిడి అనే రూపం పాము, ఇడి కలయికల వలన ఏర్పడింది. పాము, పాపమునకు సంక్షిప్త రూపం. భావమేమంటే-కల్మషాలను పోగొట్టే, కల్మషరహితమైన తురగపు పాదము అని చెప్పాలి. అయితే ఆ తురగము ఏది. ఒకటి హయగ్రీవుడు. రెండవది కల్కి. ఇందులో ఏది సరియైనది? ఏదికాదు? ఎందు వలన? అంటే-హయగ్రీవ విషయమై గ్రీవము మాత్రమే హయ సంబంధము. మిగిలిన శరీరము మనుష్యాకృతి. కాని శిరోభాగము తురగము కనుక, మొత్తాన్ని తురగముగా భావించి, తురగపు పాదము అని చెపితే, అపుడు అది హయగ్రీవ అవతారాన్ని సూచిస్తుంది.

అయితే శరీరం మనుష్యాకృతి అయినపుడు పాదము మనుష్యపాదమే అవుతుంది తప్ప తురగపు పాదమనటానికి సంగతి లేదుకదా అంటే, ఆ మాట నిజమేనని అంగీకరించాలి. అప్పుడు అన్నమయ్య భావించినది దేనిని! కల్కి అవతారాన్ని భావించి చెప్పాడా? దానికీ ఒక అభ్యంతరం వుంది. కల్కి సంబళగ్రామంలో విష్ణుయశుని ఇంట జన్మిస్తాడు. ఆయనకు పరమశివుడు ఖడ్గము, తురగాన్ని ఇస్తాడు. దానిపై వచ్చి కల్కి పాపహరణం గావిస్తాడు. ఇదీ విషయం. అంటే-కల్కికి వాహనం తురగమే తప్ప, ఆయన అవతరించేది మానవుని గానే. అయినపుడు తురగపు పాదానికి స్థితి ఎక్కడ అనే ప్రశ్న కలుగుతుంది.

కాని కల్కి పై విధంగా అవతరిస్తాడనేది ఒక భావన మాత్రమే. మరోభావనలో. ఆయన తురగాకృతిలోనే అవతరిస్తాడు. అలాంటి శిల్పాలు కూడా వున్నాయని, తాము చూశామని రంగారావుగారు ఫోనులో చెప్పారు. ఈ రెండూ ఇలా వుండగా హయగ్రీవుడే తిరిగి మూర్త్యంతరంగా, కల్కిగా అవతరిస్తాడని కల్కి పురాణం చెపుతోందని పూర్వగాథాలహరి ఉట్టకింపు. ఏమైనా హయగ్రీవునిగా వేదాలను పూరించినా, కల్కిగా అవతరించి కలిని రూపుమాపినా, రెండు విధాలా వర్తించేది కల్మషహరుడైన విష్ణువే; రెండు సందర్భాల్లోనూ తురగానికి సంగతి వుంది. కల్కి తురగపు రూపులో అవతరిస్తాడన్నది నిజమైతే (శిల్పంరీత్యా కూడా అది నిజమేగదా.) అక్కడ అన్నమయ్య ఉద్దేశించింది కల్కి అన్న భావాన్నే అని భావించాలి. లేదంటే హయగ్రీవునిగా భావించాలి. ఏమైనా 'పామిడి' అంటే కల్మషహరము, పాపహరణము అనేది ఆ పదానికి యోగికార్థాలు, మిగిలిన రెండు ప్రయోగాల విషయానికి వస్తే-పామిడి కోరికలకు అన్న చోట పాపపూరితమైన కోరికలకు బంటులైన అని, పామిడి గొల్లెతలందే అన్న చోట కల్లాకపటం లేని గొల్లెతలందు అని చెప్పుకోవాలి. ఇక్కడ ఒక అనుమానం వస్తుంది. పామిడి కోరికలు అన్నచోట లేని అనే అర్థంగాక, కలిగిన, వున్న అనే

అర్థం కూడా వస్తుంది కదా అనేది. ఆ అనుమానం నిజమే. 'ఇడి' సాధారణంగా లోపాన్ని బోధిస్తుంది. కాని ఉన్న కలిగిన అనే అర్థాలనూ ఇస్తుంది. చప్పిడి లోని భావాన్ని భావించండి. ఇంకా చాలా వున్నాయి. తొక్కిడి, ఒచ్చిడి, తిక్కిడ. అలాగే 'అతి కూడా. మహాభారతంలో కలిగిన, లేని అనే రెండు భావాల్లోనూ ప్రయుక్తం గావింపబడింది. ఇప్పటి కిపుడు ఉదాహరణలు ఇవ్వలేను. మన్నించాలి.

ఇక 'తల్లి ఒడి కొల్లి చట్టు' విషయం. ఇందలి చట్టులోని 'చ' దంత్యం అంటే శిష్యుడు, విద్యార్థి అని అర్థాలు. తిక్కన గారి ప్రయోగాన్ని గమనించండి. ఈ పదబంధం సంగయ్యగారు భీమేశ్వరపురాణంలోని దిగా పొరబడ్డారు. కాని కాశీఖండంలోనిది. అవును! 'కొల్లి' అనేదే సరియైనది. ఒల్లి కాదు. ఒల్లి నిఘంటువుల్లో లేక పోయినా వ్యవహారంలో లేకపోలేదు. ఒల్లియ వుంది గదా! శ్రీనాథుని ప్రయోగం కూడా వుంది. హర విలాసంలో గమనించండి. అదే ఒల్లెవాటు, ఒలివాటు. ఆడపిల్లలు వేసుకునే ఓణీ అదే. దానినే వల్లెవాటుగా వ్యవహరించటం పరిపాటి. య,ర,ల,వలు అంతస్థాలు. స్వతంత్ర వర్ణాలు కూడా. అంతస్థాలైనపుడు వాటి పూర్వ రూపాలు ఎ,ఋ, ఒ లు అని తెలిసిందే. ఋ, లు ర, ల తుల్యంబులనిగదా వ్యాకరణ సూత్రం. అది అలా వుంచండి.

విషయానికి వస్తే – అక్కడ 'కొల్లి'ని 'గొల్లి'గా చదవాలి. గొల్లిగాడు అంటే కుమారుడు. కాని ఆ పదం నిందార్థంలోనే ఎక్కువ వాడుక కలిగి వుంది. దానిని పరిహరించడానికి (నిందోచ్చారణను) గాని, లేదా 15వ శతాబ్దాల వరకు సరళాలకు బదులు పరుషాలు వ్రాయటం సంప్రదాయంగా వున్న కారణంగా గాని అక్కడ 'క' కారంబదులు పరుషాలు వ్రాయటం సంప్రదాయంగా వున్న ఏకారణంగా గానిఅక్కడ 'క' కారంమే (కొ) ప్రయుక్తమైంది. పాఠ భేదం లేకపోవటం కూడా గమనార్హం. అర్థాన్ని చెప్పలేక పాఠాన్ని మార్చరాదు అన్నది ప్రాథమిక నియమం. మొత్తం మీద ఆ పదబంధ భావం తల్లిగారు (గుణనిధి తల్లి) ఉపాధ్యాయురాలు. కొల్లి (కుమారుడు, గుణనిధి) శిష్యుడు విద్యార్థి. అతడు సోమిదమ్మకు (గుణ నిధి తల్లి) గొడ్డు వీగి కన్న బిడ్డకు గారాబం ఎక్కువ. ఆ కారణంగా శిక్షింపలేని బేలతనం. ఇంక క్రమశిక్షణ ఎలా అబ్బుతుంది గనుక. దానితో వింతేముంది అని లోకులు అనుకుంటారు. నన్నే నిందిస్తారు నాయనా అని కొడుకుతో తల్లి అనటం సందర్భం. ఈ విషయం 15 ఏండ్ల క్రితమే కాశీఖండానికి వ్యాఖ్య వ్రాసిన మల్లంపల్లి శరభయ్య శర్మగారితో తిరుపతి అన్నమయ్య కళామండపంలో అక్కిరెడ్డి, మేడసాని మోహన్, సర్వోత్తమరావు, నాయని కృష్ణకుమారి, టి. నిర్మల సమక్షంలో చర్చించి చెప్పటం జరిగింది. ఆ పిదప రెండేండ్లకు నాగభైరవ కోటేశ్వరరావుగారు అడుగగా చెప్పటం జరిగింది. ఇప్పటికి మూడేండ్లకు ముందు నా 'భావ పరిమళం' అన్న పుస్తకంలో వివరించటం జరిగింది. మరి నేను అర్థం నిర్ధారించలేదని సంగయ్యగారు ఎలా పొరబడ్డారో తెలియరాదు.

తీఱముల విషయానికి వస్తే, సంగయ్యగారు పూర్వ వ్యాఖ్యాతల లోపాన్ని బాగానే గమనించారు. అయితే వారు చెప్పినట్లుగా 'తీఱమి' పదంపై బహువచనం చేసుకొని 'తీఱములు' సాధించటం కూడా కూడదు. కార్యములు తీఱమి అనటం సహజం తప్ప. తీఱముల కార్యములు, కార్యముల తీఱములు అనటం కుదరదు. పూర్వ వ్యాఖ్యాతులు ఆ సందర్భంలో సాధురేఫతో 'తీరములు' అని గ్రహించటానికి గాని, సంగయ్యగారు 'తీఱమి' పై బహువచనం చేర్చి 'తీఱములు' సాధించటానికి గాని మూలకారణం, 'తీఱము' అనే పదాన్ని నిఘంటు కర్తలు గ్రహింపక పోవటం. నిఘంటువులు 'తీఱు' పదాన్ని మాత్రమే గ్రహించాయి. అందువలన ఈ ఇబ్బంది తలెత్తింది. మరి నన్నయగారి ప్రయోగాన్ని నిఘంటు కర్తలు ఎందుకు గ్రహించలేదో తెలియరాదు. తీఱు శబ్దానికి అర్థాలు స్పష్టమే. అందులో ఒకటి అవకాశము లేదా వీలు. అవకాశము లేదు, వీలు లేదు అనే భావాల్లో 'తీఱదు' అని గదా అనాలి. కాని కాశీఖండంలో గుణనిధి కథలోనే 'తీరదిప్పుడు పెట్టి శోధించి చూడ' అనే చోట సాధురేఫనే ప్రయోగించటం గమనార్హం. మొత్తం మీద 'తీఱ' శబ్దం వ్యస్తంగా నన్నయగారి ప్రయోగం తప్ప కనుపింపదు. పోనీ అది కూడా సాధురేఫతో 'తీర' అనుకుందామంటే, అన్ని ప్రచురణల్లోనూ శకటరేఫలోనే కనుపిస్తోంది. కాని వ్యవహారంలో 'తీఱా' వుంది. కొన్ని కారణాల వలన ఒక చోటికి వెళ్ళవద్దనుకున్నాము. లేదా ఒక పని చేద్దామనుకోలేదు. కారణం ఉపయోగం లేదనే భావంతో. కాని ఇతరులు చెప్పటం వల్లనో, మనకే అనిపించో వెళ్ళాము, చేశాము, కాని ఫలితం కలుగలేదు. అలాంటి సందర్భంలో తీరా వెళ్ళాక తీరా చేశాక కూడా అది సాధ్యపడింది కాదు అంటాము. అంటే అక్కడ ఆ పదం నిర్ణయం నిశ్చయం అనే

భావాన్ని ఇస్తోంది. నన్నయగారు ఆ భావంతో ఉపయోగించినట్లు అనిపిస్తోంది అక్కడి పాఠం ఎట్టి ఘట్టములను, నెట్టి యాపదలను, నెట్టి 'తీఱములను' అని గదా. అవి ముట్టబడిన వంతలెల్లఁబ్రాయు నింతుల ప్రబల నొనరచూడఁగనిన జనుల కెందు అనిగదా శకుంతల అంటున్నది. అంటే ఎట్టి ఘట్టములను, ఎలాంటి అవాంఛనీయ పరిస్థితుల్లోనూ, వాటి బ్రతుకులో ఎన్ని తిరుగుళ్లు పడినా, ఎట్టి ఆపదలను, ఎలాంటి దురదృష్టకర పరిస్థితుల్లో చిక్కుకున్నా, ఎట్టి తీఱములను ఎలాంటి సరిపడని నిర్ణయాలు చేసుకున్నా అలాంటి వాటిచే ముట్టబడిన సమతమతవుతున్న పరిస్థితుల్లో వంతలెల్ల; మనసుకు పట్టిన దిగుళ్లు, కలతలు అన్నీ ఇంతుల ప్రజల నొనరఁజూడ గనిన జనులకు భార్యాబిడ్డలనుచూసిన, చూస్తే, ఆ దిగుళ్ళన్నీ, కలతలన్నీ వదలి పోతాయి, సుమా అనేది శకుంతల చెప్తున్న మాటలోని భావం. అంతేతప్ప కష్టాన్నీ పరిష్కారమవుతాయని గాని, అసాధ్యములైనవన్నీ సాధ్యము లవుతాయనిగాని కాదు. తత్కాలీన మానసిక వైకల్యంనుండి ఉపశమనం కలుగుతుంది. భార్యాబిడ్డలను చూసినపుడు అని ఫలితార్థము ఇంతకంటే మేలైన భావాన్ని ఎవరైనా సూచించగలిగితే నేను ధన్యుణ్ణి.

ఇక 'భగ్నాశుల' విషయానికి వస్తే భగ్నములైన ఆశలు గలవారై ఈర్ష్యతో నన్నుం గర్షకపాపక్షపాతియని నిందా వాక్యముల్పల్కరే అని చెప్పుటమే సరియైనది. హాలికుని తలచుకున్నంతనే దువ్వూరి రామిరెడ్డిగారి హృదయం స్పందించి, అతడి జీవితాన్ని వర్ణించటానికి సమాయత్తమై ఆయన కవిత్వధారయే కొన్ని నిర్ఝరసారవేగమున వాక్పూరంబు మాధుర్య సంపన్నమై ప్రవహిస్తుంది. అలా చెప్పలేక, శక్తి చాలక ఆశలువమ్ము అయినవారై ఆయన కర్షక పక్షపాతి గనుక అలా చెపుతున్నాడు ఈర్ష్యతో అంటారు గాక అని రామిరెడ్డి గారి భావం. అంతే తప్ప వేగంగా కవిత్వం చెప్పటంలో విఫలురై అని చెప్పటం కుదరదు. ఆశగలవారిని ఆశులు అనటం వ్యవహారంలో లేకపోయినా కవిత్వంలో ఒప్పే అవుతుంది. కవిత్వా సంబంధమైన 'ఆశు' అన్నమాట విశేషణమే అవుతుంది తప్ప విశేష్యము కాదు.

## కర్ణాట కిరాట...

**కొం**డవీటిని పాలించిన ప్రభువుల్లో కుమార గిరిరెడ్డి ఒకరు. ఆయనపేరులోని కుమారగిరి త్రిపురాంతకాన్ని సూచిస్తుంది. త్రిపురాంతకమే కుమారగిరిగా శాసనాల్లో చెప్పబడింది. త్రిపుర శబ్దమే తిప్పగామరి వ్యవహారాల్లో తిప్పయ అయింది. అవచి తిప్పయశెట్టికి పేరు అలా వచ్చిందే.

పోతన 'బాలరసాలసాల' అన్న పద్యంలో తన కావ్యకన్యకను కర్ణాట కిరాట కీచకులకు అమ్మనని గదా చెప్పాడు. ఎవరీ కర్ణాట కిరాటుడు? కిరాట అంటే వైశ్యుడు. కిరాణా పదం అలా వచ్చిందే. కర్ణాటక మంటే, తూర్పుతీరం. అక్కడి కిరాటుడు అవచి తిప్పయశెట్టి. ఈయన తండ్రి పాకాల రేవు పట్టణం నుండి సముద్రంపై వ్యాపారంసాగించాడు. శ్రీనాథుడు, అవచి తిప్పయశెట్టి స్నేహితులు. పెదకోమటి కామారెడ్డికి కొండవీటి రాజ్యాన్ని సంక్రమింపజేసే కార్యంలో, మామిడి సింగన మాటపై అప్పటికి వ్యాపారం సోదరులకు కొడుకులకు అప్పచెప్పి కంచిలోవుంటున్న తిప్పయ వద్దకు శ్రీనాథుడు రాచకార్యంపై వెళ్లాడు. రాచకార్యం ఏమంటే, విజయనగర రాయల వంశస్థులు కొండవీడు విషయంలో జోక్యం చేసుకోకుండా వుండటం. ఆ పని చేయించగలిగేది అవచి తిప్పయ మాత్రమే. అందువలన ఆయన సాయం పొందటానికి శ్రీనాథుడు కంచికి వెళ్లాడు. అలా వెళ్లిన సందర్భంలో తిప్పయ శ్రీనాథునికోరి హరవిలాసం చెప్పించుకుని అంకితం పొందాడు. దానిని ప్రస్తావిస్తున్నాడు పోతన. తాను అలాంటి పనిచేయనన్నాడు. తిప్పయ ఇంటిపేరు అవచి. గ్రామనామం కంచికి దగ్గరలో ఉంది. ఇప్పటి ఎ.వి.యం సినిమా సంస్థవారు తిప్పయ వంశీకులే. అందులోని 'ఎ' అవచినే సూచిస్తుంది.

**- యార్ల గెడ్డ బాల గంగాధర రావు**



# వీణల నరసయ్య

- జి.వి.ఆర్.కె. సుబ్బరాయమూర్తి

సంగీత రంగంలో వాద్య విద్వాంసుల పేర్లే మనకు తెలుసు. కానీ ఆ పరికరాలను ఎవరు తయారు చేశారో మాత్రం తెలియదు. వారు 'రాళ్లెత్తినకూలీలు'గానే మిగిలిపోతున్నారు. కానీ వారికి కూడా సంగీత పరిజ్ఞానం తప్పనిసరి. అలాంటి నిపుణులలో ఒకరు 'వీణల' నరసయ్య. ఆంధ్రదేశంలో వీణల తయారీ కేంద్రాలు రెండే. మొదటిది, బొబ్బిలికాగా రెండవది కృష్ణాజిల్లాలోని నూజివీడు. అనుకోకుండా వీణల తయారీలో ప్రవేశించి ప్రతిభను చూపారు నరసయ్య.

ఏ కాలములోనో మహారాష్ట్ర దేశం నుంచి తెలుగు ప్రాంతాలకు కొన్ని కుటుంబాలు వలస వచ్చి స్థిరపడ్డాయి. వడ్రంగంపై నగిషీ వీరి ప్రత్యేకత. దక్షిణ కోస్తా, రాయల సీమలోని కొన్ని ప్రాంతాల్లో ఈ కుటుంబాలు చెదురు మదురుగా ఉన్నాయి. ఆ ప్రాంతం నుంచి వచ్చారు కనుక 'మరాటీ' లని స్థానిక వ్యవహారం. అదే క్రమంగా 'వరాటి'గా రూపాంతరం చెంది ఇంటి పేరయింది. భుక్తికోసం వలస వచ్చిన 'వరాటి'వారు ఇక్కడ రాజాశ్రయంతో స్థిరపడ్డారు. ఆ వంశంలో 19వ శతాబ్ది చివరలో వరాటి వీరయ్య అని ఒకరుండేవారు. గృహ నిర్మాణమేగాక, కళాత్మకంగా గృహోపకరణాలు, దేవాలయ వాస్తు రీత్యా 'దారుకర్మ' నిర్వహిస్తుండే వారు. ఇవిగాక చిత్రకళలో కూడా సిద్ధహస్తులు. అందులో హస్త సాముద్రికాన్ని ఉపయోగించేవారు. హస్త రేఖలను బట్టి మనిషి స్వరూపాన్ని ఊహించవచ్చునట. ఈ పద్ధతి దివాణాల్లో రాణివాసం వారి బొమ్మలలో రూపకల్పనకు పనికొచ్చింది. వారికి ఘోషా గనుక తెరవెనుక నిలబడి అరచేతిని బయటకు పెడితే ఆ సైజును బట్టి, హస్త రేఖలను చూచి సరిగ్గా బొమ్మ వేయగలిగేవారట. అన్ని రకాలుగా ప్రజ్ఞావంతుడాయన.

ఈ వీరయ్య పెద్ద కుమారుడు పెద్ద నరసయ్య. జననం 1890 ప్రాంతం. సామాన్య విద్యాభ్యాసంతోపాటు తండ్రికి పనిలో సాయం. ఈ నేపథ్యంలో అప్పటి తేలప్రోలు రాజా మేకా శోభనాద్రి అప్పారావుగారి దివాణంలోని సాంకేతిక విభాగంలో 15వ ఏటనే ఉద్యోగంలో చేరారు. అక్కడ పని చేస్తుండగా బొబ్బిలి నుంచి వచ్చిన ఒక వీణను ఈయనకు చూపించి ఇలా నీవు తయారు చేయగలవా? అని రాజావారు అడిగితే తండ్రి పర్యవేక్షణలో టేకుతో నమూనాగా ఒక వీణను తయారు చేశారట. దానిని ఆస్థాన విద్వాంసులైన ఇంద్రగంటి విశ్వనాథ శాస్త్రి ఆమోదించారు. అలా సుమారు ఒక శతాబ్దం క్రింతం నూజివీడులో వీణ రూపకల్పన జరిగిందనుకోవచ్చు. ఆనాడు అలా ఆయన తయారు చేసిన ఆ వీణను వారి వారసులు భద్రపరచుకొని ఇంకాసాధన చేసుకుంటూనే వున్నారు.

కర్ణాటక సంగీతంలో పరిపూర్ణ వాద్యమైన వీణ తయారీలో క్లిష్టత ఉన్నా దానికే మొగ్గుచూపారు. మొదట అందుబాటులో వున్న టేకుతో చేసినా, ఆ తరువాత నుంచి పనసకర్రనే వాడారు. దానిలోని సూక్ష్మ రంధ్రాలవల్ల మంచి నాదం వస్తుంది. గోదావరి జిల్లాల నుంచి తెప్పించిన పనసకర్రను కావలసిన సైజులలో కోయించి వీణ తయారైనాక చుట్టూ ఏనుగుదంతంతో అంచు కట్టేవారు. మెట్లను బందరులో కంచు, ఇత్తడి, సీసముల మిశ్రమంతో తయారు చేయించే వారు. తీగలను మద్రాసు, కలకత్తా నుంచి తెప్పించేవారు.

జి.వి.ఆర్.కె. సుబ్బరాయమూర్తి, ఫోన్ : 9395147353

'దండి' 'కుండ'–'పనస' చెక్కతోనూ, తీగలను అమర్చటానికి కంచు ప్లేటు బిగించిన 'రోజ్‌వుడ్'తో చేసిన పీట, బిరడాలను తయారు చేసేవారు. సింహ తలాటం క్రింది వైపున బాగా ముదిరి ఎండిన సొరకాయ బుర్రను అమర్చేవారు. ఇది నాదాన్ని పెంచుతుంది. నగిషీ చెక్కడంతోపాటు సింహ తలాటం, వీలున్న ప్రతిచోట బంగారు, వెండి కట్లు, రంగుల విన్యాసం ఇలా వీణను చూచిన వారెవరూ వదిలి పెట్టలేనంత ఆకర్షణ కల్పించేవారు. వీరి నైపుణ్యాన్ని గ్రహించిన రాజావారు బాగా మెళకువలు నేర్చుకోవడానికి తంజావూరు కూడా పంపారు. బొబ్బిలికి కూడా వీరు వీణలను పంపేవారు. అదో గౌరవం. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు కూడా సరఫరా జరిగేది. అలా ఈయనతోపాటు ఊరికీ ప్రచారం లభించింది. శిష్య పరంపరవల్ల ఆ వృత్తి నిరుత్సాహ పరిస్థితులున్నా కొనసాగుతూనే ఉంది. ఈ ప్రాంతంలో కళాత్మకంగా దేవాలయాలకు తయారైన సామగ్రి ఇతర గృహోపకరణాలూ ఇంకా ఆయన గుర్తుగా ఉన్నాయి.

చిత్రలేఖనంలో కూడా అసాధారణ ప్రతిభను చూపారు. ఆ కాలములో తైలవర్ణ చిత్రాలే వాడుకలో ఉండేవి. యం.ఆర్. అప్పారావు తండ్రి అయిన ఉయ్యూరు రాజా మేకా వెంకటాద్రి అప్పారావు కూడా చిత్రలేఖనంలో నిపుణులే. ఆ రంగంలో వీరి సలహాను కూడా తీసుకునేవారట.

ఇన్ని విధాలుగా నైపుణ్యంగల వీరు కొంత గ్రంథ రచనకు పూనుకున్నారు. నిర్మాణ రంగంలో ఉండే వారికి వాస్తు, ఆగమ శాస్త్రాలు తెలియాలి. ఆ వృత్తుల వారి కోసం వాస్తు శాస్త్ర పరిచయ గ్రంథాన్ని కూడా క్లుప్తంగా వ్రాశారు. ప్రాథమిక స్థాయి వరకే చదువుకున్నా ఇంగ్లీషులో కూడా అద్భుతమైన దస్తూరీ, ఒక సంవత్సరము రిపబ్లిక్ డే సందర్భముగా కళాకారులూ, శిల్పులూ సమాజం యొక్క ఆస్తి కనుక వారిని తగు విధంగా పోషించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అనే సందేశాన్ని ఇచ్చారు. ప్రభుత్వము నుంచి కూడా తగు గుర్తింపు లభించింది. ఇన్ని అవకాశాలు, ఇంత నైపుణ్యం ఉన్నప్పుడు బాగా సంపాదించి ఉండాలి. కానీ ఈయన అందరిలాగానే సామాన్య జీవితాన్నే గడిపారు. ధనార్జనకు ప్రాధాన్యతనివ్వలేదు. బహు కుటుంబీకుడు అలా 96 సంవత్సరముల పాటు ప్రయోజనకరమైన జీవితాన్ని గడిపి 1986లో గతించారు. ఈయన కుమారులు కూడా ఇతర రంగాలలో స్థిరపడినా ఈ విద్యను మరచిపోలేదు.

కనుక విద్వాంసులతోపాటు తయారీ నిపుణులను కూడా గుర్తించి గౌరవించడం సంగీతాభిమానుల కర్తవ్యం.

*(ఈ వ్యాసానికి వారి కుమారుడు వరాటి రాధాకృష్ణగారు అందించిన సమాచారం ఆధారంగా)*

---

## అవసరాల అనసూయాదేవి సంగీతం, సాహిత్యం

*49వ పుట తరువాయి...*

పూర్తిగా భారతీయ వాతావరణం కలిగిన కథ ఇది. భారతీయ జీవన విధానం, భారతీయ సంగీత శాస్త్ర పరిజ్ఞానం ఈ కథలో అడుగడుగునా కనిపిస్తాయి. అనసూయాదేవి సంగీతశాస్త్ర విషయాలను, వాటి రాగాలను, స్వరగతులను సందర్భాను సారంగా విశేషంగా పేర్కొన్నది. అనేక రాగాలతో కూడిన సంకీర్తనలను సహన పాత్రలో పరిచయం చేసింది. భారతీయ సంగీతంలో కర్నాటక సంగీతానికిగల ప్రాముఖ్యతను తెలియజేసింది. కర్నాటక సంగీతంలోని త్యాగరాజ కృతుల పరిచయం ఈ కథలో విశేషంగా కనిపిస్తుంది. ప్రవాసాంధ్రురాలైన అనసూయాదేవి అమెరికా ప్రజలకు భారతీయ సంస్కృతిని, విలువలను తెలియ జెప్పడానికి కథాసాహిత్యాన్ని ఒక సాధనంగా వినియోగించు కొన్నారని చెప్పవచ్చు. రచయిత్రి సంగీతశాస్త్రంలో ప్రవీణురాలు కావడంవల్ల చాలా కథల్లో సంగీత ప్రధానమైన వస్తువును ప్రతిబింబింప జేసింది.

భారతీయ సంప్రదాయానికి ప్రతీకగా సహనను నిల్పటం, తల్లి మరణానంతరం కుటుంబ బాధ్యతను మోయటం, కుటుంబ భారంలో తండ్రితోపాటు తాను పాలుపంచుకోవడం, చెల్లెలిని అనురాగంతో చూడటం, అణుకువ, ఓర్పు, మాటనేర్పరితనం వంటి మంచి లక్షణాలన్నింటిని పుణికిపుచ్చుకోవటం వంటివి రచయిత్రి పాత్ర సృష్టిలో చూపిన ప్రతిభకు తార్కాణం. మంచి పేరుకు, తగిన గుర్తింపు గౌరవం; బిరుదుల రూపంలో, సత్కారాలలో, సన్మానాలలో చూపటం వంటివి భారతీయ సంస్కృతికి నిదర్శనం. తెలుగువారి జీవనవిధానాన్ని అద్దంలో చూపినట్లుగా అనసూయాదేవి రచించిన రెండు గ్రంథాలు ఆమె కళాప్రతిభకు, రచనా కౌశలానికి, సృజనాత్మక ఒరవడికి, తెలుగు నుడికారానికి నిదర్శనంగా నిలిచాయి.

# ఆదరణ లేని దొమ్మరాట కళాకారులు

- డి.కె. ప్రభాకర్

మంత్రాలు, తంత్రాలు, యంత్రాలలో మునిగితేలే వారికి ఆటలు, వినోదాలు కొంత విడుపును ఇస్తాయి. ఒక విధంగా సాంఘికాచారాలలో లౌకికమైనవి ఆటలు, వినోదాలే. మిగిలినవన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నమ్మకాలకు, మతాచారాలకు శక్తులకు సంబంధించినవే.



మానవుని సాంఘిక జీవితానికి, ఆటలకు తరతరాల నుండి అవినాభావ సంబంధం ఉంది. ఎందుకంటే ప్రాచీన మానవుడు అడవిలో క్రూరమృగాలతో పోరాడవలసి వచ్చినపుడు ఆత్మరక్షణగా భుజబలాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉండేది. విలువిద్య లాంటి విద్యలు నాటి మానవ జీవితావసరాలై రానురాను క్రీడలుగా పరిణమించాయని విద్వాంసుల అభిప్రాయం. ఆటలన్నీ చాలా వరకు వినోదం కోసం ఏర్పడ్డవే. అయితే వినోదాలన్నీ ఆటలు కావు.

సంచార జాతులుగా పరిసరాల మధ్యనే జీవిస్తూ అడవులలో ఉండే క్రూరమృగాలతో పోరాడి, ఆత్మరక్షణ కోసం తమ భుజబలాన్ని ప్రదర్శిస్తూ అనేక విద్యలలో ఆరితేరిన వారు దొమ్మర కులస్థులు. వీరికి ఆట-పాటలు సహజ సిద్ధంగానే అలవడ్డాయి. కాలాంతరంలో తమ జీవనోపాధికై జనావాసాల దగ్గర బయలు ప్రదేశాలలో కొన్ని ఆటలను-విన్యాసాలను ప్రదర్శించి, ప్రజలను ఆకట్టుకొని, వారిచ్చే ధాన్యము, డబ్బు మరియు ఇనాములతో కాలం గడుపుతూ వచ్చిన వారు దొమ్మరులు. దొమ్మరాట అతి ప్రాచీన జానపద ప్రదర్శన కళ. ఇది కేవలం ప్రదర్శన కళ అంటేనే సరిపోదు. ధైర్యసాహసాలతో కూడిన విన్యాస నైపుణ్యం గల ప్రదర్శన ఆట. అందుకే విశిష్ట కళగా ముద్రవేసుకుంది. ఈ కళ తరతరాల నుండి కులవృత్తిగా కొనసాగుతూ వస్తుంది. దొమ్మర కులస్థులు వృత్తిరీత్యా ఈ ప్రదర్శన కళను జీవనోపాధిగా పెట్టుకోవడం వలన "దొమ్మరాట" అనే పేరు వచ్చింది. దొమ్మరాటలో సంభాషణ, అభినయం, సంగీతం, నృత్యం మిళితమై ఉంటుంది.

దొమ్మరాట గురించి అనేక మంది పరిశోధకులు అధ్యయనాలు చేసి తమ సిద్ధాంత గ్రంథాలలోనూ, వ్యాసాలలోనూ కొంత వరకు నిక్షిప్తం చేసిపెట్టారు. దీనివల్ల కేవలం దొమ్మరాట విన్యాసాల గురించే కాకుండా సాహిత్యం, వేషధారణ, సంభాషణ, సంగీతం, వాద్యాలు తెలుస్తాయి. దీంతోపాటు వాళ్ళ జీవన విధానం మరియు సంస్కృతి గురించి కొంత వరకు తెలుస్తోంది.

దొమ్మరాట 13వ శతాబ్దం నాటికే ఉన్నట్లు, ఆ శతాబ్దానికి చెందిన శ్రీ పాల్కుర్కి సోమనాథుడు రచించిన "పండితారాధ్య చరిత్ర" పర్వత ప్రకరణలో-

డా॥ డి. కె. ప్రభాకర్, ఫోన్ : 09949903261

**"అమరాంగనలు దివినాడెడు మాడ్కి**
**నమరంగ గడలపై నాడెడు వారు"**
అంటూ వర్ణన కనిపిస్తోంది.



పై రెండు పాదముల వర్ణనలో దొమ్మర యువతులు వెదురు గడలపైన ఆకాశంలో అప్సరసలు ఆడుతున్నారన్నంత భ్రమను కలిగించేవారట. అంటే వారు ఉపయోగించే వెదురు గడలు అంత పొడవైనవన్నమాట.

దొమ్మర యువతులు పురుషులతోపాటు భూమి మీద వివిధ రకాల పిల్లిమొగ్గలు మొదలైన చిత్రవిచిత్ర ప్రదర్శనలతో ప్రేక్షకుల్ని దిగ్భ్రమలో ముంచేవారు. చూసే వారికి ఈ ఆటలు భయాన్ని కలిగించేవి. వారి ఆటలు పాతిన గడమీదనే కాక, వెదురుగడను పురుషులు రొమ్ముమీద, నొసటి మీద నిలబెట్టి ఆ గడలపై దొమ్మర యువతులతో తమ తమ విద్యల్ని ప్రదర్శింపజేసేవారు.

దొమ్మరాటను శ్రీహర్షుడు సంస్కృత నైషథంలో అలంకారికంగా వర్ణించినట్లు శ్రీనాథుడు, శృంగార నైషథంలో ఈ విధంగా వర్ణించాడు.

**గడసాని గరిడీలు :**

**ఈ సకలావనీ తలము వెక్కటిదాన పరిభ్రమించి, య**
**భ్యాస పరంపరాపరత్ నభ్రమునన్ విహరింపగోరి యో**
**లాసిక కీర్తి విభ్రమ కలాగరిమ న్నటియంచుచుండు నీ**
**రాసుతు వంశరత్నము దిరంబుగ జెంది యమంద లీలలన్**

*(శృంగార నైషధం, 5 ఆశ్వా., పుట 18)*

అలాగే

**సంత నెన్నడో జవ్వన మమ్ము**
**కొన్న గడసాని ననుంగవ యందలంచీతే**

అని ఊర్వశి పేర్కొన్న గడసాని ఇటువంటిదే అని నాచన సోముని ఉత్తర హరివంశం 1-7 పద్యంలో ఉదహరించ బడిందని పి.ఎస్.ఆర్. అప్పారావు గారు సూత్రధారి పత్రికలో ఉదహరించారు.

విజయనగర రాజుల కాలంలో మహర్నవమి ఉత్సవాలలో దొమ్మరులతో క్రూరమృగాలతో సర్కస్ చేయించే వారని అబ్దుల్ రజాక్ అనే విదేశీ యాత్రికుడు వర్ణించినట్లు భావరాజు కృష్ణారావు గారు ''విదేశీ యాత్రికులు -ప్రాచీనాంధ్ర దేశం''లో పుటలు 191-192లలో ఉదహరించారు. అంతేగాక బాపల విద్యలేవీ కూడా దొమ్మర విద్యలతో సరిపోవని చంద్రశేఖరుడు తన శతకంలో ఈ విధంగా వర్ణించాడు.

**మెడ్డుగ దొమ్మరెక్క, గన**
**మించిన యిద్దమరేడలేదు, నా**
**తెడ్డొక బాప విద్దెలని**
**తిట్టును మూర్ఖుడు చంద్రశేఖరా !**

అలాగే కాకతీయుల కాలంలో కూడా దొమ్మరాటకు మంచి ఆదరణ ఉండేదని తెలుస్తుంది.

దొమ్మరాట గురించి మరియు వారి జీవన విధానం గురించి ఇ. థర్‌స్టన్, అబిడ్, మద్రాస్ సెన్సస్ రిపోర్టు 1891, 1901ల గ్రంథాలలో వివరించారు. ప్రొ॥ ఎం.నాగభూషణ శర్మ రచించిన "Folk performing Arts of Andhra Pradesh" లోనూ, నేదునూరి గంగాధరం "జానపద విజ్ఞాన వ్యాసాలు" లోనూ, డా॥మిక్కిలి నేని రాధాకృష్ణ మూర్తి గారి "తెలుగు వారి జానపద కళల" లోనూ, ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి గారు తన "జానపద నృత్య కళారూపాలు" అనే సిద్ధాంత గ్రంథంలో, పగటి వేషాలలోనూ మొదలైన గ్రంథాలలో దొమ్మరాట గురించిన ప్రస్తావన ఉంది.

ఈ విధంగా దొమ్మరాటలు చరిత్రలో వాటికి స్థానాన్ని ఏర్పరచుకున్నాయి. ఈనాడు పెద్ద పెద్ద సర్కసులని చెప్పుకోబడే వాటికి ఆధారం ఆనాటి దొమ్మరాటలేనని ఖచ్చితంగా

చెప్పవచ్చును. రాజాస్థానాల ముందు విన్యాసాలని ప్రదర్శించి రాజులచే బహుమతిని పొందేవారని కూడా తెలియ వస్తుంది.

దొమ్మరాట అత్యంత సాహసవంతమైన విద్య. గ్రామంలోకి ప్రవేశించేటప్పుడు వీరి దగ్గర కత్తులు, డప్పులు (డోలు), ఇనప రింగులు, తాళ్ళు, చెంబులు, గిన్నెలు, వెదురు గడలు మొదలైన వాటిని వీరితో పాటు తీసుకెళ్తారు. దొమ్మరాట ఆడే ప్రదేశాన్ని నిర్ణయించుకొన్నాక ఆ ఊరి పెద్ద/నాయకుడి అనుమతిని పొందిన పిమ్మట ఆ ఊరు మరియు చుట్టుప్రక్కల ఉన్న ఊళ్ళలో చాటింపు (దండోరా) వేయించే వారు. దొమ్మరాట ఆడటానికి ప్రత్యేకమైన రంగస్థలమేమి అవసరమయ్యేది కాదు. ఎందుకంటే వీరంతా గ్రామ కూడలిలోనో, చావిడి దగ్గరో లేక విశాలమైన బయలు ప్రదేశం ఉన్న చోటనో లేక ఊరికి దగ్గర చెరువు వున్నచో, చెరువు మధ్యలో ప్రదర్శన ఏర్పాటు చేసేవాళ్ళు. దొమ్మరాట ఆడే ముందు తమ విద్యను ప్రదర్శించేందుకు వినియోగించే వస్తువులకు మ్రొక్కిన తర్వాతనే ఆటను మొదలు పెట్టేవారు. దొమ్మరాట ఆడేటప్పుడు వస్త్రాలంకరణ విషయంలో ప్రత్యేకమైన వస్త్రాలను కానీ, ఆభరణాలను కానీ ధరించేవారు కాదు. అయితే కొద్దిగా బిగుతైన వస్త్రాలను ధరించేవారు. లేక చీరను గానీ పంచను గాని "గోచి" మాదిరి కట్టుకునే వాళ్ళు.

దొమ్మరాటను బాగా తర్ఫీదు పొందిన కళాకారులే ప్రదర్శించేవారు. ఈ విన్యాసాలను ప్రదర్శించే ఒక బృందంలో సుమారు 20-25 మంది ఉండేవారు. దొమ్మరులు గ్రామానికి వస్తే శుభం కలుగుతుందని ప్రజల నమ్మకం. కనుక వర్షాలు కురవకపోయినా, పంటలు పండకపోయినా దొమ్మరులను ఆ గ్రామానికి ప్రత్యేకంగా పిలిపించుకొని దొమ్మర ఆడపడచులతో వ్యవసాయ భూముల్లో ప్రదర్శన ఏర్పాటు చేయిస్తారు. వేపాకు, పసుపు, బియ్యం కలిపిన మూటను నడుముకు కట్టుకున్న దొమ్మర మహిళ గడ ఎక్కుతుంది, దాదాపు 40 అడుగుల ఎత్తున్న ఈ గడపై ఆమె విన్యాసాలు చేస్తూ ఒడిలో ఉన్న బియ్యాన్ని వ్యవసాయ భూములపై, బావుల దగ్గర చల్లుతుంది. ఈ తంతు ముగిశాక వర్షాలు కురిసి గ్రామం సుభిక్షంగా ఉంటుందని నమ్మకం.

దొమ్మరాట ప్రదర్శన కళారూపమే కాకుండా ధైర్య సాహసంతో కూడినటువంటి కళ కాబట్టి జనం ఈ ఆటను చూడటానికి పదే పదే ఇష్టపడే వాళ్ళు. జనం చూసినంతసేపు ప్రదర్శించే వారి సాహస నైపుణ్య, విన్యాసాలను చూస్తూ ముగ్ధులై, ఏ క్షణాన ఏమి జరుగుతుందో అనే ఆందోళనతో ఉత్కంఠభరితంగా చూసేవారు. ఇది సాధ్యమా? అనే ఆలోచనలో మునిగిపోయేవారు. వీరి సాహసాలకు చప్పట్లు, ఈలలు కొట్టకుండా ఉండరు. ఇది చూపరులను ఇట్టే ఆకర్షించే కళగా గుర్తుండి పోయింది. కాబట్టి అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ ఆటలో పిల్లలు ఆడే ఆటలు, స్త్రీలు మరియు పురుషులు ఆడే ఆటలు ఉంటాయి. దొమ్మరాటలోని విన్యాసాలను పరిశీలిస్తే ప్రధానంగా ఈ క్రింది ఆటలు కన్పిస్తాయి.

1. పిల్లిమొగ్గలు వేయటం
2. నాట్యము చేయటం
3. తాడుపై నడవటం
4. బాటిల్‌ను నోటితో ఎత్తటం
5. కనురెప్పలతో సూదిని ఎత్తడం
6. పల్టీలు కొట్టడం
7. గడమీద విన్యాసాలు
8. మైగాలు వేయడం
9. చిక్కులు తీయటం
10. కత్తుల సాధన
11. రింగులో దూరడం
12. బిస్‌పలక తొక్కడం
13. కత్తుల్లో దూకడం
14. నోటితో సైకిల్ ఎత్తడం
15. గడ్డపారపై తిరగడం

మొదలైన ఆటలు కన్పిస్తాయి. పై ఆటలన్నింటిలోనూ దొమ్మరాటకు కేంద్రబిందువుగా నిలిచే ఆట "గడమీద విన్యాసాలు" చేయటం.

**గడమీద విన్యాసాలు :**

అసలు దొమ్మరాట అంటేనే గడమీద విన్యాసాలు చేయటం అని అర్థం. ఇది చాలా ఉత్కంఠ భరితమైన, ముఖ్యమైన విన్యాసం. ఆట ప్రారంభం నుండి పిల్లిమొగ్గలు (Tumblers), పల్టీలు, ఇతర విన్యాసాలను చేసి అందరిని ఆకర్షించిన తరువాత చిట్ట చివరలో గడమీద విన్యాసాలు చేయటం. ఈ విన్యాసాన్ని స్త్రీలే చేసేవారు. ఇది చాలా కష్టమైన మెళకువలు గల విన్యాసమే కాకుండా సాహసం మరియు శిక్షణ కూడా అవసరం. ఈ విన్యాసాన్ని చూసి ముగ్ధుడు కాని ప్రేక్షకుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా ఈ విన్యాసం వల్ల గ్రామస్థులకు శుభం కలుగుతుందనే నమ్మకం ఉండటంవల్ల ఈ ప్రదర్శన చివరలో ప్రారంభమయినా కానీ ప్రేక్షకులందరు వేచి వుండి విన్యాసాన్ని తిలకించి వెళ్ళేవారు.



దాదాపు 30–40 అడుగుల ఎత్తు గల వెదురు బొంగును భూమిలో పాతిన తర్వాత మొదట పురుషులు ఎక్కి చిన్న చిన్న విన్యాసాలు చేసి త్వరగా క్రిందకు దిగేస్తారు. చివరకు అసలు విన్యాసాన్ని ప్రదర్శించే కళాకారిని గడపైకి ఎక్కుతుంది. క్రింద డోలు/డప్పుల వాద్యాలతో మరియు నగారా వాయింపులతో మారుమ్రోగుతుండగా అటు ప్రేక్షకులు, ఇటు దొమ్మరులు కళాకారిణిని ఉత్తేజపరుస్తారు. వెదురు బొంగుకు పైన ఉన్న ఇనుప కడ్డీకి, తన బొడ్డు దగ్గర కట్టుకున్న శూలం బిళ్లను తగిలించుకుంటుంది. తర్వాత కాళ్ళు చేతులు ఆకాశంలో (గాలిలో) నిటారుగా చాపి గుండ్రంగా తిరుగుతుంది. అలా తిరుగుతూ, తిరుగుతూ ఉంటే చివరగా అత్యంత వేగంతో తిరగడం వల్ల చూపరులకు ఒక విష్ణుచక్రం లేక బొంగరం తిరుగుతున్నట్లుగా కనబడుతుంది. కానీ ఇది చాలా ప్రమాదకరమైన ప్రక్రియ. ఈ విన్యాసాన్ని చూసిన ప్రతి ఒక్క ప్రేక్షకుని మనస్సులో ఇది సాధ్యమా? అనే ప్రశ్న ఉద్భవించడంతోపాటు, ఒళ్ళు గగుర్పొడుచుకుంటుంది. చివరగా తనతో తీసుకెళ్ళిన ఒడి బియ్యాన్ని, వేపాకులను అందరిని తలచుకుంటూ ఊరికి, అందరికీ మంచి జరగాలని, వర్షాలు పడాలని, పంటలు బాగా పండాలని తలచుకుంటూ కేకలు వేస్తూ ఊళ్ళోనూ, పొలాలపైన చల్లుతుంది. మొత్తానికి దొమ్మరులు గడెక్కడం వల్ల ఊరికి మంచి జరుగుతుందని నమ్ముతారు.

మొత్తం మీద ప్రాచీన కాలం నుండి సంచార జీవితాన్ని అనుభవిస్తూ వచ్చిన దొమ్మరులు అడవిలో ఉన్న క్రూర మృగాలతో పోరాడవలసినప్పుడు తమ భుజబలాన్ని ప్రదర్శిస్తూ, విలువిద్యలలో నైపుణ్యం పొంది తదనంతరం అవి క్రీడలుగా పరిణమించి ''దొమ్మరాట'' అనే ఒక కళారూపాన్ని ఏర్పరచుకున్నాయి.

నిజంగా ఒకనాటి దొమ్మరాటలోని ప్రదర్శనలను చూసే జిమ్నాయిజం మరియు పెద్ద పెద్ద సర్కస్ లాంటివి పుట్టుకొచ్చాయని చెప్పవచ్చును.

దొమ్మరుల విన్యాసాలు అలనాడు ఎంతో మెప్పు పొంది, ఒక స్థాయిలో ఉన్నవారు, జీవన గమనంలో వీరి విన్యాసాలు కేవలం ప్రదర్శించి పొట్టపోసుకునే స్థాయి వరకు దిగజారాయి. దీనికి ప్రధాన కారణం వీరి విన్యాసాలకు ఆదరణ లేకపోవడం. అందువల్ల ఈ వృత్తిని వదిలి వేరే ఇతర వృత్తులలో నిమగ్నమై పోయారు. అంతే కాకుండా సినిమాలు, టీవీల రాకతో వినోదం పంచే వీరి జీవితాల్లో విషాదం ఆవరించింది. అందువల్ల ఈ కళ ఇప్పుడు సంపూర్ణంగా అంతరించి పోయిందని చెప్పవచ్చును. అయితే ఇప్పుడు యాచించడం కోసం కొన్ని చోట్ల దొమ్మరాటలోని కొన్ని ఆటలు మాత్రం ప్రదర్శితమవుతున్నాయి. అయితే దొమ్మరాటకు కేంద్ర బిందువుగా నిలిచే "గడియాట" (గడికట్టి ఆడటం) మాత్రం పూర్తిగా నశించిందనే చెప్పవచ్చు.

ఈ విధంగా ఒక కాలంలో ఉన్నత స్థానాలలో ఉన్నా దొమ్మరాట కళాకారులు ఆదరణ లేక వీధిన పడాల్సిన పరిస్థితులు దాపురించాయి. కావున ఇలాంటి జానపద కళారూపాలను ప్రభుత్వాలు గుర్తించి ఆదరించి ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా వుంది. మి

# మచిలీ బందరు

- వంగోలు వెంకటరంగయ్య

మచిలీ (మఛిలీ) మత్స్యశబ్దభవముగ నున్నది. బందరు (బందర్) రేవు అను నర్థముగల పార్సీ పదముగ నున్నది. ఈ సాంస్కృతిక, అన్యదేశీయ శబ్దసంయోగ మెట్లు కలిగినదియో, యేకాలమున కలిగినదియో నిర్ణయింప వలనుగాకున్నది. దేశచరిత్రము నవలంబించిన నిచట ఓడరేవు అరబ్బీలచేత క్రీ.శ. పదునైదవ శతాబ్దమున స్థాపింపబడిన దనియు, ఎవరో కర్నాటక రాజులు ఇచట నొక మసీదు కట్టుకొనుటకు మహమ్మదీయులకు క్రీ.శ.1425 ప్రాంతముల నుత్తరు విచ్చినట్లును తెలియుచున్నది. (కృష్ణా డిస్ట్రిక్టుమాన్యుయులును, డాక్టరు మెక్లీనుగారి మద్రాసు అడ్మినిస్ట్రేషన్ మాన్యుయులును) ఇటుల తురకల సంబంధ మేర్పడిన పిదపనే దీనికి ''బందరు''అను పేరు వచ్చియుండవచ్చును గాని "మచిలీ" యను నామచరిత్రమున కీ యాధారము చాలదు. ప్రాయికముగ "మచిలీ" శబ్దము మత్స్యశబ్దవికారముగానే యుండవచ్చును. "మత్స్యము"నకు "మచ్చ" అను వికృతి యున్నట్లు వామన శివరామ ఆపటేగారి సంస్కృత డిక్షనరీలో నున్నది. స్యాద్వాదము నాశ్రయించి మత్స్యముతో దీనికి సాజాత్య మంగీకరించిన మాత్రాన ఈ గొప్ప పట్టణమున కాచేప పేరు వచ్చుటెట్లు? బందరు కోటకు "చేపకన్ను" వంటి దర్వాజా యొకటి యుండినదనియు, దానిచే "మచిలీబంద"రను పేరు వచ్చిన దనియు వయోవృద్ధులు కొందరు చెప్పెదరు. ఏప్రాతఃకాలముననో యొక పెద్దచేప (తిమింగిలము) సముద్రమున ఆ రేవునకు కొట్టుకొని వచ్చినదని కొందరు చెప్పెదరుకాని ఈ నిస్సత్తులవలన ఈ నగర ప్రాచీనత్వమున కొక హాని కలుగును. అరబ్బీలు, లేక ఇతర తురుష్కాది జాతులవలన నీపేరు కలిగినదని యొప్పుకొనవలసి యుండును. ఈ వైదేశిక జాతులీ భరతఖండమున ప్రవేశించుటకు ముందు ఈయూరే యుండలేదని దీనికి ప్రాగభావస్థితి నంగీకరింపవలయునా? వారీయూరికి నివేశనమునకు వచ్చి గ్రామము నేర్పరచిరా? ఇట్టి స్థితి దురూహ్యము, ఏల ననగా, మార్కోపోలో, పార్టిమా లోనగు ఐరోషీయయాత్రికుల కాలముననే ఈ యూ రుండినటుల తెలియుచున్నది. ఈ యిద్దరి దేశయాత్రాకాలము అనుక్రమముగ క్రీ.శ.13, 14 శతాబ్దమధ్యముగ నున్నది. ఉదాహృత మసీదునిర్మాణము ఇందు కర్వాచీన మయియున్నది. అంతియగాక పైనజెప్పిన మెక్లీనుగారి మాన్యుయులులో దీనికి ''మాసోలియా'' యని గ్రీకు అక్షరములలో పేరు వ్రాయబడియ్యుది. ఇంతకును ఇది సముద్రతీరమున నొక యోడరేవుగా నుండుట ప్రసిద్ధము.



అలనాటి బందరు రేవు చిత్రం

సేకరణ : కుర్రా జితేంద్రబాబు

మత్స్యసంబంధముండుటంబట్టి మహాభారత ప్రసిద్ధిగల మత్స్యదేశములోని పట్టణమా యని యూహించిన నదియు సమంజసముగతోపలేదు. భారత గత మత్స్యదేశము ఇప్పటి రాజపుత్రస్థాన గత జయపుర పరిసరములలో నుండినటుల యొక అభిప్రాయమున్నది. మన మచిలీ ప్రాగ్దిశయందున్నది. రాజపుత్రస్థానములు భరతఖండ వాయవ్యభాగమున నున్నవి.

ఇక, ఎవరో మత్స్యభుక్కులు ప్రబలి, చేపల ఎగుమతి దిగుమతులకు ఒప్పియున్నదని మచిలీ, లేక మఛ్చిలీ యని పేరుపెట్టి, ఆ సరకువ్యాపారము జరుగు రేవు అయినందున "మచిలీబందర్" అని నామకరణము చేసియుండుటకును ఏకాలముననైన చేపలయెగుమతికి ప్రసిద్ధమైన రేవయినటుల చరిత్రమున మృగ్యముగ నున్నది. ఇచట నివేశనము కుదుర్చుకొనిన అరబ్బీ వర్తకులు కాయధాన్యములు, వెలగల లోహములు, బందరు చీటీ గుడ్డలు మొదలగువాని నిచటి నుండి యోడల కెక్కించుచుండినట్లు తెలియుచున్నది. కాబట్టి చేపలరేవుసిద్ధాంత మాదరణీయముగా కనుపడదు.

"బందర్" అనుపేరును పుచ్చుకొని మనపండితులు దీనిని "బృందారక"పురి జేసిరి. ఇది విచిత్రకల్పనయని సంతోషింపవచ్చును. అంతమాత్రమే. ఇది మాక్సుముల్లరును మోక్షమూలరు అనియు, గ్రిఫిత్‌ను గిరిభిత్ అనియు అని నట్లుండును. చెన్నపట్టణ సమీపముననుండు ఫిరంగి కొండ భృంగిశైలమట. ఇట్టి కల్పనలకు మితిమేర లుండవు.

తెలుగుభారతమునందలి ద్రోణపర్వములోని మొదటియాశ్వాసపు కడభాగమున రెండుచోట్ల మచ్ఛల్లి, లేక మచ్ఛిల్లి యనుపదమున్నది. సందర్భమునుబట్టి ఇది యొక దేశనామముగ నున్నది. (1) తుండ కేరళ మాళవ శిలీంధ్ర మగధ మచ్ఛిల్లికాది దేశాధీశులును ఇత్యాది (ద్రోణ. 1-320 వచనము). (2) తుండి మగధ కేరళ మచ్ఛిల్లి కాదులు ఇత్యాది. (ద్రోణ. 1-320 వచనము). ఈ రెండు ఉద్ధృతములలో "మచ్ఛిల్లిక"ను ఆధారపరచుకొని క్రీ.శ.1855 ప్రాంతముల రాక్షసనామసంవత్సరమున తెలుగక్షరముల నచ్చుపడిన బ్రహ్మశ్రీ పురాణం హయగ్రీవ శాస్త్రులవారి ప్రతియందును, కలకత్తాలో నాగరాక్షరముల నచ్చుపడిన ప్రతాప చంద్రరాయిగారి ప్రతియందును, టి.ఆర్. కృష్ణాచార్యులవారి కుంభఘోణ ప్రతియందును, ఈవల ఆంధ్రగీర్వాణ గ్రంథముద్రణాదీక్షితులగు శ్రీవావిళ్లవారి ప్రతియందును ఉదాహృత తిక్కన వాక్యములకు సరియగు ఘట్టముల నన్వేషింపగా ఈ నాలిగింట నెందును మచ్ఛలి (మచ్ఛిల్లి) కానరాదు. ఆ పట్టున ఈ శ్లోకము లున్నవి:

"మాళవ స్తుండికేరశ్చ రథానా మయుతైస్త్రిభిః

– ఇత్యాతి (అధ్యాయము 17)

తిక్కయజ్వ క్రీ.శ. పదుమూడవ శతాబ్దమున వర్ధిల్లినటుల కీర్తిమూర్తులు రావుబహద్దూరు వీరేశలింగము పంతులుగారు తమకవి జీవితముల"లో నిర్ణయించియున్నారు. పదమూడవ శతాబ్దమునాటికే తురుష్కు లిచట చేరి "మఛిలీబందర్" అను చేపలరేవును ఏర్పరచి యుందురా యనుట కాధారము దుర్లభము. సోమయాజిచేత నుండిన, భారతప్రతియందు ''మచ్ఛిల్లి'' పాకముగల శ్లోక ముండియుండు నను నూహ సాహసము కాజాలదు. "తుండీర"మని యరువదేశము పలుకబడినది. ఇదియే తొండమండలము (చెంగల్పట్టు మొదలు నెల్లూరు జిల్లా సూళ్లూరు పేట ప్రాంతముల వరకు నుండవచ్చును). కేరమని మలయాళదేశము ముచ్చటింపబడినది (ఇదియే కేరళము). ఆంధ్రదేశమునకీ ప్రణాళికయందు స్థానము లేక పోవలయునా? ఆంధ్రులును మహాభారతయుద్ధమున పాల్గొనినటుల మహాభారతమున అగపడుచున్నది.

ఇత్యాది హేతు సమవాయముచే స్థాపింపదగిన నిగమనమేమనగా, మచిలీపట్టణమునకు విదేశీయ మ్లేచ్ఛ భాషాజన్యభ్రాంతి నిరసింపబడి వైయాసిక ప్రామాణ్యమును, ఐతిహాసిక ప్రథయు అంగీకరింపదగియున్నవి. కాలగతిచేతను, ఉచ్చారణ సౌలభ్యముకొరకును "మచ్ఛిల్లి" "మసూలా" కావచ్చును. ''బందర్'' అనునది నౌకావ్యాపారమును తెలియజేయుపదవే. ఇది మన మచిలీపట్టణమున కంటింపబడినట్లు మరియు ననేక ఓడరేవుపట్టణములకును చేర్పబడియున్నది. బొంబాయిలో అపోలో బందర్, కరాచీ బందర్ ఇత్యాదు లెన్నియో కలవు.

"బందర్" పద సంయోగ మాత్రమున ఆర్య హైందవ జాతి నశింపజాలదు. కాబట్టి పూర్వము మహాభారత కాలమునను "మచ్ఛిల్లీ" యను నొక రాజ్య మాంధ్రదేశమున వెలసియుండిన దనియు, దాని ముఖ్యపట్టణముకూడ ''మచ్ఛిల్లి''గా నుండి ఈనాటి గాలివానల పాలైన "మసూలీపటాం"గా మారియుండవచ్చుననియు మనవి. బందరు వారిందు కేమందురో? ❀

# చదవండి...




**❖ కులమేది?** పురాణాలనుంచి, మహాభారతం నుంచి ఎన్నో ఉదాహరణలు తీసుకుని కులమనేదానికి శాస్త్రీయత లేదని యలమంచిలి వెంకటప్పయ్య గారు తయారు చేసిన కూర్పు ఈ పుస్తకం. 1977వ సం॥లో ఈ పుస్తకం మొదటిసారిగా ప్రచురించబడి ఇప్పటికి 5వ ముద్రణకు నోచుకుంది. *విశాలాంధ్ర వారి అన్ని శాఖలలోనూ ప్రతులు లభిస్తాయి.*




**❖ బుద్ధుని చివరి రోజులు :** భిక్షునాన మోళి రచించిన 'ది లైఫ్ ఆఫ్ ది బుద్ధా అకార్డింగ్ టు దీ పాలీ కేనన్,' శ్రీలంక వారి రచన ఆధారంగా ఈమని శివనాగిరెడ్డి తెలుగు సేత. బుద్ధుని మహాపరినిర్వాణ విశేషాలు, "శీల, సమాధి ప్రజ్ఞలతో ధమ్మ వినయాలను పాటిస్తే మళ్ళీ మళ్ళీ పుట్టి భవచక్రం నుండి విడివడి దుఃఖంనుంచి పూర్తిగా విముఖలవుతారు" అన్న బుద్ధునిమూటలు చాలా ఆశక్తిని కలిగిస్తాయి. *పే. 51, ₹ 30. ప్రతులకు: ధర్మదీపం ఫౌండేషన్, హైదరాబాద్, ఫోన్ : 040-27635654 ను సంప్రదించగలరు.*

**❖ యలమంచిలి వెంకటప్పయ్య** రచనలను విషయ పరిశీలన చేస్తూ సాగిన రచనయిది. ప్రజలలోని మూఢనమ్మకాలు, మూఢాచారాలు పోవాలంటే మతప్రశస్తి లేని నిస్వార్థ రాజ్యాంగ వ్యవస్థ ఉండాలని కోరారు యలమంచిలి వారు. తాము ముందు వ్రాసిన రచనలలో హేతువాదిగా కనిపించినా 1995 వ సంవత్సరంలో ప్రచురించబడ్డ 'పెద్దలేమన్నారు?' అన్న పుస్తకంలోని కొన్ని సూక్తులను పరిశీలించినట్లయితే ఆయన శాస్త్రీయ హేతువాది కాదనిపిస్తుంది అంటూ పరిశీలకులు తుమ్మా భాస్కర్ ముక్తాయింపు ఇచ్చారు. *ప్రాప్తిస్థానం: యలమంచిలి మురళీధర్, సెల్: 9440327500, విజయవాడ.*




**❖ సాహితీబంధువు :** రచయిత, కవి, మానవతామూర్తి అయిన శ్రీ ఆర్. రంగస్వామిగౌడ్‌పై వారితో అత్యంత సన్నిహితులుగా మసలిన మిత్రులు ముంగర జాషువ చేసిన వారి జీవన రేఖల చిత్రమే ఈ పుస్తకం. మొదట్లో రంగనాథ గౌడ్‌లో కనిపించిన మొరటు భక్తితత్వం, మానవతా వాదం వైపుకు క్రమేపి పయనించి మహామానవతనను అందుకునే ప్రయత్నంగా రచయిత నిష్పాక్షికంగా విశ్లేషించారు. ఒక మధురమూర్తిపై మరొక మధురమూర్తి వ్రాసిన రచన ఇది. *ప్రతుల కొరకు: యం. జాన్ సుగుణాకర్, నాగార్జునసాగర్, సెల్ : 9052676007.*

**❖ ప్రాచీన భారతదేశ చరిత్ర :** పురాణేతిహాసాలు, చరిత్ర అధ్యయనం ప్రతి జాతికి అవసరం. భారతదేశాన్ని పాలించిన ఎందరో రాజులు తమ సామ్రాజ్యాల చరిత్రను అధికారికంగా ఎప్పుడూ గ్రంథస్థం చేయకుండా ఉపేక్షించారు. దానివల్ల కొన్ని చారిత్రక ఘటనలు, రాజకీయ సిద్ధాంతాలు వక్రీకరించబడ్డాయని భావిస్తూ వేదాంతం లక్ష్మీప్రసాదరావు ప్రాచీన పురాణేఇతిహాసాలు, వేదవాఙ్మయం అధ్యయనం చేసి రాజులు, ఋషులు, వారి వంశాలను ఒక క్రమగతిలో పాఠకుల ముందు ఉంచారు. *ప్రతులకు : సాత్విక్ బుక్ హౌస్, విజయనగర్‌కాలనీ, హైదరాబాదు, ఫోన్ : 040-23343782.*




**❖ మానవత్వమా నీవెక్కడ?** అంటూ వర్ణ వివక్షణను, ఎండగడుతూ కష్టజీవుడు అండగా కవికి సామాజికస్పృహ ఉండాలని బలంగా నమ్మిన కె. విల్సన్‌రావు వ్రాసిన కవితాసంపుటి "న్యాయనిర్ణేతవూ నీవే". *పే. 72, ₹ 30. ప్రతుల కోసం, కె. రాజమణి, యలమంచిలి, సెల్ : 8985435515.*




❖ *సి.పి. బ్రౌన్ అకాడమి, పంజగుట్ట, హైదరాబాదు (ఫోన్ : 040-23423188)* వారు **తెలుగు జాతి రత్నాలు** పేరుతో మూడు పుస్తకాలు ప్రచురించారు. అవి.

***1. పుట్టపర్తి నారాయణాచార్యులు :*** రచయిత్రి పుట్టపర్తి నాగ పద్మిని సర్వతోముఖ ప్రతిభాశాలయిన తన తండ్రి జీవిత విశేషాల గురించి, కావ్యసృష్టి గురించి, వివిధ కావ్య సమీక్షా విశేషాల గురించి సోదాహరణంగా వివరించి వ్రాసిన పుస్తకమిది. పుట్టపర్తి వారి అభిమానులు, తెలుగు సాహిత్యాభిలాషులు తప్పక చదవవలసిన పుస్తకమిది. *పే.216, ₹ 95.*

***2. మునిమాణిక్యం నరసింహారావు :*** తెలుగు పత్రిక సాహిత్యరంగంలో విలక్షణ రచయిత్రిగా పేరుగాంచిన డా. కె.బి. లక్ష్మి వ్రాసిన మునిమాణిక్యంవారి జీవిత చిత్రణ ఇది. ఉన్నంతలో సర్దుకుంటూ దాంపత్య జీవన మాధుర్యాన్ని తెలుగువారికి రుచి చూపి, సాహిత్యంలో ఎప్పటికీ నిలచి వుండే కాంతాన్ని సృష్టించిన హాస్యకథా చక్రవర్తి జీవితం గురించి మనమంతా తప్పక తెలుసుకోవాలి. *పే.129, ₹ 95.*




***3. కల్నల్ సి.కె. నాయుడు :*** దాదాపు మూడు దశాబ్దాలుగా క్రీడా పాత్రికేయునిగా పేరుగాంచిన సి. వెంకటేష్ ఈ పుస్తక రచయిత. సి.కె. నాయుడును యుగపురుషునిగా కీర్తించటమే కాకుండా క్రికెట్ ఆటను నరనరాలలో జీర్ణించుకున్న వెంకటేష్ కన్నా ఇంత హృద్యంగా మరెవ్వరు రాయగలరు? *పే.123, ₹ 95.*

❖ **స్వర్ణ తుషారం :** ఆముదాల మురళి రాసిన చంధస్సుతో కూడిన పద్యఖండికలు. సులువుగా అర్థం చేసుకోగలిగే వ్యావహారిక భాషలో రచన సాగటంతో ఆద్యంతము చదివిస్తుంది. *పే.80, ₹ 50. ప్రాప్తిస్థానం : ఆముదాల విజయకుమారి, తిరుపతి, సెల్ : 9440432683.*




❖ **అమెరికాలయానం అనుభవాల గానం :** యాత్రా రచనలు తెలుగులో చాలా తక్కువ వచ్చాయి. టైటిల్‌లో ఉన్న పొయిట్రి రచనలో కొనసాగింది. రచయిత తాను చూసిన అమెరికా విశేషాలను దినచర్య రూపంలో వివరిస్తూ 'గంగలో పోసినా కొలిచి పొయ్యాలా' అన్నట్టు, ఎక్కడ ఎన్ని డాలర్లు ఖర్చయ్యాయో తెలుపుతూ మధ్య మధ్యలో ఛందోబద్ధ రీతుల్లో రచించబడ్డ పద్యాలతో మనల్ని అక్కడ అక్కడ చిలిపిగా పలుకరిస్తారు ('కవలపిల్లల్లవలె కళకళ లాడుచూ ఏకరూపు నున్న ఇండ్ల వరుస').




❖ **అక్షర పుష్పాలు :** రచయిత తన మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధువులపైనే కాక తన స్వగతాలు కలుపుకొని వ్రాసిన 65 కవితా ఖండికల సంపుటి.

ఈ రెండు పుస్తకాలు నాటకరంగ మార్తాండుడు, దర్శకుడు, రచయిత, కవి అనేక పురస్కారాలు పొంది, ఆత్మీయులతో 'సోంబాబు'గా పిలవబడే దుగ్గిరాల సోమేశ్వరరావు రచనలు. పుస్తకం ఒక్కొక్కటి *150 పేజీలు, 75 రూ. ప్రాప్తిస్థానం : 040-23402266, సెల్ : 92480342266.*

❖ **శ్రీకాకుళం కవితల ధార :** సామాజిక బాధ్యతలపట్ల అవగాహనతో సగటు మనిషివైపు రచనలు సాగించిన పదహారుమంది కళలయోధుల కవితలను సంపుటీకరించినవారు మోదు రాజేశ్వరరావు. *పే. 44, ₹ 50. సెల్ : 9396447227.*

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

**I. మిసిమి ప్రచురణలు** ₹

| | | | |
|---|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | (హార్డ్ బౌండ్) | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | *అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి* | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు | " " | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 | " " | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 | " " | 200.00 |
| 6 | ఆచార్య నాగార్జునుడు | " " | 150.00 |
| 7. | దూర తీరాలలో... | *వల్లభనేని అశ్వినీకుమార్* | 60.00 |
| 8. | అమాహ | " " | 60.00 |
| 9. | అంతర్వీక్షణం | " " | 50.00 |
| 10. | సిద్ధార్థ | " " | 50.00 |
| 11 | నాలో నేను | " " | 30.00 |
| 12. | కథాంజలి–1 | *ఎస్సారె* | 80.00 |
| 13. | కథాంజలి–2 | " " | 110.00 |
| 14. | THE THUNDERCLOUD | S.R.A. | 120.00 |
| 15. | భట్టిప్రోలు కథలు | డా. నక్కా విజయరామరాజు | 150.00 |
| 16. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | కథా సాహితి | 150.00 |
| 17. | IN QUEST OF UTOPIA | Mrs. Daggubati Purandeswari | 250.00 |
| 18. | గురవాయణం | డాక్టర్ *గురవారెడ్డి* | 150.00 |

**II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *మరుపూరు కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝా, అనువాదం : జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం – *ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

**III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | బౌద్ధ ధర్మ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 2. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 3. | మిళిందపన్హ : ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 4. | మహా పరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 5. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – అన్నపరెడ్డి బుద్ధఘోషుడు | 40.00 |

**IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు**

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |


మిసిమి మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536

E-mail : misimi_monthly@yahoo.in ; Visit us at : www.misimi-monthly.com

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹200/- తో పాటు పంపండి. బయటి చెక్కులకు అదనంగా ₹30/- కలపండి.

**1. పేరు :** ..............................................................

**2. చిరునామా :**

ఇం.నెం. ..............................................................

వీథి ..............................................................

పేట ..............................................................

ఊరు ..............................................................

పిన్ ..............................................................

సెల్ ..............................................................

**3. సంతకం :** ..............................................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.

మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in
Visit us at : www.misimi-monthly.com



స్వేచ్ఛా ప్రపంచం

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2009-11



అల్విదా...